www.vishalabharati.com
epaper.vishalabharati.com

గురువారం, హైదరాబాద్
01 అక్టోబర్ 2026
సంపుటి:4 సంచిక: 266

# విశాల భారతి

తెలుగు దినపత్రిక

## సిరిసిల్ల ఏమైనా శత్రు రాజ్యమా..?

- సీఎం సిరిసిల్ల పర్యటనతో ఇరుపార్టీల మధ్య మాటల యుద్ధం
- భారీ పోలీసు నిర్బంధాలపై హరీశ్‌రావు తీవ్ర ఆగ్రహం
- కేటీఆర్ హయాంలోనే సిరిసిల్లలో అభివృద్ధి జరిగిందని వాదన
- రూ.345 కోట్ల అభివృద్ధి పనులను ప్రారంభించనున్న సీఎం
- నేతన్నల సంక్షేమం, పవర్‌లూమ్ రంగంపై పరస్పర విమర్శలు

03






## నిమ్స్ అధికారిపై ఏసీబీ సోదాలు

- బినామీల ఇళ్లలో ఏసీబీ సోదాలు
- రూ.4.94 లక్షల నగదు స్వాధీనం
- రూ.2.70 కోట్ల ప్లాట్ పత్రాలు గుర్తింపు
- పెట్టుబడులు, భూముల డాక్యుమెంట్లపై దర్యాప్తు

02



వ్యాధులు

## విరుచుకుపడకముందే మేల్కొనాలి

- మలేరియా.. డెంగ్యూ.. చికున్‌గున్యాపై ముందస్తు నిఘా
- పీహెచ్‌సీలో సాధారణ ప్రసవాలకు ప్రాధాన్యం
- మందులు, వ్యాక్సిన్లు అందుబాటులో ఉండాలి
- విద్యార్థుల హాజరుపై నిర్లక్ష్యం వద్దు
- వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యం
- నెల్లికుదురులో పీహెచ్‌సీ, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కలెక్టర్ స్నేహ శబరిష్ ఆకస్మిక తనిఖీలు

05





# సిరిసిల్ల గడీల మీద ఫిరంగులమై పేలుదాం

### సిరిసిల్లలో రూ.345 కోట్లతో వివిధ అభివృద్ధి పనులకు రేవంత్ శ్రీకారం

- వేములవాడ రాజన్న ఆలయ విస్తరణకు రూ.99.40 కోట్లు కేటాయింపు
- కేసీఆర్ పాలనలో సిరిసిల్ల సమస్యల నిలయంగా మారిందని సీఎం విమర్శ
- కేంద్రంతో సత్సంబంధాలు కలిగి ఉంటూ రాష్ట్రానికి నిధులు సాధిస్తామని వెల్లడి
- కరీంనగర్‌లో తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించిన సీఎం రేవంత్ రెడ్డి
- పర్యటన నేపథ్యంలో సిరిసిల్ల ప్రాంతంలో బీఆర్ఎస్, బీజేపీ నేతల ముందస్తు అరెస్టులు

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

సిరిసిల్ల జిల్లాలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటన చాలా ఘనంగా సాగింది. వేములవాడ రాజన్న సాక్షిగా రాష్ట్రంలో అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లేందుకు భారీ ఏర్పాట్లు చేశారు. ముఖ్యమంత్రి హోదాలో ఆయన పర్యటించిన సమయంలో అనేక కీలక ప్రాజెక్టులకు శంకుస్థాపనలు చేశారు. అదేవిధంగా కొన్ని పూర్తియిన నూతన భవనాలను అధికారికంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమాల్లో పీసీసీ చీఫ్ మహేష్‌కుమార్ గౌడ్ సహా పలువురు మంత్రులు పాల్గొన్నారు. స్థానిక ప్రజలను కలుసుకుంటూ అంబేడ్కర్ కూడలి నుంచి సభా వేదిక వరకు మూడు కిలోమీటర్ల మేర ఘనంగా పాదయాత్ర నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఈ పాదయాత్రను విజయవంతం చేశారు. ఉత్సాహభరితమైన వాతావరణంలో జరిగిన ఈ పర్యటన రాజకీయంగానూ ప్రాధాన్యత సంతరించుకుంది. సెప్టెంబర్ ముప్పై రెండు వేల ఇరవై ఆరు తేదీన జరిగిన ఈ పర్యటన విశేషాలు రాష్ట్రవ్యాప్తంగా రాజకీయ చర్చనీయాంశంగా మారాయి. ప్రభుత్వ పాలన తీరుపై ప్రతిపక్షాల విమర్శలకు సీఎం గట్టిగా సమాధానం చెప్పారు. రూపాయి రూపాయి కూడబెట్టి చేపట్టిన ఈ పర్యటనలో మొత్తం మూడు వందల నలభై ఐదు కోట్ల డెబ్బై ఎనిమిది లక్షల రూపాయల భారీ నిధులతో వివిధ అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. పెద్దూరులో ఇందిరా మహిళా శక్తి భవనాన్ని సీఎం స్వయంగా ప్రారంభించారు. జిల్లాలో రెండు ఆర్డీవో కార్యాలయాలతో పాటు నాలుగు తహసీల్దార్ కార్యాలయాల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కోనరావుపేట అలాగే సిరిసిల్ల ప్రాంతాల్లో

మిగతా 3లో..

## బీజేపీతో పొత్తు ఉండదు

- భవిష్యత్తులో బీజేపీతో ఎట్టి పరిస్థితుల్లోనూ పొత్తు ఉండదు
- త్వరలోనే రాష్ట్రంలో మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వం వస్తుంది
- ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ విఫలమైంది
- జనాభా ఆధారిత డీలిమిటేషన్‌తో దక్షిణాదికి నష్టం కలుగుతుంది
- కేంద్ర హోంమంత్రి అమిత్ షా హామీలను నమ్మలేము
- తెలుగు రాష్ట్రాల్లో అసెంబ్లీ సీట్లు ఎందుకు పెంచలేదు?




**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీతో ఎలాంటి పొత్తు ఉండదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు. గత 26 సంవత్సరాలలో ఒక్కసారి కూడా ఆ పార్టీతో పొత్తు పెట్టుకోలేదని తెలిపారు.2014, 2018, 2023 ఎన్నికల్లో తమ పార్టీ ఒంటరిగానే పోటీ చేసింది.

మిగతా 2లో..

## కరువు.. కరెంట్ కష్టాలు



- వర్షా భావంతో నలభై శాతం పంటలు ఎండిపోయాయి
- నాణ్యమైన త్రీ-ఫేజ్ కరెంట్ అందడం లేదు
- లో-వోల్టేజీతో పంపుసెట్లు కాలిపోతున్నాయి
- రైతులు రాత్రంతా పొలాల వద్దే కాపలా ఉంటున్నారు
- కరెంట్ కోతలపై సబ్ స్టేషన్ల ఎదుట ధర్నాలు చేశారు
- పంటలు, మోటార్లకు నష్టపరిహారం ఇవ్వాలి

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలో రైతులు ప్రస్తుతం తీవ్రమైన సంక్షోభం ఎదుర్కొంటున్నారు. వర్షాభావ పరిస్థితులు అస్తవ్యస్త విద్యుత్ సరఫరా వల్ల వేలాది ఎకరాల్లో పంటలు ఎండిపోయే ప్రమాదం ఏర్పడింది. జిల్లాలో సాధారణ సాగు 21.32 లక్షల ఎకరాలు కాగా వర్షాభావం కారణంగా 16.61 లక్షల ఎకరాల్లోనే సాగు చేశారు. సాధారణ వర్షపాతం 457.6 మిల్లీమీటర్లు కాగా సెప్టెంబర్ నాటికి కేవలం 311.5 మిల్లీమీటర్లు మాత్రమే నమోదైంది. పాలమూరు జిల్లాలో సాధారణ సాగు 3,45,913 ఎకరాలు కాగా 2,92,313 ఎకరాలు మాత్రమే సాగు చేశారు. అయినా వర్షాలు సరిగ్గా లేకపోవడంతో పత్తి వరి మొక్కజొన్న వేరుశెనగ పంటలు ఎక్కువగా దెబ్బతిన్నాయి. ప్రాజెక్టులకు వరద నీరు రాకపోవడంతో రైతులు పూర్తిగా బోరు బావులపై ఆధారపడి వ్యవసాయం చేశారు.

మిగతా 2లో..

## పాత బియ్యం.. కొత్త బ్రాండ్లు

- ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో భారీ రైస్ కుంభకోణం సాగుతోంది
- రేషన్ దొడ్డు బియ్యాన్ని సన్న బియ్యంగా మార్చి అమ్ముతున్నారు
- సన్న ధాన్యాన్ని ప్రైవేట్ మార్కెట్‌లో విక్రయించి కోట్లు గడిస్తున్నారు
- ఈ దందా వెనుక అధికారుల సిండికేట్ హస్తం ఉన్నట్లు ఆరోపణలున్నాయి
- టాస్క్ ఫోర్స్ దాడుల్లో రేషన్ బియ్యం పట్టుబడి, కేసులు నమోదయ్యాయి
- బాధ్యులపై పీడీ యాక్ట్ కింద చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు

02




## సింగరేణిని ముంచేస్తున్నారు !

- సింగరేణికి రూ. 55 వేల కోట్ల బకాయిలు చెల్లించాలని ఈటల డిమాండ్
- నిధులు లేక అధిక వడ్డీలకు అప్పులు తెచ్చి జీతాలు ఇస్తున్న దుస్థితి
- కాంట్రాక్ట్ కార్మికులకు రోజువారీ వేతనం రూ.1,250 ఇవ్వాలని కోరిక
- సింగరేణికి బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలు అన్యాయం చేశాయని విమర్శ
- నాసిరకం కరెంట్ వల్ల రైతుల మోటార్లు కాలిపోతున్నాయని ఆందోళన
- కార్మికుల సంక్షేమం కోసం బీజేపీ పోరాటం కొనసాగుతుందని స్పష్టీకరణ




**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోరాడిన సింగరేణి కార్మికుల బ్రతుకులు నేడు పూర్తిగా చీకటిమయంగా మారాయి. మంచిర్యాల జిల్లాలోని నస్పూర్ ప్రాంతంలో జరిగిన భారీ సింగరేణి ధర్నా సభలో మల్కాజ్‌గిరి పార్లమెంటు సభ్యులు ఈటల రాజేందర్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో లక్షా పదిహేను వేల మందిగా ఉన్న శాశ్వత కార్మికుల సంఖ్య నేడు దారుణంగా పడిపోయి కేవలం ముప్పై తొమ్మిది వేలకు మాత్రమే పరిమితం కావడం చాలా బాధాకరం. ప్రైవేటు వ్యక్తుల స్వార్థ ప్రయోజనాల కోసం ఓపెన్ కాస్ట్ ప్రాజెక్టులను ఇష్టానుసారంగా ప్రైవేటుపరం చేయడం వల్ల కార్మికులు తీవ్రంగా నష్టపోతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి సింగరేణి సంస్థకు తక్షణమే రావాల్సిన యాభై ఐదు వేల కోట్ల రూపాయల భారీ బకాయిలను వెంటనే విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. నిధులు లేక సంస్థ తీవ్ర ఇబ్బందులు పడుతోంది.

మిగతా 3లో..



ఎమ్మెల్సీ అభ్యర్థి ఎంపికపై

## ఉత్తమ్ అసంతృప్తి?

- నల్గొండ-ఖమ్మం-వరంగల్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా సర్వోత్తమ్ రెడ్డి ఖరారు
- అభ్యర్థి ఎంపికపై మంత్రి ఉత్తమ్ అసంతృప్తి
- డిసెంబర్ 30న తుది ఓటర్ల జాబితా విడుదల కానుంది
- నిరుద్యోగ సమస్యలు, ఉపాధి ఈ ఎన్నికల్లో ప్రధాన అజెండా
- టికెట్ దక్కని నాయకులకు భవిష్యత్తులో సముచిత స్థానంపై చర్చ
- కాంగ్రెస్ శ్రేణులు క్షేత్రస్థాయిలో ప్రచార వ్యూహాలు సిద్ధం చేస్తున్నాయి

03




## ఓట్ల తొలగింపుపై సమాధానం చెప్పాలి

- ఈసీపై అనుమానాలు తొలగించి పారదర్శకత పాటించాలి
- సంక్షేమ పథకాలను ఫ్రీబీస్‌గా చూడొద్దని స్పష్టీకరణ
- రాష్ట్రాల మధ్య ఆరోగ్యకరమైన పోటీ ఉండాలని వెల్లడి
- హైటెక్ సిటీ, మౌలిక వసతులే తెలంగాణ అసలైన బలం
- సీఎం రేవంత్‌తో వంద శాతం సఖ్యతతో పని చేస్తున్నాం
- కాంగ్రెస్‌ను వీడిన పాత నేతలు తిరిగి రావాలని పిలుపు

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

కేరళలోని కొచ్చి నగరంలో అత్యంత ఘనంగా జరిగిన ఇండియా టుడే సౌత్ కాన్క్లేవ్ వేదికపై తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన దేశ రాజకీయాలపై సంచలన వ్యాఖ్యలు చేశారు. దేశంలో సర్ ప్రక్రియ నేపథ్యంలో ఎన్నికల సంఘంపై ప్రజలలో అనేక తీవ్రమైన అనుమానాలు ఉన్నాయని ఆయన స్పష్టం చేశారు. వేలాది ఓట్ల తొలగింపు కార్యక్రమం ప్రత్యక్షంగా ఎన్నికల ఫలితాలపై భారీ ప్రభావం చూపుతుందని ఆయన హెచ్చరించారు. ఎన్నికల సంఘం ప్రతి అంశంపై ప్రజలకు చాలా

మిగతా 2లో..

## నిమ్స్ అధికారిపై ఏసీబీ సోదాలు

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

నిమ్స్ అదనపు మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ నోరి లక్ష్మీ భాస్కర్‌పై ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో దర్యాప్తు కొనసాగిస్తున్న అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ).. ఆయనకు సంబంధించిన అనుమానితులు, బినామీల ఇళ్లలోనూ సోదాలు నిర్వహించింది. హైదరాబాద్‌లోని ఐదు ప్రాంతాల్లో చేపట్టిన తనిఖీల్లో నగదు, వ్యవసాయ భూములకు సంబంధించిన పత్రాలు, ఓపెన్ ప్లాట్ డాక్యుమెంట్లు, పెట్టుబడులకు సంబంధించిన వివరాలతో పాటు పలు కీలక ఆధారాలను అధికారులు గుర్తించినట్లు ఏసీబీ వెల్లడించింది.

**ధనరాజ్ ఇంట్లో నగదు స్వాధీనం**

ఏసీబీ తనిఖీల్లో నిమ్స్ ఉద్యోగి ధనరాజ్ ఇంట్లో రూ.4,94,394 నగదు గుర్తించి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపింది. అలాగే మహేశ్వరం ప్రాంతంలో మూడు వ్యవసాయ భూములకు సంబంధించిన పత్రాలను అధికారులు గుర్తించారు. ఈ భూముల విలువ సుమారు రూ.57 లక్షలు ఉంటుందని ఏసీబీ ప్రాథమికంగా పేర్కొంది.

**బంజారాహిల్స్‌లో రూ.2.70 కోట్ల ప్లాట్**

బంజారాహిల్స్ ఎమ్మెల్యే కాలనీలోని ఓపెన్ ప్లాట్‌కు సంబంధించిన పత్రాలు కూడా సోదాల్లో బయటపడ్డాయి. ఈ ప్లాట్ విలువ సుమారు రూ.2.70 కోట్లు ఉంటుందని ఏసీబీ వివరించింది. ఆస్తులకు సంబంధించిన పత్రాలు ఎవరిపేర్లపై ఉన్నాయి, వాటికి నోరి లక్ష్మీ భాస్కర్‌తో ఉన్న సంబంధం ఏంటి అనే కోణంలో అధికారులు వివరాలను పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. నిమ్స్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి డి. గణేష్ పేరుతో సుమారు రూ.20 లక్షల పెట్టుబడులకు సంబంధించిన వివరాలను కూడా ఏసీబీ గుర్తించింది. మరో వ్యక్తి పేరుతో ఉన్న పెట్టుబడుల వివరాలు కూడా అధికారుల దృష్టికి వచ్చినట్లు ప్రెస్ నోట్‌లో పేర్కొంది.

# కరువు.. కరెంట్ కష్టాలు

మొదటిపేజీ తరువాయి

కానీ విద్యుత్ సరఫరాలో అంతరాయాలు వారిని కోలుకోలేని దెబ్బతీస్తున్నాయి. కృష్ణానది పక్కనే పారుతున్నా సాగునీరు అందక గద్వాల నారాయణపేట వనపర్తి ప్రాంతాల్లో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గద్వాల నారాయణపేట వనపర్తి జిల్లాల్లో వేల ఎకరాల్లో పంటలు ఎండిపోయే దశలో ఉండడం చూసి రైతన్నల బాధ వర్ణనాతీతంగా మారింది. ప్రస్తుతానికి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సుమారు 40 శాతం పంట నష్టం వాటిల్లినట్లు అంచనాలు తెలియజేస్తున్నాయి. చాలా చోట్ల విత్తనాలు సగం మాత్రమే మొలకెత్తాయి మొలకెత్తిన పంటలు కూడా నీరు లేక గిడసబారిపోతున్నాయి. కొన్నిచోట్ల ఏపుగా పెరిగిన పూత కాయ లేకుండా ఉండిపోయాయి. ఉన్న పంటలను కాపాడుకుందాం అంటే కరెంటు సరిగా రావడం లేదంటూ అన్నదాతలు రోడ్లెక్కిన పరిస్థితులు జిల్లాలో అనేకం జరిగాయి. సమస్య కేవలం కరెంట్ లేకపోవడం మాత్రమే కాదు సరఫరాలో నాణ్యత లేకపోవడం కూడా తీవ్ర ఆగ్రహానికి కారణమైంది. వ్యవసాయానికి నిరంతర విద్యుత్ అటు ఉంచితే నిర్ణీత సమయాల్లో కూడా కరెంట్ ఇవ్వడం లేదని రైతులు వాపోతున్నారు. ముఖ్యంగా సాయంత్రం 7 గంటల తర్వాత కేవలం సింగిల్ ఫేజ్ కరెంట్ మాత్రమే ఇస్తున్నారని త్రీఫేజ్ సరఫరాలో కోతలు విధిస్తున్నారని ఆరోపిస్తున్నారు. లోవోల్టేజీ సమస్య కారణంగా వ్యవసాయ పంపుసెట్లు కాలిపోతుండడతో అదనపు ఆర్థిక భారాన్ని కలిగిస్తోందని అన్నదాతలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కరెంట్ ఎప్పుడు వస్తుందో తెలియక రైతులు రాత్రంతా పొలాల వద్దే జాగారం చేయాల్సి దుర్భర పరిస్థితులు మళ్లీ తలెత్తాయని వాపోతున్నారు. కరెంట్ కోతలను నిరసిస్తూ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రైతులు రోడ్లపైకి వచ్చి నిరసనలు వ్యక్తం చేస్తున్నారు. మల్దకల్ భూత్పూర్ తాండ్ర గేట్ మక్తల్ తదితర ప్రాంతాల్లో రైతులు సబ్ స్టేషన్ల ముందు ధర్నాలు ప్రధాన రహదారులపై రాస్తారోకోలు నిర్వహించారు. వ్యవసాయానికి 24 గంటల నాణ్యమైన విద్యుత్ సరఫరా ఎండిపోయిన పంటలకు నష్టపరిహారం కాలిపోయిన



మోటార్లకు పరిహారం ఇవ్వాలనీ రైతులు డిమాండ్ చేస్తున్నారు. మరోవైపు ప్రాజెక్టుల్లో నీరు ఉన్నప్పటికీ నిర్వహణ లోపం వల్ల రైతులకు నీరు అందడం లేదని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి. మొత్తంగా ప్రకృతి వైపరీత్యానికి తోడు విద్యుత్ కోతలు తోడవడంతో ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా రైతాంగం తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయింది. పంటలు చేతికొచ్చే సమయంలో నీరు అందక కళ్లెదుటే పంట ఎండిపోతుంటే రైతులు దిక్కుతోచని స్థితిలో అల్లాడిపోతున్నారు. ఎన్నో ఆశలతో వేసిన పెట్టుబడులు బూడిదలో పోసిన పన్నీరు కావడంతో రైతుల కుటుంబాలు రోడ్డున పడే దుస్థితి వచ్చింది. కనీసం ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తక్షణ సహాయం అందించాలని రైతులు కోరుకుంటున్నారు. బ్యాంకు రుణాల వడ్డీలు పెరిగిపోతుండడం ప్రైవేట్ అప్పుల వాళ్ల ఒత్తిళ్లు రోజురోజుకూ విపరీతంగా పెరుగుతుండడంతో రైతులు ఆత్మహత్యల బాట పట్టే ప్రమాదం ఉంది. ప్రజాప్రతినిధులు అధికారులు గ్రామాల్లోకి వచ్చి రైతుల గోడును స్వయంగా ఆలకించాలని వారు వేడుకుంటున్నారు. ఎండిపోయిన ఎకరా పత్తి వరి పంటకు కనీసం 20 వేల రూపాయల నష్టపరిహారం ప్రకటించాలని డిమాండ్ చేస్తున్నారు. అప్పుల ఊబిలో కూరుకుపోయిన తమను కాపాడాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు. లేదంటే ఆందోళనలను మరింత ఉద్ధృతం చేస్తామని హెచ్చరిస్తున్నారు. ప్రకృతి ఇచ్చిన శాపంతో పాటు ప్రభుత్వ నిర్లక్ష్యం తోడవడంతో అన్నదాతల జీవితాలు అగమ్యగోచరంగా మారాయి. ఇప్పటికైనా విద్యుత్ శాఖ అధికారులు స్పందించి కోతలు లేకుండా నాణ్యమైన త్రీఫేజ్ విద్యుత్ సరఫరాను అందించాలి. రాత్రింబవళ్లు పడరాని పాట్లు పడి పండించిన పంట కళ్ల ముందే ఎండిపోతుంటే చూసి తట్టుకోలేక గుండెలు పగిలిపోతున్నాయని రైతులు రోధిస్తున్నారు. అధికారులు మాత్రం తాత్కాలిక సర్దిచెప్పే మాటలతో కాలం వెల్లదీస్తున్నారే తప్ప శాశ్వత పరిష్కారం చూపడం లేదని విమర్శలు వస్తున్నాయి. ఇప్పటివరకు జరిగిన నష్టానికి పూర్తి సర్వే నిర్వహించి అర్హులైన ప్రతి రైతు కుటుంబానికి న్యాయం చేయాలి. సాగునీటి ప్రాజెక్టుల ద్వారా ప్రతి చివరి భూమికి నీరు అందేలా పటిష్టమైన చర్యలు తీసుకోవాలి. లేదంటే ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలో రైతుల ఆగ్రహం కట్టలు తెంచుకుని పెద్ద ఎత్తున ఉద్యమాలు జరిగే అవకాశం ఉంది. ప్రభుత్వం వెంటనే స్పందించి రైతులకు భరోసా కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

## తూప్రాన్ పేట్ వృద్ధురాలి హత్య కేసు ఛేదించిన చౌటుప్పల్ పోలీసులు

**చౌటుప్పల్,విశాల భారతి:**

తూప్రాన్ పేట్ గ్రామంలో 70 ఏళ్ల వృద్ధురాలి అనుమానాస్పద మృతి కేసును చౌటుప్పల్ పోలీసులు ఛేదించారు. సెప్టెంబర్ 27న ఉదయం 10 గంటలకు తూప్రాన్ పేట్ గ్రామానికి చెందిన మంటిపల్లి దర్శన్ తన మేనత్త మంటిపల్లి యాదమ్మ (70) ఇంటిలో అనుమానాస్పద స్థితిలో మృతి చెందిందని పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. దీనిపై క్రైమ్ నంబర్ 538/2026, సెక్షన్ 194 బిఎన్ఎస్ఎస్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. చౌటుప్పల్ ప్రభుత్వ ఆసుపత్రిలో మృతదేహానికి శవ పరీక్ష నిర్వహించగా గాయాలు, ప్రాథమిక వివరాల ఆధారంగా హత్యగా అనుమానం వచ్చింది. సాంకేతిక ఆధారాలు, కాల్ డేటా రికార్డులు తదితర కోణాల్లో దర్యాప్తు చేయగా బ్యాంక్ కాలనీ తూప్రాన్ పేట్ కు చెందిన మంటిపల్లి రాజు (31) పై అనుమానం ఏర్పడింది. సెప్టెంబర్ 30న ఉదయం నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారించగా అప్పులు, ఈఎంఐలు చెల్లించలేక ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నానని, డబ్బు కోసం వరుసకు అమ్మమ్మ అయిన యాదమ్మను హత్య చేసి బంగారం, వెండి ఆభరణాలు దొంగిలించినట్లు అంగీకరించాడు. నిందితుడిని అరెస్టు చేసి న్యాయ విచారణ నిమిత్తం తరలించారు. ఈ కేసును డీఎస్పీ పి. మధుసూదన్ ఆధ్వర్యంలో ఇన్స్పెక్టర్ జి. మన్మధ కుమార్, ఎస్ఐలు పి. రవీందర్, సతీష్ మరియు సిబ్బంది నర్సిరెడ్డి, సందీప్, భరద్వాజ్, ప్రవీణ్ లు ఛేదించారు. స్వాధీనం చేసుకున్న వస్తువులు: బంగారు ఆభరణాలు: పొడవాటి బంగారు గొలుసు 3 తులాలు, బంగారు గొలుసు 1.5 తులాలు, బంగారు చెవి దుద్దులు 5 గ్రాములు, బంగారు మాటీలు 2 4 గ్రాములు.వెండి ఆభరణాలు: వెండి కాలి కడియాలు ఒక జత 90 తులాలు, వెండి కాళ్ల సలాం కడియాలు ఒక జత 40 తులాలు, వెండి కాలి గొలుసులు ఒక జత 29 తులాలు.వీవో వై20జి కంపెనీ ఆకాశ నీలం రంగు చరవాణి. నలుపు నీలం రంగు ప్యాషన్ ప్లస్ ద్విచక్ర వాహనం నంబర్ టీజీ 30 బీ 4845. వాటిని స్వాధీనం చేసుకున్నట్టుగా సీఐ మన్మధ కుమార్ ప్రకటనలో తెలిపారు.





# బీజేపీతో పొత్తు ఉండదు

మొదటిపేజీ తరువాయి

భావజాలపరంగా సైద్ధాంతికంగా బీజేపీకి పూర్తిగా వ్యతిరేకం కాబట్టి పొత్తు ప్రశ్న రాదు. తెలంగాణలో రాబోయేది కేసీఆర్ ప్రభుత్వమే అని ఆయన కుండబద్దలు కొట్టారు. ప్రజలంతా కేసీఆర్ నాయకత్వాన్ని మళ్లీ కోరుకుంటున్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలన్నీ అమలు చేయడంలో పూర్తిగా విఫలమైంది. రేవంత్ రెడ్డి ప్రభుత్వం పట్ల ప్రజలలో తీవ్రమైన అసంతృప్తి అలాగే ఆగ్రహం కనిపిస్తున్నాయి. ఓటేసి మోసపోయామనే రిగ్రెట్ నుంచి ప్రజలు ఇప్పుడు తిరుగుబాటు దిశగా అడుగులు వేస్తున్నారు. యువత రైతులు మహిళలు అందరూ కేసీఆర్ పాలనను గుర్తుచేసుకుంటున్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం విభిన్నమైన రాజకీయ వాతావరణం నెలకొని ఉంది. తెలంగాణ ప్రజల ప్రయోజనాలను పూర్తిగా పణంగా పెట్టి రేవంత్ రెడ్డి ఢిల్లీ పెద్దలకు భజన చేస్తున్నారు. 420కి పైగా హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఒక్క హామీని కూడా పూర్తిగా అమలు చేయలేదు. ప్రజలు ఇచ్చిన తీర్పును మళ్లీ సమీక్షించుకునే పరిస్థితి నేడు ఏర్పడింది. కేసీఆర్ ముఖ్యమంత్రి కావడం ద్వారానే రాష్ట్రం మళ్లీ అభివృద్ధి పథంలో ముందుకు సాగుతుంది. కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగట్టడంలో బీఆర్ఎస్ నాయకులు ఎప్పుడూ ముందుంటారు. ప్రతి గ్రామంలోనూ ప్రజలు ఈ ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు సిద్ధంగా ఉన్నారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ అఖండ విజయం సాధించడం ఖాయం. రేవంత్ రెడ్డి పాలనా వైఫల్యాలపై ప్రతిపక్షం గట్టిగా నిలదీస్తోంది. ప్రజల సమస్యలను గాలికి వదిలేసి ప్రచార ఆర్భాటాలకే పరిమితమయ్యారు. యువతకు ఉద్యోగాలు లేవు అలాగే రైతులకు రుణమాఫీ పూర్తిగా అందలేదు. ఈ మోసాలను ప్రజలు గమనిస్తున్నారు. సరైన సమయంలో తగిన విధంగా బుద్ధి చెబుతారు. జనాభా ఆధారంగా డీలిమిటేషన్ చేపడితే దక్షిణాది రాష్ట్రాలు తీవ్రంగా నష్టపోతాయని కేటీఆర్




ఆందోళన వ్యక్తం చేశారు. చట్టసభల్లో సీట్లు పెంచాలనుకుంటే కేవలం పార్లమెంటు సీట్లు మాత్రమే ఎందుకు పెంచుతున్నారు. అసెంబ్లీ సీట్లను కూడా అదే ప్రాతిపదికన ఎందుకు పెంచడం లేదని ఆయన నిలదీశారు. గతంలో 24శాతంగా ఉన్న దక్షిణాది జనాభా వాటా ఇప్పుడు 19 శాతానికి తగ్గిపోయింది. జనాభా నియంత్రణను సమర్థవంతంగా అమలు చేసినందుకు మన రాష్ట్రాలకు ఈ రకమైన శిక్ష వేయడం సరికాదు. అస్సాం అలాగే జమ్మూ కాశ్మీర్‌లో అసెంబ్లీ సీట్లను పెంచిన కేంద్ర ప్రభుత్వం తెలుగు రాష్ట్రాలైన ఏపీ తెలంగాణలో ఎందుకు పెంచలేదు. కేవలం రాజకీయ లబ్ది కోసమే బీజేపీ ఈ కుట్రకు తెరలేపింది. అమిత్ షా ఇస్తున్న హామీలను నమ్మే స్థితిలో ఎవరూ లేరు. దామాషా ప్రకారం సీట్లు పెంచితేనే మద్దతు ఇస్తామని స్పష్టం చేశారు. కేంద్రం అనుసరిస్తున్న ఈ విధానం సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధంగా ఉంది. తెలంగాణ విభజన చట్టంలో పేర్కొన్న ఏ ఒక్క హామీని కూడా మోదీ ప్రభుత్వం ఇప్పటివరకు పూర్తిగా అమలు చేయలేదు. బీజేపీకి రాజకీయ ప్రభావం తక్కువగా ఉన్న రాష్ట్రాలను కావాలనే అణగద్రొక్కాలని చూస్తున్నారు. మహిళా రిజర్వేషన్లను ప్రస్తుతం ఉన్న 543 లోక్‌సభ స్థానాలకు ఎందుకు అమలు చేయడం లేదు. కేవలం తమ రాజకీయ అవసరాలకే అనుగుణంగా డీలిమిటేషన్ ప్రక్రియను ముందుకు తీసుకెళ్తున్నారు. దీని వెనుక పెద్ద కుట్ర దాగి ఉందని ప్రజలు గమనించాలి. తెలుగు రాష్ట్రాల హక్కులను కాపాడుకోవడానికి బీఆర్ఎస్ నిరంతరం పోరాటం చేస్తుంది. కేంద్రం ఇష్టానుసారంగా వ్యవహరిస్తే సహించేది లేదు. ప్రతి అంశంలోనూ వివక్ష చూపుతున్న కమలనాథులకు తగిన పాఠం నేర్పుతాం. రాష్ట్ర అభివృద్ధి కోసం కేసీఆర్ చేసిన పోరాటాలను ప్రజలు ఎప్పటికీ మరువరు. రాబోయే రోజుల్లో కేంద్రంపై పెద్ద ఎత్తున ఆందోళనలు నిర్వహిస్తాం. మన హక్కులను ఎవరికీ తాకట్టు పెట్టే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు. తెలంగాణ సెంటిమెంట్‌ను దెబ్బతీసేందుకు కొందరు నాయకులు నిరంతరం కుట్రలు పన్నుతున్నారు. కేసీఆర్ నాయకత్వంలోనే రాష్ట్రం అన్ని రంగాల్లో దేశంలోనే అగ్రగామిగా నిలిచింది. కేవలం రాజకీయ స్వార్థం కోసం కాంగ్రెస్ బీజేపీ రెండు పార్టీలు కలిసి డ్రామాలు ఆడుతున్నాయి. తెలంగాణ ప్రజలు ఈ మోసపూరిత రాజకీయాలను ఇకపై నమ్మే పరిస్థితిలో లేరు. రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి రావడం ద్వారా అన్ని సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుంది. కేటీఆర్ చేస్తున్న ఈ వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో ఇప్పుడు తీవ్రమైన చర్చకు దారితీశాయి. యువత పెద్ద ఎత్తున బీఆర్ఎస్ వైపు చూస్తున్నారు. తెలంగాణ సంక్షేమ పథకాలను మళ్లీ అమలు చేయాలంటే కేసీఆర్ రావాల్సిందే. ప్రజల ఆశీస్సులతో గులాబీ జెండా మళ్లీ సగర్వంగా ఎగురుతుంది. ఎవరితోనూ పొత్తు పెట్టుకునే అవసరం మాకు లేదని మరోసారి స్పష్టమైంది. రాష్ట్ర ప్రయోజనాలే మాకు సర్వస్వం.

# ఓట్ల తొలగింపుపై సమాధానం చెప్పాలి

మొదటిపేజీ తరువాయి

పారదర్శకంగా సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఎన్నికల వ్యవస్థపై ప్రజలలో ఉన్న ప్రతి చిన్న అనుమానాన్ని ఈసీ వెంటనే నివృత్తి చేయాలని కోరారు. రాజకీయ పార్టీలు ఎప్పుడైనా గెలవచ్చు లేదా ఓడిపోవచ్చు కానీ ప్రజాస్వామ్య వ్యవస్థపై మాత్రం ప్రజల నమ్మకం ఎప్పటికీ చాలా ముఖ్యం అని ఆయన పునరుద్ఘాటించారు. బ్యాలెట్ పేపర్ పై ప్రజల నుండి వస్తున్న డిమాండ్లను కూడా ఎన్నికల సంఘం తీవ్రంగా పరిగణలోకి తీసుకోవాలని ఆయన అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ఎవరూ ఫ్రీబీస్ రూపంలో చూడవద్దని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అన్నీ కేవలం మానవ వనరులపై చేసే దీర్ఘకాలిక పెట్టుబడులు మాత్రమే అని ఆయన వివరించారు. రాష్ట్రంలో ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అత్యంత వేగంగా అమలు చేస్తున్నామని ఆయన తెలిపారు. తొలి దశలో భాగంగా ఏకంగా నాలుగున్నర లక్షల ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించామని ఆయన స్పష్టం చేశారు. దీనికి తోడుగా మరో రెండు లక్షల ఇందిరమ్మ ఇళ్లకు కొత్తగా మంజూరు కూడా ఇచ్చామని ఆయన సగర్వంగా ప్రకటించారు. పేదల ఆరోగ్య రక్షణ కోసం ఆరోగ్యశ్రీ పరిమితిని పది లక్షల రూపాయలకు పెంచి విజయవంతంగా అమలు చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు. మహిళల రవాణా సౌకర్యం కోసం మహాలక్ష్మి పథకం కింద ఉచిత బస్సు ప్రయాణం అందుబాటులో ఉంచామని ఆయన వెల్లడించారు. రెండు వందల యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ సరఫరా ద్వారా సుమారు యాభై మూడు లక్షల కుటుంబాలు లబ్ధి పొందుతున్నాయని చెప్పారు. రాష్ట్రాల మధ్య జరిగే పోటీ ఎప్పుడూ ఆరోగ్యకరమైన పద్ధతిలోనే ఉండాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అభిప్రాయపడ్డారు. దక్షిణాది రాష్ట్రాలకు సమాఖ్య స్ఫూర్తికి తగినట్లుగా పూర్తి న్యాయం చేయాలని ఆయన కేంద్ర ప్రభుత్వాన్ని గట్టిగా కోరారు. దేశ అభివృద్ధికి వివిధ రాష్ట్రాలు అందిస్తున్న విలువైన సహకారాన్ని కేంద్ర ప్రభుత్వం ఎల్లప్పుడూ పరిగణలోకి తీసుకోవాలని ఆయన సూచించారు. ఇటీవల జరిగిన జీఎస్టీ సమావేశాలలో కూడా దక్షిణాది రాష్ట్రాల వాదనను తాను గట్టిగా ప్రస్తావించానని ఆయన గుర్తు చేశారు. ఒకరితో ఒకరు ఆరోగ్యకరంగా పోటీ పడి రాష్ట్రాలు అన్నీ చాలా వేగంగా అభివృద్ధి సాధించాలని ఆయన ఆకాంక్షించారు. దేశ ఆర్థిక అభివృద్ధికి అత్యధికంగా సహకరిస్తున్న రాష్ట్రాలను ఏ పరిస్థితులలోనూ ఎవరూ దెబ్బతీయకూడదని ఆయన హితవు పలికారు. ప్రాంతీయ అసమతుల్యతలను పూర్తిగా తొలగించి అన్ని రాష్ట్రాలను సమానంగా ముందుకు తీసుకెళ్లే విధానాలను కేంద్ర ప్రభుత్వం అనుసరించాలని ఆయన డిమాండ్ చేశారు. హైదరాబాద్ నగరంలోని హైటెక్ సిటీ తెలంగాణ రాష్ట్రానికి అసలైన ఆర్థిక బలం అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కొనియాడారు. హైదరాబాద్ నగరంలో అత్యంత భారీ టాలెంట్ పూల్ కలిగిన యువత అందుబాటులో ఉందని ఆయన గర్వంగా చెప్పారు. గతంలో ప్రభుత్వం అమలు చేసిన ఫీజు రీయింబర్స్‌మెంకు పథకం వల్ల సాంకేతిక విద్యకు అత్యధిక ప్రోత్సాహం లభించిందని ఆయన తెలిపారు. ప్రపంచ స్థాయి పెట్టుబడులను ఆకర్షించడానికి హైదరాబాద్ నగరంలో ఉన్నత మౌలిక వసతులు సిద్ధంగా ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. ఔటర్ రింగ్ రోడ్, అంతర్జాతీయ విమానాశ్రయం, ఫైనాన్షియల్ సిటీ వంటి అద్భుతమైన నిర్మాణాలు తెలంగాణను అగ్రపథంలో నిలుపుతున్నాయని ఆయన వివరించారు. ఈ గొప్ప వసతులన్నీ యువతకు భారీ ఉపాధి అవకాశాలను సృష్టిస్తున్నాయని ఆయన అన్నారు. సాంకేతిక రంగంలో తెలంగాణ సాధిస్తున్న పురోగతి దేశానికే రోడ్‌మ్యాప్ గా మారుతోందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో తాను నూటికి నూరు శాతం పూర్తి సఖ్యతతో కలిసి పనిచేస్తున్నానని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. గ్రేటర్ రాజకీయాలలో దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డితో కలిసి పనిచేసిన సుదీర్ఘ అనుభవం తన జీవితంలో ఎప్పటికీ గుర్తుండిపోతుందని ఆయన అన్నారు. వైఎస్సార్ అందించిన అద్భుతమైన మార్గదర్శకత్వం కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలపై తన నమ్మకాన్ని మరింత బలపరిచిందని ఆయన కొనియాడారు. దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీని వీడి వెళ్లిన పాత నాయకులంతా తిరిగి సొంత పార్టీలోకి రావాలని ఆయన పిలుపునిచ్చారు. అందరూ తిరిగి కాంగ్రెస్ పార్టీలో చేరి దేశాన్ని మరింత బలోపేతం చేయడానికి కలిసికట్టుగా పనిచేయాలని ఆయన కోరారు. రాష్ట్రంలో తామంతా అన్ని విషయాలు చర్చించుకుని, బాగా ఆలోచించి మాత్రమే కీలకమైన నిర్ణయాలు తీసుకుంటున్నామని ఆయన చెప్పారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలను సంపూర్ణంగా అమలు చేయడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యం అని ఆయన మరోసారి స్పష్టం చేశారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజల నమ్మకాన్ని నిలబెట్టడానికి రాజకీయ నాయకులు అందరూ నిరంతరం బాధ్యతాయుతంగా వ్యవహరించాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సూచించారు. సమాజంలో ప్రతి ఒక్కరూ సమానమైన అవకాశాలు పొందేలా పాలన ఉండాలని ఆయన ఆకాంక్షించారు. సంక్షేమ పథకాలు కేవలం ఖర్చులు కావు అని అవి భావి తరాల అభివృద్ధికి వేసే బలమైన పునాదులు అని ఆయన పునరుద్ఘాటించారు. విద్య, వైద్యం, ఉపాధి రంగాలలో ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు సత్ఫలితాలను ఇస్తున్నాయని ఆయన తెలిపారు. ప్రతి పేద కుటుంబానికి గౌరవప్రదమైన జీవితాన్ని అందించాలనే దృఢ సంకల్పంతో తమ ప్రభుత్వం అడుగులు వేస్తోందని ఆయన వివరించారు. ప్రజా సంక్షేమమే పరమావధిగా కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరం శ్రమిస్తోందని ఆయన స్పష్టం చేశారు. భవిష్యత్తులో తెలంగాణ రాష్ట్రం దేశానికే రోల్ మోడల్ గా నిలవబోతోందని ఆయన పూర్తి విశ్వాసం వ్యక్తం చేశారు.



# పాత బియ్యం.. కొత్త బ్రాండ్లు

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణ ప్రభుత్వం సన్న వడ్లకు క్వింటాలుకు రూ.500 బోనస్ ఇస్తుంటే ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో భారీ కుంభకోణం జరుగుతోంది. ఉచిత రేషన్ దొడ్డు బియ్యం దందా సన్న ధాన్యం మార్ఫింగ్ రీసైక్లింగ్ వ్యాపారం సమాంతరంగా సాగుతున్నాయి. వందల కోట్ల వ్యాపారం సాగుతున్నా అధికారులు పట్టించుకోకపోవడం పెద్ద అనుమానాలు రేకెత్తిస్తోంది. పౌరసరఫరాల సంస్థ క్వాలిటీ కంట్రోల్ డిపో మేనేజర్లు క్షేత్రస్థాయి విజిలెన్స్ యంత్రాంగం అండదండలతో దాదాపు రూ.150 కోట్ల వ్యవస్థాగత సిండికేట్ నడుస్తోంది. ఆంధ్రప్రదేశ్ లోని కాకినాడ పోర్ట్ వద్ద తిరస్కరించిన స్టాక్ ఛత్తీస్‌గఢ్ మహారాష్ట్ర ప్రాంతాల నుండి అత్యంత చౌకగా క్వింటాలు రూ.1,800 నుంచి రూ.2,000 పాత పురుగులు పట్టిన నాసిరకం దొడ్డు బియ్యాన్ని కొనుగోలు చేసి తెలంగాణకు తరలిస్తున్నారు. ఈ దందాలో కరీంనగర్ కు చెందిన రైస్ మిల్లుల వ్యాపారుల హస్తం బలంగా ఉంది. పొరుగు రాష్ట్రాల నుండి తెచ్చే ఈ బియ్యం లారీలకు నకిలీ వేబిల్లులను సృష్టిస్తున్నారు. ఒకే పర్మిట్ పై రెండు మూడేసి సార్లు లారీలను గోదాముల్లో అన్‌లోడ్ చేయిస్తూ రికార్డులను మేనేజ్ చేస్తున్నారు. ఈ రీసైక్లింగ్ దొడ్డు బియ్యాన్ని ఎఫ్‌సీఐ సివిల్ సప్లైస్ గోదాముల్లో అన్‌లోడ్ చేయించడానికి ఒక్కో లారీకి రూ.10,000 నుంచి రూ.15,000 వరకు లంచాలు చేతులు మారుతున్నాయి. రైతుల నుంచి ప్రభుత్వం సేకరించిన నాణ్యమైన సన్న ధాన్యాన్ని రికార్డుల్లో మాయం చేసి రేషన్ బియ్యాన్ని పాలిష్ చేసి సన్న బియ్యంగా మారుస్తున్నారు. కొనుగోలు కేంద్రాల నుండి మిల్లులకు సేకరించిన ఏ గ్రేడ్ సన్న ధాన్యాన్ని ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేయడానికి 15 నుంచి 30 రోజుల సమయం తీసుకుంటున్నారు. ఈ డిజిటల్ టైమ్ గ్యాప్‌ను వాడుకుని అధికారుల సంతకాలతో ఏ గ్రేడ్ సన్నాలను రికార్డుల్లో కామన్ గ్రేడ్ దొడ్డు రకంగా మార్చేస్తున్నారు. రికార్డుల్లో మార్చిన అసలైన సన్న ధాన్యాన్ని ప్రైవేట్ వ్యాపారులకు క్వింటాలు రూ.3,500 నుంచి రూ.3,800 చొప్పున బయట అమ్ముకుని వందల కోట్లు వెనకేసుకుంటున్నారు. పేదలకు పంచాల్సిన ఉచిత రేషన్ బియ్యాన్ని మిల్లర్లు తక్కువ ధరకు కొనుగోలు చేసి ఆధునిక పాలిషింగ్ మిషన్లలో ప్రాసెస్ చేసి సన్న బియ్యం క్వాలిటీలోకి మారుస్తున్నారు. ఈ మార్ఫింగ్ బియ్యాన్ని జై శ్రీరామ్ హెచ్ఎంటీ నంబర్ వన్ కర్నూల్ టమాటో గోల్డ్ జేఎస్ఆర్ కిసాన్ రాజా గోల్డ్ డబుల్ హౌస్ వంటి ప్రముఖ రైస్ బ్రాండ్ల సంచుల్లో నింపి బహిరంగ మార్కెట్లో అధిక ధరలకు విక్రయిస్తున్నారు. ప్రజలు కొనుగోలు చేసే ఈ పాలిష్ బియ్యం వెనుక పెద్ద మోసం దాగి ఉంది. ఈ రీసైక్లింగ్ నెట్‌వర్క్‌పై ఇటీవల కరీంనగర్ టాస్క్ ఫోర్స్ ఏసిపి సతీష్ నేతృత్వంలో దాడులు జరిగాయి. ఈ దాడుల్లో 307 క్వింటాళ్ల ఉచిత రేషన్ బియ్యం పట్టుబడింది. రేషన్ బియ్యాన్ని పాలిష్ పట్టి జై శ్రీరామ్ బ్రాండ్ తో పాటు వివిధ బ్రాండ్ల సంచుల్లో నింపి అమ్ముతున్న బండారం బయటపడింది. రైస్ మిల్ అసోసియేషన్ కరీంనగర్ జిల్లా ప్రధాన కార్యదర్శి తొడుపునూరి కరుణ□కర్ పై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మరో వైపు ఈ దందాలో ఇతర వ్యాపారులు రైస్ మిల్లర్ల హస్తం పై విచారణ



వేగంగా సాగుతోంది. మిల్లుల్లో ప్రతి నెలా ధాన్యం బియ్యం నిల్వలను క్షేత్రస్థాయిలో భౌతికంగా పరిశీలించాల్సిన ఇన్‌స్పెక్టర్లు డిపో మేనేజర్లు మామూళ్లకు అలవాటుపడ్డారు. ఖాళీ గోదాముల్లో నిల్వలు ఉన్నట్లు కాగితాలపై రాసేస్తున్నారు. అధికారుల ఉదాసీనత వల్ల గత రెండు సీజన్లకు సంబంధించిన సీఎంఆర్ నిల్వలు మాయమైనా కనీస చర్యలు శూన్యం. ప్రభుత్వ ప్రోత్సాహకాలు వ్యాపారుల పాలు కావడం పేదలకు పురుగులు పట్టిన బియ్యమే దక్కడం తీవ్ర ఆవేదన కలిగిస్తోంది. ఓపెన్ మార్కెట్లో కల్తీ పాలిష్ బియ్యం విక్రయించడంపై సామాన్య ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి ఉమ్మడి కరీంనగర్ జిల్లావ్యాప్తంగా ఉన్న రైస్ మిల్లుల్లో ప్రత్యేక బృందాలతో సమగ్ర తనిఖీలు నిర్వహించాలని రైతు సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. బాధ్యులైన మిల్లర్లు అధికారులపై పిడి యాక్ట్ కింద కఠిన కేసులు నమోదు చేయాలని కోరుతున్నాయి. ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో క్వింటాలుకు రూ.500 బోనస్ ఇస్తుంటే ఈ అక్రమార్కులు ఖజానాను నిలువునా దోచుకుంటున్నారు. నిజమైన రైతులను ఆదుకునే బదులు దళారులు మిల్లర్లు లబ్ధి పొందుతున్నారు. ఈ దందా వల్ల కోట్ల రూపాయల ప్రజాధనం వృథా అవుతోంది. పౌరసరఫరాల శాఖ అధికారులు స్పందించి క్షేత్రస్థాయిలో తనిఖీలు చేయాలి. ఎక్కడ ఏ మిల్లులో అవకతవకలు జరిగినా వెంటనే సీజ్ చేయాలి. అక్రమంగా నిల్వ ఉంచిన బియ్యాన్ని స్వాధీనం చేసుకోవాలి. రాష్ట్ర వ్యాప్తంగా ఇలాంటి సిండికేట్లను కూకటివేళ్లతో పెకిలించాలి. అప్పుడే రైతులకు సరైన న్యాయం జరుగుతుంది. ప్రజలకు నాణ్యమైన ఆహారం అందుతుంది. లేకపోతే ఈ నకిలీ దందా మరింత పెరిగి ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తుంది. యువత ఈ మోసాలను గమనించి సోషల్ మీడియాలో ప్రశ్నించాలి. ఈ అక్రమాల వెనుక రాజకీయ నాయకుల అండదండలు కూడా ఉన్నాయనే ఆరోపణలు గట్టిగా వినిపిస్తున్నాయి. ఎన్నికల సమయంలో రాజకీయ పార్టీలకు విరాళాలు ఇస్తూ ఈ మిల్లర్లు అధికారులను తమ చెప్పుచేతుల్లో ఉంచుకుంటున్నారు. కోట్ల రూపాయల వ్యాపారం చేస్తున్న ఈ సిండికేట్ సభ్యులు చట్టాల నుంచి సులభంగా తప్పించుకుంటున్నారు. పేదలకు పంపిణీ చేయాల్సిన బియ్యాన్ని పక్కదారి పట్టించి నల్లబజారులో అమ్ముకుంటున్నారు. ఈ రాకెట్ గుట్టురట్టు చేయడానికి ప్రత్యేక విజిలెన్స్ బృందాలను రంగంలోకి దించాలి. ఎక్కడా అవినీతికి తావులేకుండా పారదర్శకంగా విచారణ జరపాలి. తప్పు చేసిన ప్రతి ఒక్కరికీ కఠిన శిక్ష పడేలా చూడాలి. అప్పుడే వ్యవస్థ మారుతుంది. యువత ఈ విషయాలపై అవగాహన పెంచుకోవాలి.

# ఎమ్మెల్సీ అభ్యర్థి ఎంపికపై ఉత్తమ్ అసంతృప్తి?

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**



నల్గొండ, ఖమ్మం, వరంగల్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానం కోసం కాంగ్రెస్ పార్టీ నుంచి రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి అభ్యర్థిగా ఖరారయ్యారు. అఖిల భారత కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆమోదంతో ఈ కీలక నిర్ణయం తీసుకున్నట్లు పార్టీ వర్గాలు అధికారికంగా ప్రకటించాయి. సర్వోత్తమ్ రెడ్డి నేపథ్యం చూస్తే, ఆయన మాజీ మంత్రిగా పని చేసిన దివంగత కాంగ్రెస్ సీనియర్ నేత రాంరెడ్డి దామోదర్ రెడ్డి కుమారుడు అవుతారు. ఈ గ్రాడ్యుయేట్ నియోజకవర్గంలో యువత, పట్టభద్రుల ఓట్లు కీలకంగా మారనున్నాయి. కాంగ్రెస్ పార్టీ ఈ ఎన్నికలను ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకుని ప్రచారానికి శ్రీకారం చుట్టింది. రాబోయే ఏడాది మార్చి నెలలో ఈ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానం ఖాళీ కానుంది. ఇప్పటికే ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకారం ఓటర్ల నమోదు ప్రక్రియ జోరుగా ప్రారంభమైంది. అర్హులైన పట్టభద్రులందరూ ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవాలని అధికారులు కోరారు. వచ్చిన దరఖాస్తులను పరిశీలించి తుది ఓటర్ల జాబితాను ఈ ఏడాది డిసెంబర్ ముప్పైవ తేదీన విడుదల చేయనున్నారు. ఓటర్ల జాబితా రూపకల్పన పూర్తి కావడంతోనే అన్ని రాజకీయ పార్టీలు తమ అభ్యర్థుల గెలుపు కోసం వ్యూహాలు రచిస్తున్నాయి. అభ్యర్థి ఎంపిక ప్రక్రియలో రాష్ట్ర మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అసంతృప్తిగా ఉన్నారనే చర్చ రాజకీయ వర్గాల్లో బలంగా వినిపిస్తోంది. తన అభిప్రాయాన్ని గానీ, సూచనలను గానీ పరిగణనలోకి తీసుకోకుండానే అధిష్ఠానం ఏకపక్షంగా ఈ నిర్ణయం తీసుకుందని ఆయన కొంత గుర్రుగా ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. అయితే ఈ వివాదంపై ఇప్పటివరకు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి నుంచి ఎలాంటి అధికారిక స్పందన రాలేదు. పార్టీలో సీనియర్ నేతల మధ్య సమన్వయం లోపించిందనే వార్తలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఎన్నికల వేళ ఇలాంటి అంతర్గత విభేదాలు పార్టీ విజయావకాశాలపై ప్రభావం చూపే ప్రమాదం ఉందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. అధిష్ఠానం పెద్దలు త్వరలోనే అసంతృప్తి నేతలతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తారని పార్టీ కేడర్ ఆశపడుతోంది. అందరినీ కలుపుకుని పోతేనే ఎన్నికల్లో విజయం సాధించడం సులువవుతుందని నాయకులు అభిప్రాయపడుతున్నారు. ఏది ఏమైనప్పటికీ మంత్రి స్థాయి వ్యక్తి అసంతృప్తి వ్యవసాయం, విద్యారంగ సమస్యలపై చర్చ జరిగే ఈ ఎన్నికల్లో కొంత హాట్ టాపిక్ అయింది. అసంతృప్తిని తొలగించడానికి అధిష్ఠానం ప్రత్యేక దూతలను పంపే అవకాశం ఉందని సమాచారం. ఇలాంటి చిన్నపాటి ఇబ్బందులను అధిగమించి ముందుకు వెళ్లాలని కాంగ్రెస్ నాయకత్వం భావిస్తోంది. ఈ స్థానానికి టికెట్ ఆశించి భంగపడ్డ ఇతర నాయకుల రాజకీయ భవిష్యత్తుపై రకరకాల చర్చలు మొదలయ్యాయి. ముఖ్యంగా పటేల్ రమేశ్ రెడ్డికి రాబోయే రోజుల్లో సముచిత స్థానం కల్పించేందుకే ప్రస్తుతానికి ఈ నిర్ణయం తీసుకున్నారనే ప్రచారం జోరుగా సాగుతోంది. దీనిపై పార్టీ నుంచి ఎలాంటి అధికారిక ధృవీకరణ లేకపోయినా, కేడర్‌లో మాత్రం పెద్ద ఎత్తున చర్చ నడుస్తోంది. గతంలో పార్టీ కోసం కష్టపడిన నాయకులకు తగిన గుర్తింపు దక్కాలనే డిమాండ్ కూడా కార్యకర్తల నుంచి వస్తోంది. టికెట్ దక్కని నాయకులు ఎన్నికల ప్రచారంలో ఎంతవరకు క్రియాశీలకంగా పాల్గొంటారనే దానిపైనే పార్టీ గెలుపు ఓటములు ఆధారపడి ఉంటాయి. పట్టభద్రుల మద్దతు కూడగట్టడానికి ప్రతి నాయకుడు క్షేత్రస్థాయిలో పర్యటించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అభ్యర్థి ప్రకటన వెలువడిన తరుణంలో ప్రతిపక్ష పార్టీలు కూడా తమ అభ్యర్థుల ఎంపికపై కసరత్తు వేగవంతం చేశాయి. ప్రధాన పార్టీల మధ్య త్రిముఖ పోరు జరిగే అవకాశం స్పష్టంగా కనిపిస్తోంది. ఓటర్లను ఆకట్టుకోవడానికి యువతకు ఉపాధి, నిరుద్యోగ భృతి వంటి అంశాలపై హామీలు గుప్పించడానికి రాజకీయ పార్టీలు సిద్ధమవుతున్నాయి. రాబోయే రోజుల్లో ప్రచార వేగం మరింత పుంజుకునే అవకాశం ఉంది. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల షెడ్యూల్ ప్రకారం డిసెంబర్ ముప్పైవ తేదీన తుది ఓటర్ల జాబితా విడుదల కాగానే ప్రచార పర్వం ఊపందుకుంటుంది. సుమారు మూడు ఉమ్మడి జిల్లాల పరిధిలోని పట్టభద్రులు ఈ ఎన్నికల్లో తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. నిరుద్యోగ సమస్యలు, ఉద్యోగావకాశాలు, ఉపాధ్యాయుల సమస్యలు ఈ ఎన్నికల్లో ప్రధాన ఎజెండాగా మారే సూచనలు కనిపిస్తున్నాయి. పట్టభద్రుల వోట్లు సాధారణ వోటర్లలా కాకుండా విభిన్నంగా ఆలోచించి వేస్తారనే నమ్మకం రాజకీయ నాయకుల్లో ఉంది. అందుకే ప్రతి అభ్యర్థి సోషల్ మీడియా వేదికగా, యువత సమావేశాలు ఏర్పాటు చేసి తమ వైపు తిప్పుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. డిగ్రీలు పూర్తి చేసిన యువతీ యువకులు పెద్ద సంఖ్యలో కొత్తగా ఓటర్లుగా నమోదు చేసుకున్నారు. వీరి మద్దతు ఎవరికి లభిస్తుందనే అంశంపైనే ఎన్నికల ఫలితాలు ఆధారపడి ఉంటాయి. ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో పాటు విద్యా రంగంలో వచ్చిన మార్పులను కూడా అభ్యర్థులు ప్రచారాస్త్రాలుగా మలుచుకుంటున్నారు. ఈ ఎన్నికల ఫలితాలు రాష్ట్ర రాజకీయాల్లో రాబోయే పరిణామాలకు ఒక దిక్సూచిలా మారుతాయని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి గెలుపు కోసం ఇప్పనుంచే క్షేత్రస్థాయిలో సన్నాహాలు ప్రారంభమయ్యాయి. పార్టీ శ్రేణులు అందరూ కలిసికట్టుగా పనిచేసి ఎమ్మెల్సీ స్థానాన్ని కైవసం చేసుకోవాలని పిలుపునిచ్చారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల్లోనూ ముఖ్య నాయకులతో సమావేశాలు నిర్వహించి వ్యూహాలు ఖరారు చేస్తున్నారు. పట్టభద్రుల సమస్యలపై ప్రత్యేకంగా డిక్లరేషన్ లేదా మేనిఫెస్టో విడుదల చేసే ఆలోచనలో కూడా పార్టీ ఉన్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వ పరంగా పట్టభద్రులకు అందుతున్న లబ్ధిని ఇంటింటికీ చేరవేయాలని నాయకులు భావిస్తున్నారు. ఈ నెలలు అభ్యర్థికి ప్రచారం చేసుకునేందుకు చాలా కీలకం కావడంతో ప్రతి నిమిషాన్ని సద్వినియోగం చేసుకోవాలని భావిస్తున్నారు. ఎన్నికల బరిలో నిలిచే ఇతర పార్టీల అభ్యర్థుల పేర్లు కూడా త్వరలోనే అధికారికంగా వెలువడే అవకాశం ఉంది. ఏది ఏమైనప్పటికీ నల్గొండ, ఖమ్మం, వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల రాజకీయం రాష్ట్రంలో నూతన రాజకీయ సమీకరణాలకు తెరలేపింది. చివరికి విజయం ఏ పార్టీని వరిస్తుందనేది వేచి చూడాలి.

## పీఎం శ్రీ పాఠశాలల్లో పార్లమెంటరీ పాఠాలు

- ఐడీఓసీలో ఘనంగా జిల్లా స్థాయి మాక్ పార్లమెంట్
- 21 పాఠశాలల నుంచి 79 మంది విద్యార్థుల ప్రతిభ
- రాష్ట్రస్థాయి పోటీలకు ఐదుగురు విద్యార్థుల ఎంపిక

**మహబూబాబాద్ జిల్లా**
**విశాల భారతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్.**




విద్యార్థుల్లో పార్లమెంటరీ ప్రజాస్వామ్యంపై అవగాహన పెంపొందించడంతో పాటు సభా నిర్వహణ, చర్చ, ప్రశ్నించడం, సమాధానం ఇవ్వడం వంటి ప్రజాస్వామ్య విలువలను ఆచరణాత్మకంగా నేర్పించేందుకు మహబూబాబాద్ జిల్లా ఐడీఓసీ వేదికగా పీఎం శ్రీ పాఠశాలల జిల్లా స్థాయి మాక్ పార్లమెంట్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. జిల్లాలో తొలిసారిగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో పీఎం శ్రీ, మోడల్ స్కూల్స్‌కు చెందిన 21 పాఠశాలల నుంచి 79 మంది విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొని తమ ప్రతిభను చాటారు.

**విద్యార్థుల్లో ప్రజాస్వామ్య స్ఫూర్తి పెంపొందాలి.**

కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ శ్రీమతి స్నేహ శబరిష్ మాట్లాడుతూ విద్యార్థుల్లో జాతీయ ఐక్యత, ప్రజాస్వామ్య విలువలు పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం ఎంతో గొప్ప విషయమన్నారు. తాను గ్రాడ్యుయేషన్ రెండో సంవత్సరం చదువుతున్న సమయంలో మాక్ పార్లమెంట్‌లో పాల్గొన్న విషయాన్ని ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు.

**ప్రత్యక్ష పార్లమెంట్ తరహాలో ప్రశ్నలు.. సమాధానాలు.**

మాక్ పార్లమెంట్‌లో అధికార, ప్రతిపక్ష పక్షాల సభ్యులు ఉత్సాహంగా పాల్గొని ప్రశ్నలు అడగడం, సమాధానాలు ఇవ్వడం, సమకాలీన అంశాలపై చర్చించడం అభినందనీయమని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రత్యక్ష ప్రసారాల ద్వారా పార్లమెంట్ ప్రొసీడింగ్స్‌ను పరిశీలిస్తే సభా నిర్వహణ, చర్చా విధానం తదితర అంశాలపై విద్యార్థులకు మరింత అవగాహన కలుగుతుందన్నారు.

**రాష్ట్రస్థాయి పోటీలకు ఐదుగురు.**

జిల్లాస్థాయి మాక్ పార్లమెంట్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన ఐదుగురు విద్యార్థులను రాష్ట్రస్థాయిలో నిర్వహించే కార్యక్రమానికి పంపనున్నట్లు కలెక్టర్ తెలిపారు. చక్కటి ఇంగ్లిష్ భాషా ప్రావీణ్యంతో పాటు విషయ పరిజ్ఞానంతో విద్యార్థులు పాల్గొనడం అభినందనీయమన్నారు. భవిష్యత్తులోనూ విద్యార్థులు ఇలాంటి కార్యక్రమాల్లో మరింత ఉత్సాహంతో పాల్గొనాలని ఆకాంక్షించారు.

**ప్రజా సమస్యలపై విద్యార్థుల చర్చ.**

మాక్ పార్లమెంట్‌లో విద్యార్థులు పార్లమెంట్ సభ్యుల పాత్రలను పోషిస్తూ సమకాలీన అంశాలపై చర్చలు, ప్రశ్నోత్తరాలు నిర్వహించారు. ప్రజా సమస్యలపై తమ అభిప్రాయాలను వ్యక్తం చేస్తూ సభా నిర్వహణ తీరును ఆచరణలో ప్రదర్శించారు. దీంతో విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, ప్రజాస్వామ్య స్ఫూర్తి, చర్చా నైపుణ్యాలు, బాధ్యతాయుత పౌరసత్వ భావన పెంపొందించేందుకు కార్యక్రమం దోహదపడుతుందని కలెక్టర్ పేర్కొన్నారు.

**అధికారులు, నిర్వాహకుల సహకారం.**

ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి డీఈఓ శ్రీరాములు, డీఎస్ఓ అప్పారావు, ఏఎంఓ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. మాక్ పార్లమెంట్ కార్యక్రమానికి కన్వీనర్‌గా ఉపేందర్ రావు, ఆర్గనైజర్‌గా అంజన్ సుల్తానా వ్యవహరించారు.

## సింగరేణిని ముంచేస్తున్నారు !



**మొదటిపేజీ తరువాయి**

రాష్ట్ర ప్రభుత్వం నుంచి తగిన సమయంలో నిధులు విడుదల కాకపోవడంతో సింగరేణి సంస్థ సొంత నిధులు కోల్పోయి దయనీయ స్థితికి చేరింది. ఏకంగా తొమ్మిది శాతం నుంచి పన్నెండు శాతం వరకు అధిక వడ్డీలకు బయట అప్పులు తెచ్చి మరీ కార్మికులకు జీతాలు చెల్లించాల్సిన దుస్థితి ఏర్పడింది. ఇది యాజమాన్య వైఫల్యానికి స్పష్టమైన నిదర్శనంగా కనిపిస్తోంది. కోల్ ఇండియా సంస్థ అనుసరిస్తున్న విధానాల మాదిరిగానే సింగరేణిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు కూడా రోజువారీ వేతనంగా కనీసం వెయ్యి రెండు వందల యాభై రూపాయలు చెల్లించాలని ఈటల గట్టిగా కోరారు. పీఏఏ పేరుతో అమాయక కార్మికులపై అధికారులు సాగిస్తున్న వేధింపులను అక్రమ డిస్మిస్ లను తక్షణమే నిలిపివేయాలి. కార్మికులకు చట్టపరంగా రావాల్సిన లాభాల వాటాను అధికారికంగా ప్రకటించి వెంటనే పంపిణీ చేయాలి. లేదంటే రాబోయే రోజుల్లో కార్మిక లోకం తిరగబడే ప్రమాదం స్పష్టంగా ఉంది. గతంలో అధికారంలో ఉన్న కేసీఆర్ ప్రభుత్వం అలాగే నేడు రాష్ట్రాన్ని పాలిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం కూడా సింగరేణి కార్మికులకు తెలంగాణ ప్రజలకు తీరని అన్యాయం చేశాయి. రెండు ప్రభుత్వాలు కూడా కార్మికుల సంక్షేమాన్ని పూర్తిగా గాలికి వదిలేసి రాజకీయ లబ్ధి కోసమే పనిచేశాయని ఈటల రాజేందర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. సింగరేణి సంస్థను సంపూర్ణంగా పరిరక్షించడానికి కార్మికుల హక్కులను కాపాడడానికి భారతీయ జనతా పార్టీ ఎల్లప్పుడూ ముందుంటుంది. ప్రభుత్వం తన పద్ధతి మార్చుకుని బకాయిలన్నీ చెల్లించే వరకు భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో ఈ పోరాటం నిరంతరం కొనసాగుతుంది. ఈ ధర్నా కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు వేరబెల్లి రఘునాథ్ తో పాటు అనేక మంది స్థానిక నాయకులు పాల్గొన్నారు. వేలాది సంఖ్యలో తరలివచ్చిన సింగరేణి కార్మికులు ఈ నిరసన కార్యక్రమంలో ఉత్సాహంగా పాలుపంచుకున్నారు. ప్రభుత్వం దిగివచ్చే వరకు ఎట్టి పరిస్థితుల్లోనూ వెనకడుగు వేసే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో రైతులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలపై కూడా ఈటల రాజేందర్ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. నాసిరకం విద్యుత్ సరఫరా కారణంగా పొలాల్లో ఉన్న విద్యుత్ మోటార్లు పూర్తిగా కాలిపోతున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. దీనివల్ల అన్నదాతలు తీవ్రమైన ఆర్థిక నష్టాలను చవిచూడాల్సి వస్తోందని వెంటనే స్పష్టం చేశారు. రాష్ట్రంలో దెబ్బతిన్న విద్యుత్ అలాగే సాగునీటి వ్యవస్థలను ప్రభుత్వం తక్షణమే పూర్తిస్థాయిలో పునరుద్ధరించాలని ఆయన డిమాండ్ చేశారు. లేకపోతే రైతులు ఉద్యమించే పరిస్థితి వస్తుందని హెచ్చరించారు. సింగరేణి కార్మికులు కేవలం ఒక ప్రాంతానికి పరిమితం కాకుండా రాష్ట్ర మొత్తం అభివృద్ధికి వెన్నెముకగా నిలిచారు. అలాంటి గొప్ప కార్మికుల కష్టాన్ని గుర్తించడంలో ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయి. కార్మికులకు న్యాయం జరిగే వరకు ప్రజా ప్రతినిధులుగా తాము అండగా ఉండి పోరాడతామని భరోసా కల్పించారు. ప్రతి ఒక్కరూ ఐక్యంగా ఉండి తమ హక్కులను సాధించుకోవాలని ఈటల పిలుపునిచ్చారు. మంచిర్యాల జిల్లా నస్పూర్ వేదికగా జరిగిన ఈ సింగరేణి ధర్నా సభ రాష్ట్ర రాజకీయాల్లో సరికొత్త చర్చకు దారితీసింది. కార్మిక సంఘాలు ఈ ఉద్యమానికి సంపూర్ణ మద్దతు ప్రకటించడంతో రాబోయే రోజుల్లో రాజకీయ వేడి మరింత పెరిగే అవకాశం ఉంది. ప్రభుత్వం ఇప్పటికైనా కళ్ళు తెరిచి సింగరేణి సంస్థకు రావలసిన నిధులను తక్షణమే విడుదల చేయాలని కార్మికులు ముక్తకంఠంతో కోరుతున్నారు. లేదంటే పెద్ద ఎత్తున సమ్మె బాట పట్టడానికి కూడా కార్మిక లోకం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి ఒక్క నాయకుడు కూడా ప్రభుత్వ తీరును తీవ్రంగా ఖండించారు. కార్మికుల సంక్షేమం కోసం అలుపెరగని పోరాటం చేస్తామని మరోసారి స్పష్టం చేశారు. ఈ ప్రాంత ప్రజల ఆశలను వమ్ము చేస్తున్న పాలకులకు తగిన బుద్ధి చెప్పే రోజు త్వరలోనే వస్తుందని నాయకులు హెచ్చరించారు. సింగరేణి కార్మికుల కుటుంబాలకు భవిష్యత్తులో ఎలాంటి ఇబ్బందులు రాకుండా శాశ్వత పరిష్కారం చూపించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర భవిష్యత్తును నిర్ణయించే శక్తి సింగరేణి కార్మికులకు ఉందని ఈటల రాజేందర్ తన ప్రసంగంలో స్పష్టం చేశారు. కార్మికుల చెమట చుక్కతోనే రాష్ట్రం ఆర్థికంగా నిలదొక్కుకుందని అందరూ గమనించాలని సూచించారు. ప్రభుత్వం ఇప్పటికైనా మొండి వైఖరి వీడి కార్మికుల సమస్యలను సానుకూలంగా పరిష్కరించాలని కోరారు. కార్మికుల హక్కుల సాధన కోసం బీజేపీ నాయకులు ఎప్పుడూ ముందువరుసలో ఉండి పోరాటాలు నిర్వహిస్తారని మరోసారి స్పష్టం చేశారు. ఈ మహాధర్నా విజయవంతం కావడంతో కార్మికులలో నూతనోత్సాహం వెల్లివిరిసింది. రాబోయే కాలంలో కార్మిక వ్యతిరేక విధానాలను మరింత తీవ్రంగా ఎండగడతామని నాయకులు ప్రతిన బూనారు. సింగరేణి సంస్థను కాపాడుకోవడం ప్రతి తెలంగాణ బిడ్డ బాధ్యత అని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రభుత్వానికి స్పష్టమైన హెచ్చరిక పంపినట్లు అయింది. కార్మికుల సంక్షేమమే ధ్యేయంగా తమ పోరాటం నిరంతరం సాగుతుందని బీజేపీ నాయకులు తేల్చిచెప్పారు.

## సిరిసిల్ల గడీల మీద ఫిరంగులమై పేలుదాం

**మొదటిపేజీ తరువాయి**



తెలంగాణ పబ్లిక్ స్కూళ్ల నిర్మాణ పనులను అధికారికంగా ప్రారంభించారు. వేములవాడ ఆలయ విస్తరణ అభివృద్ధి పనుల నిమిత్తం సుమారు తొంభై తొమ్మిది కోట్ల నలభై లక్షల రూపాయలను కేటాయించారు. రుద్రంగిలో పదివేల మెట్రిక్ టన్నుల భారీ నిల్వ సామర్థ్యం గల గోదాము నిర్మాణానికి భూమి పూజ నిర్వహించారు. సిరిసిల్ల పట్టణంలో నేతన్న బజార్ నిర్మాణ పనులతో పాటు యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ ఏర్పాటుకు కూడా శంకుస్థాపనలు జరిగాయి. ఈ పనులన్నీ నిర్దేశిత కాలపరిమితిలో పూర్తి చేయాలని అధికారులను ముఖ్యమంత్రి గట్టిగా ఆదేశించారు. ప్రజలకు మెరుగైన వసతులు కల్పించడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. కరీంనగర్ కలెక్టరేట్ భవన సముదాయంలో అధికారులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేకంగా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ అత్యున్నత సమావేశానికి కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ తో పాటు మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు పొన్నం ప్రభాకర్ పొంగులేటి శ్రీనివాస రెడ్డి హాజరయ్యారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన పేదలందరికీ సకాలంలో చేరాలంటే ఉద్యోగులే ప్రభుత్వ అసలైన ప్రతినిధులని సీఎం గుర్తుచేశారు. సహాయం కోరుతూ కలెక్టరేట్‌కు వచ్చే ప్రతి ఒక్కరిని సొంత కుటుంబ సభ్యుల్లా ఆదరించాలని అధికారులకు సూచించారు. ఇంకా పరిష్కారం కాని ప్రజా సమస్యలను వెంటనే గుర్తించి క్షేత్రస్థాయిలో పరిష్కరించాలని స్పష్టం చేశారు. రాష్ట్ర అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వ సహకారం ఎంతైనా అవసరమని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. కేంద్రంతో సత్సంబంధాలు కలిగి ఉంటూ రాష్ట్రానికి రావాల్సిన నిధులను సాధించుకుంటామని స్పష్టం చేశారు. కేవలం ఎన్నికల సమయంలో మాత్రమే రాజకీయాలు మాట్లాడతామని మిగతా సమయంలో అభివృద్ధి ఒక్కటే తమ ధ్యేయమని రేవంత్ రెడ్డి పునరుద్ఘాటించారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో సిరిసిల్ల ప్రాంతం ఉరిసిల్లగా మారిపోయిందని ముఖ్యమంత్రి తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. రెండు వేల తొమ్మిది నుంచి ఆరుసార్లు వరుసగా గెలిపించినప్పటికీ నేతన్నల ఆత్మహత్యలను మాజీ మంత్రి కేటీఆర్ ఆపలేకపోయారని మండిపడ్డారు. ఉపాధి కోసం గల్ఫ్ దేశాలకు వలస వెళ్తున్న కార్మికుల కుటుంబాల జీవితాలను మార్చడంలో స్థానిక నాయకులు పూర్తిగా విఫలమయ్యారని ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టు పేరుతో కేసీఆర్ కుటుంబం లక్ష కోట్ల రూపాయలు కొల్లగొట్టిందని తీవ్ర ఆరోపణలు చేశారు. కేసీఆర్ బంధువులైన రవీందర్ రావు సంతోష్ రావు మానేరు ఇసుకను అక్రమంగా తవ్వి వేల కోట్లు దోచుకున్నారని విమర్శించారు. ముంపు బాధితుల ప్యాకేజీ నిధులను కూడా వదలకుండా గులాబీ నేతలు స్వాహా చేశారని బహిరంగ సభలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ధైర్యం దైవం కలగలిసిన సిరిసిల్ల గడ్డను బీఆర్ఎస్ పాలకులు సమస్యల నిలయంగా మార్చేశారని సీఎం ధ్వజమెత్తారు. ప్రజల కష్టాలను పట్టించుకోకుండా కేవలం కుటుంబ పాలన సాగించారని విమర్శించారు. సమస్యల పరిష్కారం కోసం కేంద్ర ప్రభుత్వం వద్దకు ఎన్నిసార్లయినా వెళ్లడానికి తనకు ఎలాంటి మొహమాటం లేదని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. కేంద్రం మంచి పనిచేస్తే అభినందించడానికి సీఎంగా తనకు ఎలాంటి శషభిషలు ఉండవని తేల్చిచెప్పారు. కేవలం ఆరు నెలల కాలంలోనే నూట డెబ్బై ఎకరాల కంటోన్మెంట్ రోడ్డు కోసం కేంద్రం నుంచి అనుమతులు సాధించామని తెలిపారు. బేగంపేట రన్ వే కింద టన్నెల్ నిర్మాణం ద్వారా నూతన రోడ్డు మంజూరు చేయించుకున్నామని వివరించారు. అర్బన్ ఛాలెంజ్ ఫండ్ ద్వారా కేంద్రం నుంచి ఎనిమిది వందల నలభై కోట్ల రూపాయల నిధులు సాధించామని సగర్వంగా ప్రకటించారు. వేములవాడ రాజన్న సాక్షిగా సిరిసిల్ల గడ్డపై ప్రజాపాలన రెండు రాబోతోందని పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ధీమా వ్యక్తం చేశారు. గతంలో సోనియా గాంధీ మన్మోహన్ సింగ్ నాయత్వంలో యూపీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినట్లు గుర్తుచేశారు. ఇప్పుడు రేవంత్ రెడ్డి తన సారథ్యంలో అదే స్ఫూర్తితో కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతుందని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో సిరిసిల్ల ఎల్లారెడ్డి పేట బోయినపల్లి తంగళ్లపల్లి ప్రాంతాలలో పోలీసులు ముందస్తు అరెస్టులు చేపట్టారు. పలువురు బీఆర్ఎస్ అలాగే బీజేపీ నాయకులను పోలీసులు ఎక్కడికక్కడ అదుపులోకి తీసుకోవడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భారీ బందోబస్తు ఏర్పాటు చేసి పర్యటనను ప్రశాంతంగా ముగించారు. చివరిగా కరీంనగర్‌లో తెలంగాణ తల్లి విగ్రహాన్ని సీఎం రేవంత్ రెడ్డి ఘనంగా ఆవిష్కరించారు. అధికార యంత్రాంగం ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి రాష్ట్ర ప్రగతికి పాటుపడాలని మరోసారి పిలుపునిచ్చారు. ఈ సుదీర్ఘ పర్యటన ద్వారా స్థానిక ప్రజలకు అనేక కొత్త అభివృద్ధి ప్రాజెక్టుల ఫలాలు అందనున్నాయని కాంగ్రెస్ శ్రేణులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత చేపట్టిన ఈ భారీ కార్యక్రమం రాజకీయంగా అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది. సంక్షేమం అభివృద్ధి రెండు కళ్లుగా భావించి రాష్ట్ర ప్రభుత్వాన్ని మరింత ముందుకు తీసుకువెళ్తామని ముఖ్యమంత్రి స్పష్టం చేయడంతో ఈ పర్యటన విజయవంతంగా ముగిసింది.

## సిరిసిల్ల ఏమైనా శత్రు రాజ్యమా..?

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**




సిరిసిల్లలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మొదటి పర్యటన రాజకీయంగా తీవ్ర దుమారం రేపింది. అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ మధ్య మాటల యుద్ధం తారాస్థాయికి చేరింది. కేటీఆర్ ఎమ్మెల్యేగా రాకముందు సిరిసిల్ల ఎలా ఉండేది, ఇప్పుడు ఎలా మారిందో ప్రజలను అడగాలని హరీశ్ రావు సవాల్ విసిరారు. సిరిసిల్ల శత్రు రాజ్యమా లేక దండయాత్ర ప్రాంతమా అని ఆయన నిలదీశారు. సీఎం పర్యటనకు భారీ పోలీసు బందోబస్తు, నిర్బంధాలు ఎందుకని ప్రశ్నించారు. బీఆర్ఎస్ కార్యకర్తలను, ఉద్యమకారులను పోలీసులు అదుపులోకి తీసుకోవడం అన్యాయమని మండిపడ్డారు. ప్రజల మనసు గెలవాలంటే పోలీసు బలగాలు కాదు, గత ప్రభుత్వం చేసిన అభివృద్ధి కంటే ఎక్కువ చేసి చూపించాలని హితవు పలికారు. రేవంత్ రెడ్డి సిరిసిల్లకు వచ్చి అక్కడి మార్పులను నేర్చుకోవాలని హరీశ్ రావు విమర్శించారు. కేటీఆర్ హయాంలోనే మానేరు పరివాహక ప్రాంతంలో చెక్‌డ్యామ్‌ల నిర్మాణం జరిగిందని, కాళేశ్వరం జలాలతో సాగు విస్తీర్ణం భారీగా పెరిగిందని బీఆర్ఎస్ గట్టిగా వాదిస్తోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సీఎం హోదాలో తొలిసారి సిరిసిల్లలో పర్యటిస్తున్న నేపథ్యంలో సుమారు 345 కోట్ల రూపాయల విలువైన వివిధ అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేయనున్నారు. అంబేద్కర్ చౌరస్తా నుండి సభా ప్రాంగణం వరకు సుమారు 4 కిలోమీటర్ల మేర భారీ రోడ్‌షో నిర్వహించడానికి కాంగ్రెస్ పార్టీ శ్రేణులు విస్తృత ఏర్పాట్లు చేశాయి. ఈ పర్యటన రాజకీయంగా ఎంతో ప్రాధాన్యత సంతరించుకుంది. కేటీఆర్ 2009 నుండి ఈ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తూ వస్తున్నారు. రేవంత్ రెడ్డి పర్యటన ప్రకటన వెలువడిన క్షణం నుండి ఇరు పార్టీల నేతల మధ్య విమర్శలు ప్రతివిమర్శలు జోరుగా సాగాయి. రేవంత్ రెడ్డికి ఇయాల నిద్రపడట్లేదని కేటీఆర్ ప్యారడైజ్ మూవీ పేరుతో సెటైర్లు వేశారు. సిరిసిల్ల అభివృద్ధిపై కాంగ్రెస్, బీఆర్ఎస్ వర్గాలు పూర్తి భిన్నమైన వాదనలను ప్రజల ముందుంచుతున్నాయి. ఈ రాజకీయ వేడి నేపథ్యంలో సిరిసిల్లలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. నియోజకవర్గ ప్రజలు మాత్రం ఎవరు ఏం చేస్తారో అని ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. సిరిసిల్లలో నేతన్నల పరిస్థితి, పరిశ్రమకు లభించే ఆర్డర్లు, సాగునీరు, మౌలిక వసతులు, సంక్షేమ పథకాల అమలుపై రెండు పార్టీల మధ్య తీవ్రమైన చర్చ జరుగుతోంది. కేటీఆర్ హయాంలో బతుకమ్మ చీరల ఆర్డర్లు, సబ్సిడీ విద్యుత్, నేతన్నకు చేయూత వంటి కార్యక్రమాలు కార్మికుల ఉపాధికి ఎంతగానో ఉపయోగపడ్డాయని బీఆర్ఎస్ నాయకులు స్పష్టంగా చెబుతున్నారు. మరోవైపు పవర్‌లూమ్ పరిశ్రమకు శాశ్వత మార్కెట్ కల్పించడంలో గత ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని కాంగ్రెస్ పార్టీ నేతలు తీవ్రంగా ఆరోపిస్తున్నారు. గత ప్రభుత్వ విధానాల లోపాల కారణంగానే పవర్‌లూమ్ రంగంలో సమస్యలు తలెత్తాయని, నేతన్నలకు శాశ్వత ఉపాధి కల్పించాల్సిన అవసరం చాలా ఉందని కాంగ్రెస్ వాదిస్తోంది. సంక్షేమం పేరుతో కేవలం మోసాలు చేశారని విమర్శలు గుప్పిస్తున్నారు. ఇరు పార్టీల నేతలు లెక్కలతో సహా ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకుంటూ ముందుకు సాగుతున్నారు. నేతన్నల సమస్యలు ఎప్పటికీ తీరుతాయని కార్మికులు ఆందోళన చెందుతున్నారు. రాజకీయ నాయకుల మాటల యుద్ధం చూసి స్థానికులు విసిగిపోతున్నారు. సిరిసిల్ల అభివృద్ధి విషయంలో బీఆర్ఎస్ నాయకులు తాము చేసిన పనులను ప్రస్తావిస్తూ ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు. మున్సిపల్ అభివృద్ధి, చెక్‌డ్యామ్‌ల నిర్మాణం ద్వారా భూగర్భ జలాలు పెరిగాయని, వ్యవసాయం కళకళలాడుతోందని వివరిస్తున్నారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం క్షేత్రస్థాయిలో పరిస్థితి వేరేలా ఉందని ఆరోపిస్తోంది. రూ.345 కోట్ల అభివృద్ధి పనులతో సిరిసిల్ల రూపురేఖలను పూర్తిగా మార్చివేస్తామని కాంగ్రెస్ నేతలు ధీమా వ్యక్తం చేస్తున్నారు. నియోజకవర్గంలో యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే తమ ప్రధాన ధ్యేయమని స్పష్టం చేస్తున్నారు. కేటీఆర్ ప్రాతినిధ్యం వహించిన ఇన్ని సంవత్సరాలలో జరగని పనులను తాము చేసి చూపిస్తామని కాంగ్రెస్ నాయకులు సవాళ్లు విసురుతున్నారు. రెండు పార్టీల మధ్య నడుస్తున్న ఈ రాజకీయం సిరిసిల్ల గడ్డపై తీవ్ర చర్చకు దారితీసింది. ఎవరి వాదనలు ఎలా ఉన్నప్పటికీ అభివృద్ధి ఎవరి హయాంలో జరిగిందనే అంశంపై ప్రజలు చర్చించుకుంటున్నారు. రాబోయే రోజుల్లో ఈ రాజకీయం మరింత ముదిరే అవకాశం ఉంది. ఈ రాజకీయ రగడలో సామాన్య ప్రజల సమస్యలు తెరమరుగు అవుతున్నాయని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఒకవైపు కోట్లతో అభివృద్ధి పనుల శంకుస్థాపనలు జరుగుతుంటే మరోవైపు విమర్శల ప్రవాహం కొనసాగుతోంది. నేతన్నలకు భవిష్యత్తులో శాశ్వత ఉపాధి దొరుకుతుందా లేదా అనే ప్రశ్న అలాగే మిగిలిపోయింది. ప్రభుత్వం మారిన తర్వాత మౌలిక వసతుల కల్పనలో వేగం పెరిగిందని కొందరు అంటుంటే, గతంలోనే అన్ని రకాల సంక్షేమ పథకాలు సక్రమంగా అందాయని మరికొందరు గుర్తు చేస్తున్నారు. సీఎం పర్యటనతోనైనా సిరిసిల్ల సమస్యలకు శాశ్వత పరిష్కారం దొరుకుతుందని అందరూ ఆశిస్తున్నారు. మాటల యుద్ధాలు పక్కన పెట్టి ప్రజలకు ఏ పార్టీ నిజమైన మేలు చేస్తుందో కాలమే నిర్ణయించాలి. ఏది ఏమైనా సిరిసిల్ల రాజకీయాలు మాత్రం రాష్ట్రవ్యాప్తంగా హాట్ టాపిక్‌గా మారాయి. నాయకుల మాటల తూటాలకు తెరపడే సమయం ఎప్పుడ వస్తుందో వేచి చూడాలి.

# చందానగర్‌లో మెడికల్ గోడౌన్‌లో భారీ అగ్ని ప్రమాదం



- రూ.కోటి విలువైన వైద్య పరికరాలు దగ్ధం
- నాలుగు ఫైర్ ఇంజన్లతో మంటల అదుపు

సైబరాబాద్ - విశాల భారతి

చందానగర్‌లో మంగళవారం అర్ధరాత్రి భారీ అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. సాయి అనురాగ్ హాస్పిటల్ పక్కనే ఉన్న సర్జికేర్ షాపి మెడికల్ గోడౌన్‌లో ప్రమాదవశాత్తు ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. మంటలు వేగంగా వ్యాపించడంతో గోడౌన్‌లోని వైద్య పరికరాలు, సర్జికేర్ సామగ్రి పెద్దఎత్తున దగ్ధమైనట్లు సమాచారం. పటాన్‌చెరు అగ్నిమాపక సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం.. రాత్రి 12 గంటల ప్రాంతంలో గోడౌన్ నుంచి మంటలు ఎగసిపడుతున్నట్లు సమాచారం అందడంతో సిబ్బంది వెంటనే ఘటనాస్థలానికి చేరుకున్నారు. నాలుగు ఫైర్ ఇంజన్లతో మంటలను అదుపు చేసేందుకు తీవ్రంగా శ్రమించి, కొంతసేపటికి పూర్తిగా అదుపులోకి తీసుకొచ్చారు. ఈ ప్రమాదంలో ప్రాణనష్టం సంభవించలేదని అధికారులు తెలిపారు. గోడౌన్ యజమాని శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ప్రమాదంలో దాదాపు రూ.కోటి విలువైన మెడికల్ ఎక్విప్‌మెంట్, సర్జికేర్ వస్తువులు పూర్తిగా దగ్ధమైనట్లు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రమాదానికి గల కారణాలు ఇంకా తెలియరాలేదని, విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణమై ఉండొచ్చా అనే కోణంలో పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ ఘటనపై గోడౌన్ యజమాని చందానగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి అగ్ని ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు చేస్తున్నారు.

# తెలంగాణ పోలీస్ అకాడమీలో శిక్షణకు పెద్దపీట

- ప్రొబేషనరీ డీఎస్పీలకు డీజీపీ సీ.వి. ఆనంద్ సూచనలు

రాజేంద్రనగర్, విశాల భారతి :



పోలీస్ అధికారుల కెరీర్‌కు శిక్షణే పునాది అని తెలంగాణ డీజీపీ సీ.వి. ఆనంద్ అన్నారు. క్రమశిక్షణ, నిబద్ధత, నాయకత్వ లక్షణాలు, నైతిక విలువలతో పనిచేసినప్పుడే సమర్థవంతమైన పోలీస్ అధికారులుగా ఎదగగలరని సూచించారు. ఆర్‌బీవీఆర్ఆర్ తెలంగాణ పోలీస్ అకాడమీలో శిక్షణ పొందుతున్న 112 మంది ప్రొబేషనరీ డీఎస్పీలతో బుధవారం డీజీపీ సుమారు గంటన్నరపాటు ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ నాయకత్వం, విధి నిర్వహణలో బాధ్యతలు, నైతిక విలువలు, ప్రజలతో వ్యవహరించే తీరు, దర్యాప్తు నైపుణ్యాలు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం తదితర అంశాలపై డీజీపీ విస్తృతంగా దిశానిర్దేశం చేశారు. పదవిలో ఉన్నంత మాత్రాన నాయకత్వం రాదని, సమర్థమైన నాయకుడికి ధైర్యం, స్పష్టమైన దార్శనికత, సమగ్రత, నైతిక విలువలు, బృంద స్ఫూర్తి, నిష్పక్షపాత వైఖరి, సమర్థమైన సమాచార మార్పిడి, కష్టపడి పనిచేసే తత్వం, సాంకేతిక పరిజ్ఞానం, సృజనాత్మకత, వినయం వంటి లక్షణాలు అవసరమని వివరించారు.

**నైతిక విలువలకు ప్రాధాన్యం**

విధి నిర్వహణలో చేసే చిన్న పొరపాట్లు సైతం భవిష్యత్తులో అధికారుల ప్రతిష్ఠపై ప్రభావం చూపే అవకాశం ఉందని డీజీపీ హెచ్చరించారు. పోలీస్ సర్వీసులో సుదీర్ఘ కెరీర్ కొనసాగనున్నందున ప్రతి అధికారి తన ప్రతిష్ఠను కాపాడుకోవడం అత్యంత ముఖ్యమన్నారు. చట్ట పరిజ్ఞానంతో పాటు మానవీయ దృక్పథం, దర్యాప్తు నైపుణ్యం, సాంకేతిక అవగాహన, శారీరక దృఢత్వం, ప్రజలతో సమర్థవంతమైన కమ్యూనికేషన్ అవసరమని పేర్కొన్నారు. "ప్రజలకు భద్రత కల్పించడం, వారికి సకాలంలో న్యాయం అందేలా చూడటమే పోలీసింగ్ అంతిమ లక్ష్యం" అని డీజీపీ స్పష్టం చేశారు.

**10 నెలలపాటు ప్రొఫెషనల్ శిక్షణ**

తెలంగాణ పోలీస్ అకాడమీ డైరెక్టర్ అభిలాష బిస్త్ మాట్లాడుతూ 74 మంది పురుషులు, 38 మంది మహిళలు కలిపి మొత్తం 112 మంది ప్రొబేషనరీ డీఎస్పీలు సుమారు 10 నెలల ప్రొఫెషనల్ కోర్సులో శిక్షణ పొందుతున్నారని తెలిపారు. ఇండోర్, అవుట్‌డోర్ శిక్షణకు సమాన ప్రాధాన్యం ఇస్తున్నట్లు చెప్పారు. భారతీయ న్యాయ సంహిత, క్రిమినల్ చట్టాలు, నేర శాస్త్రంతో పాటు నేర దర్యాప్తు, ఆధునిక పోలీసింగ్, ఆస్తి సంబంధిత నేరాలు, ఆర్థిక నేరాలపై ప్రత్యేక శిక్షణ అందిస్తున్నట్లు వివరించారు. క్షేత్రస్థాయి పరిస్థితులను సమర్థంగా ఎదుర్కొనేలా కాంబాట్ వ్యాయామాలు, గుర్రపు స్వారీ, ఈత, వివిధ రకాల ఆయుధాల వినియోగంలోనూ శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. సీనియర్ పోలీస్ అధికారులు, వివిధ రంగాల నిపుణులతో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

**పోలీసులకు క్రీడలు, వ్యాయామం తప్పనిసరి**

అనంతరం 5వ తెలంగాణ పోలీస్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్-2026 క్లస్టర్-సీలో విజేతలకు డీజీపీ సీ.వి. ఆనంద్ పతకాలు, బహుమతులు అందజేశారు. సెప్టెంబరు 28న ప్రారంభమైన మూడు రోజుల పోటీలు బుధవారం ముగిశాయి. బ్యాడ్మింటన్, లాన్ టెన్నిస్, టేబుల్ టెన్నిస్ పోటీల్లో కానిస్టేబుల్ స్థాయి నుంచి ఐపీఎస్ అధికారుల వరకు 700 మందికి పైగా పాల్గొన్నారు. పోలీసులు ఒత్తిడితో కూడిన విధులు నిర్వహిస్తున్నందున శారీరక, మానసిక ఆరోగ్యానికి క్రీడలు ఎంతో అవసరమని డీజీపీ అన్నారు. ప్రతి పోలీస్ అధికారి రోజుకు కనీసం గంటపాటు క్రీడలు లేదా శారీరక వ్యాయామానికి కేటాయించాలని సూచించారు. క్లస్టర్ విధానం ద్వారా ఎక్కువ మంది పోలీస్ క్రీడాకారులకు పోటీల్లో పాల్గొనే అవకాశం కల్పిస్తున్నామని తెలిపారు. క్లస్టర్ స్థాయిలో ప్రతిభ కనబరిచిన వారిని గుర్తించి, ఆల్ ఇండియా పోలీస్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్‌లో తెలంగాణ తరపున ప్రాతినిధ్యం వహించేలా ప్రోత్సహిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఐజీపీ (పి&ఎల్) గజరావు భూపాల్, డిప్యూటీ డైరెక్టర్లు చేతన, మురళీధర్, వెంకటేశ్వర్లు, కేఆర్‌కే ప్రసాద్, అసిస్టెంట్ డైరెక్టర్లు వేమా శ్రీనివాసరెడ్డి, భారత్, వేముల శ్రీనివాసరావు, డీఎస్పీలు పీజీ రెడ్డి, సతీష్, ఆదూరి శ్రీనివాసరావు, సందీప్‌రెడ్డి, అమృత్‌రెడ్డి, దేవారెడ్డి, యూనిట్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రమాదేవి, ఓఎస్‌డీ వెంకట్రావు తదితర అధికారులు, అకాడమీ సిబ్బంది, ట్రైనీ ప్రొబేషనరీ డీఎస్పీలు పాల్గొన్నారు.



## రూ.2.10 లక్షలకు గల్లి గణేశుడి లడ్డూ కైవసం

- శ్రీరామ్‌నగర్ కాలనీలో 21 కిలోల లడ్డూను వేలంలో దక్కించుకున్న సాయి హర్ష బిల్డర్స్ అధినేత బలరాం యాదవ్

సైబరాబాద్ - విశాల భారతి

శ్రీరామ్‌నగర్ కాలనీలోని గల్లి గణేశ్ వద్ద ఏర్పాటు చేసిన వినాయకుడి లడ్డూ వేలం ఉత్సాహంగా సాగింది. గణనాథుడికి నైవేద్యంగా సమర్పించిన 21 కిలోల లడ్డూ వేలంలో పలువురు భక్తులు పోటీపడ్డారు. చివరకు సాయి హర్ష బిల్డర్స్ అధినేత బలరాం యాదవ్ రూ.2,10,116లకు లడ్డూను వేలం పాటలో కైవసం చేసుకున్నారు. వేలం సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని పోటీగా వేలం పాట పాడారు. లడ్డూను దక్కించుకున్న బలరాం యాదవ్ మాట్లాడుతూ గణేశుడి ఆశీస్సులతో కుటుంబ సభ్యులు, వ్యాపార భాగస్వాములు, కాలనీ ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. లడ్డూ వేలం ద్వారా వచ్చిన మొత్తాన్ని గణేష్ ఉత్సవాల నిర్వహణకు, కాలనీ అభివృద్ధి కార్యక్రమాలకు వినియోగించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.ఈ సందర్భంగా నిర్వాహకులు బలరాం యాదవ్‌ను అభినందించి లడ్డూను అందజేశారు. కాలనీ వాసులు, భక్తులు వేలం కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు.

# నల్లగండ్ల చెరువు పనుల వద్ద ఉద్రిక్తత

- మట్టి లారీల డ్రైవర్లపై రాళ్లతో దాడి
- నాలుగు వాహనాల అద్దాలు ధ్వంసం

సైబరాబాద్ - విశాల భారతి




నల్లగండ్ల చెరువు అభివృద్ధి పనుల్లో భాగంగా మట్టి తరలిస్తున్న లారీ డ్రైవర్లపై దాడి చేసి, నాలుగు లారీల విండ్‌షీల్డ్‌స్‌ను ధ్వంసం చేసిన ఘటన చందానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. గోపన్‌పల్లి తండా ఫ్లైఓవర్ కింద మట్టి డంపింగ్ చేస్తుండగా ఈ ఘటన జరిగినట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై చందానగర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసుల వివరాల ప్రకారం.. హైడ్రా ఆధ్వర్యంలో నల్లగండ్ల చెరువు అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా ఈ నెల 28న రాత్రి గోపన్‌పల్లి తండా ఫ్లైఓవర్ కింద అధికారులు నిర్దేశించిన ప్రదేశంలో లారీల ద్వారా మట్టిని తరలించి డంపింగ్ చేస్తున్నారు. అదే సమయంలో గోపన్‌పల్లికి చెందిన సుమన్‌తో పాటు మరికొందరు వ్యక్తులు అక్కడికి వచ్చినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.మట్టి డంపింగ్ చేస్తున్న లారీ డ్రైవర్లతో వారు వాగ్వాదానికి దిగినట్లు పోలీసులు తెలిపారు. అనంతరం పరిస్థితి ఉద్రిక్తంగా మారి రాళ్లు, మట్టి గడ్డలతో లారీ డ్రైవర్లపై దాడి చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ దాడిలో లారీ డ్రైవర్లకు గాయాలు కాగా, నాలుగు లారీల ముందు అద్దాలు పూర్తిగా ధ్వంసమైనట్లు పోలీసులు తెలిపారు.

**హిటాచీ ఆపరేటర్‌పైనా దాడి..**

అదే సమయంలో అక్కడ విధులు నిర్వహిస్తున్న హిటాచీ ఆపరేటర్ సునీల్‌కుమార్ మెహతాపైనా దాడి జరిగినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆయనపై రాళ్లతో దాడి చేయడంతో కిందపడిపోయినట్లు, అనంతరం ఆయనను తొక్కడంతో ఎడమ కంటికి, వీపుపై తీవ్ర గాయాలైనట్లు తెలిపారు. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించినట్లు సమాచారం.ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు అందడంతో చందానగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. క్రైమ్ నంబర్ 1031/2026గా కేసు నమోదు చేసి భారతీయ న్యాయ సంహితలోని 118(1), 352, 351(2), 324(4) సెక్షన్లతో పాటు 3(5) కింద దర్యాప్తు చేపట్టారు. ఘటనకు సంబంధించి సుమన్‌తో పాటు మరికొందరి పాత్రపై పోలీసులు విచారణ కొనసాగిస్తున్నారు. మట్టి తరలింపు పనుల వద్ద జరిగిన ఘర్షణకు దారితీసిన పరిస్థితులపైనా ఆరా తీస్తున్నారు.

# చందానగర్‌లో గంజాయి గుట్టురట్టు

- ఒడిశా నుంచి తెచ్చి నగరంలో విక్రయిస్తున్న ఇద్దరి అరెస్టు
- 1.5 కిలోల గంజాయి స్వాధీనం

సైబరాబాద్ - విశాల భారతి






ఒడిశా నుంచి గంజాయిని అక్రమంగా తరలించి హైదరాబాద్‌లో విక్రయిస్తున్న ఇద్దరిని చందానగర్ పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి సుమారు 1.5 కిలోల గంజాయితో పాటు రెండు సెల్‌ఫోన్లు, పాలిథిన్ కవర్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితులు ఒడిశాలోని కుందులి ప్రాంతం నుంచి గంజాయిని కొనుగోలు చేసి నగరానికి తీసుకొచ్చి విక్రయిస్తున్నట్లు విచారణలో వెల్లడైనట్టు పోలీసులు తెలిపారు.పోలీసుల వివరాల ప్రకారం.. చందానగర్ రైల్వే స్టేషన్ సమీపంలో గంజాయి అక్రమ రవాణా జరుగుతున్నట్లు పోలీసులకు మంగళవారం విశ్వసనీయ సమాచారం అందింది. దీంతో పోలీసులు అక్కడ నిఘా ఏర్పాటు చేశారు. అదే సమయంలో అనుమానాస్పదంగా సంచరిస్తున్న ఇద్దరు వ్యక్తులు పోలీసులను గమనించి అక్కడి నుంచి వెళ్లిపోయేందుకు ప్రయత్నించారు. దీంతో అప్రమత్తమైన పోలీసులు వారిని వెంబడించి అదుపులోకి తీసుకున్నారు.వారిని తనిఖీ చేయగా గంజాయి బయటపడింది. అరెస్టయిన వారిని విశాఖపట్నానికి చెందిన మెరిపాటి మనోజ్‌కుమార్ (22), విజయనగరం జిల్లా లోతుగడ్డ మెంటాడకు చెందిన ఎం.ఆశాజ్యోతి (23)గా గుర్తించారు. ఇద్దరూ ప్రైవేటు ఉద్యోగాలు చేస్తున్నట్లు పోలీసుల విచారణలో తేలింది.విచారణలో భాగంగా నిందితులు ఒడిశాలోని కుందులి ప్రాంతానికి వెళ్లి గంజాయిని కొనుగోలు చేసినట్లు, అనంతరం దానిని హైదరాబాద్‌కు తరలించి విక్రయిస్తున్నట్లు వెల్లడించినట్టు పోలీసులు తెలిపారు. గంజాయిని ఎవరెవరికి విక్రయిస్తున్నారు, ఈ అక్రమ రవాణా వెనుక మరెవరైనా ఉన్నారా అనే కోణంలోనూ పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.స్వాధీనం చేసుకున్న గంజాయి నమూనాలను పరీక్షల నిమిత్తం ఫోరెన్సిక్ ప్రయోగశాలకు పంపుతున్నట్లు పోలీసులు తెలిపారు. మాదకద్రవ్యాల నియంత్రణ చట్టంలోని సంబంధిత సెక్షన్ల కింద కేసు నమోదు చేసి ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్లు వెల్లడించారు.

## శ్రీనివాస్ నగర్‌లో భారీ కొండచిలువ కలకలం



**పాల్వంచ విశాల భారతి, సెప్టెంబర్ 30:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ పట్టణంలోని శ్రీనివాస్ నగర్ కాలనీ గుట్ట సమీపంలో సుమారు 12 అడుగుల పొడవైన భారీ కొండచిలువ ప్రత్యక్షం కావడంతో స్థానికంగా కలకలం రేగింది. కాలనీ సమీపంలో కొండచిలువ కనిపించడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. సమాచారం అందుకున్న అటవీశాఖ అధికారులు వెంటనే కొత్తగూడెం స్నేక్ రెస్క్యూ టీమ్‌కు సమాచారం అందించారు. స్పందించిన రెస్క్యూ బృందం సంఘటనా స్థలానికి చేరుకుని చాకచక్యంగా కొండచిలువను పట్టుకుంది. కొండచిలువను చూసేందుకు స్థానికులు పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకున్నారు. రెస్క్యూ అనంతరం కొండచిలువను అటవీ ప్రాంతంలో సురక్షితంగా వదిలివేస్తామని అటవీశాఖ అధికారులు తెలిపారు. కొండచిలువను సురక్షితంగా పట్టుకోవడంతో శ్రీనివాస్ నగర్ కాలనీవాసులు ఊపిరి పీల్చుకున్నారు. ఈ ఘటనతో కొద్దిసేపు కాలనీ పరిసరాల్లో సందడి నెలకొంది.

# సేవలకు సెల్యూట్.. పదవీ విరమణకు ఘన వీడ్కోలు



- సైబరాబాద్‌లో నలుగురు పోలీసు అధికారులకు సన్మానం
- ముత్యంరెడ్డికి ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్ అవార్డు

సైబరాబాద్,విశాల భారతి

పోలీసు శాఖలో సుదీర్ఘకాలం సేవలందించి పదవీ విరమణ పొందిన నలుగురు పోలీసు అధికారులకు సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ ఘనంగా వీడ్కోలు పలికింది. గచ్చిబౌలిలోని సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయ ఆడిటోరియంలో బుధవారం జరిగిన కార్యక్రమానికి పోలీస్ కమిషనర్ డా. ఎం. రమేష్ అధ్యక్షత వహించారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. పదవీ విరమణ పొందిన అధికారులు తమ సుదీర్ఘ సేవా కాలంలో ప్రజలకు, పోలీసు శాఖకు అందించిన సేవలను కొనియాడారు. శాంతిభద్రతల పరిరక్షణ, ప్రజాసేవ, నేర నియంత్రణతోపాటు శాఖ అభివృద్ధికి వారు చేసిన కృషి ప్రశంసనీయమన్నారు. పదవీ విరమణ అనంతరం కుటుంబ సభ్యులతో సంతోషంగా, ఆరోగ్యంగా జీవించాలని ఆకాంక్షించారు. పోలీసు సేవలో సంపాదించిన అనుభవాన్ని సమాజ శ్రేయస్సు కోసం వినియోగించాలని సూచించారు. క్రైమ్స్ అండ్ ఈఓడబ్ల్యూ డీసీపీగా పనిచేసిన ఎ. ముత్యంరెడ్డి, స్పెషల్ బ్రాంచ్ ఎస్ఐ ఎ. దామోదర్, మాదాపూర్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ పి. బాలరాజ్, కార్ హెడ్‌క్వార్టర్స్ ఏఆర్ఎస్ఐ పి. ఆంజనేయులు పదవీ విరమణ పొందారు.కాగా, ఎ. ముత్యంరెడ్డికి ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్ తరఫున అవార్డు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా పలువురు పోలీసు అధికారులు ఆయనను అభినందించారు. కార్యక్రమంలో డీసీపీలు టి. అన్నపూర్ణ, ఎన్. కోటిరెడ్డి, రితిరాజ్, వై.వి.ఎస్. సుధీంద్ర, సృజన కర్ణం, కె. పుష్ప, ఏడీసీపీ షమీర్, సీఏఓ వెంకట్ రెడ్డి, ఏఓ వై.వి.ఎస్. జ్యోతిర్మణి, ఎస్టేట్ ఆఫీసర్ ఆర్ఐ హిమాకర్, కోఆపరేటివ్ సొసైటీ ఇన్‌చార్జి ఎస్ఐ జి. మల్లేశం తదితరులు పాల్గొన్నారు. ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది, పదవీ విరమణ పొందిన అధికారుల కుటుంబ సభ్యులు పాల్గొని వారికి శుభాకాంక్షలు తెలిపారు.

## తూప్రాన్‌లో ఉచిత సంతాన సాఫల్య వైద్య శిబిరం

**విశాల భారతి, తూప్రాన్;** సంతాన సమస్యలతో బాధపడుతున్న దంపతులకు అవగాహన కల్పించడంతో పాటు ఆధునిక వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావాలనే ఉద్దేశంతో తూప్రాన్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం ఉచిత సంతాన సాఫల్య వైద్య శిబిరాన్ని నిర్వహించారు. సుష్మ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో హెగ్డే ఫెర్టిలిటీ సహకారంతో వివేకానంద నగర్ కాలనీ, హైస్కూల్ ఎదురుగా ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. శిబిరాన్ని లయన్స్ క్లబ్ వారు ప్రారంభించారు.శిబిరంలో మొదటి స్కాన్, మొదటి వైద్య సంప్రదింపు, ఏఎమ్ హెచ్ పరీక్ష వంటి సేవలను అందించడంతో పాటు కొత్తగా వచ్చే రోగులకు అది (ఇంట్రాయూటెరైన్ ఇన్సెమినేషన్) ప్రొసీజర్ తదితర సేవలపై సమాచారం అందించారు. ఈ సందర్భంగా సుష్మ హాస్పిటల్స్ ఆధ్వర్యంలోని డాక్టర్ ప్రదీప్ సింహా, సుష్మాదేవి, తేజశ్రీ వైద్యులు మాట్లాడుతూ సంతాన సమస్యలకు ఆధునిక వైద్య విధానాల ద్వారా చికిత్స అందుబాటులో ఉందని తెలిపారు.

## చెరువులో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

**రాజేంద్రనగర్, విశాల భారతి :** రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం మదన్‌పల్లి పాత తండా పరిధిలోని నక్కలకుంట చెరువులో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన ఘటనపై శంషాబాద్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సెప్టెంబర్ 30న ఉదయం సుమారు 8 గంటల సమయంలో నక్కలకుంట చెరువులో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందినట్లు సమాచారం అందింది. దీంతో మదన్‌పల్లి పాత తండాకు చెందిన ముదావత్ నరేష్ సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించగా, సుమారు 30 నుంచి 35 సంవత్సరాల వయస్సు గల వ్యక్తి నీటిలో మృతిచెంది కనిపించాడు. అనంతరం నరేష్‌తో పాటు స్థానికులు కలిసి మృతదేహాన్ని చెరువులో నుంచి బయటకు తీశారు. మృతుడు నలుపు రంగు లోదుస్తులు, ఎరుపు రంగు మొలతాడు ధరించి ఉన్నట్లు, కుడి చేతిపై పచ్చబొట్టు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. చెరువు సమీపంలో నీలం రంగు నైట్‌ప్యాంట్, బూడిద రంగు పూర్తి చేతుల చొక్కా, ఎరుపు రంగు చెప్పులు లభించాయి. చుట్టుపక్కల గ్రామస్థులను విచారించగా, మృతుడు పరిసర ప్రాంతాల్లో తిరుగుతూ స్క్రాప్ సామగ్రిని సేకరించి విక్రయిస్తూ కనిపించేవాడని వారు తెలిపినట్లు పోలీసులు పేర్కొన్నారు. ఇటీవల అదే చెరువులో వినాయక నిమజ్జనం జరిగినట్లు కూడా పోలీసుల దృష్టికి వచ్చింది. స్క్రాప్ సేకరించే క్రమంలో చెరువులోకి దిగి ఈత రాక ప్రమాదవశాత్తు నీటిలో మునిగి మృతి చెంది ఉండవచ్చని ఫిర్యాదుదారుడు అనుమానం వ్యక్తం చేశాడు. అయితే మృతికి ఖచ్చితమైన కారణాలు తెలియాల్సి ఉందని పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై ముదావత్ నరేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు శంషాబాద్ పోలీసులు అసహజ మరణం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతుడి ఆచూకీ, వివరాలను గుర్తించేందుకు పోలీసులు చర్యలు చేపడుతున్నారు.

# ఆదేశాలు జారీ చేసి 60 రోజులు దాటినా అమలు ఎప్పుడు..?

**ఆదేశాలు కాగితాలకే పరిమితం.. రైతు రహదారికి మోక్షమెప్పుడు?**
**తహసీల్దార్ ఆదేశాలకే దిక్కులేదు.. రైతు సమస్యకు పరిష్కారం ఎప్పుడు?**
**ఆదేశాలు ఇచ్చారు.. ఏటీఆర్ అడిగారు.. అమలు మాత్రం గాలికొదిలారా?**
**7 రోజుల్లో చర్యలు తీసుకోవాలని మెమో ఇచ్చినా పురోగతి శూన్యం**
**రెవెన్యూ, పంచాయతీ, ఇరిగేషన్ శాఖలపై రైతు ఉపేందర్ వీరిశెట్టి ఆగ్రహం**

కురవి విశాల భారతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్

సీరోలు మండలం చింతపల్లి రెవెన్యూ గ్రామ పరిధిలో రైతుల వ్యవసాయ భూములకు వెళ్లేందుకు దశాబ్దాలుగా వినియోగంలో ఉన్న పాత వ్యవసాయ రహదారి, ఇరిగేషన్ బండ్ కాలువ పునరుద్ధరణకు తహసీల్దార్ కార్యాలయం ఆదేశాలు జారీ చేసినప్పటికీ, వాటి అమలులో జాప్యం కొనసాగుతుండటంపై రైతు ఉపేందర్ వీరిశెట్టి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. 27072026న ఆర్. సి. నెం. బి./365/2026 ద్వారా సీరోల్ తహసీల్దార్ కార్యాలయం ఇండియన్ ఏఅసెమెంట్స్ యాక్ట్, 1882 కింద పాత వ్యవసాయ రహదారి, ఇరిగేషన్ బండ్ కాలువ పునరుద్ధరణకు ఆదేశాలు జారీ చేసిందని ఆయన తెలిపారు. అయితే ఆదేశాలు జారీ చేసి 60 రోజులకు పైగా గడిచినా క్షేత్రస్థాయిలో ఎలాంటి స్పష్టమైన చర్యలు కనిపించడం లేదని పేర్కొన్నారు.

**7 రోజుల్లో ఎటిఆర్ ఇవ్వాలని మరో మెమో.**

సమస్య పరిష్కారం కోసం 18092026న తహసీల్దార్ కార్యాలయం మరో మెమో జారీ చేసి, రెవెన్యూ, పంచాయతీ, ఇరిగేషన్ శాఖల అధికారులు సంయుక్తంగా స్థల పరిశీలన చేసి ఆదేశాలను అమలు చేయడంతో పాటు 7 రోజుల్లో యాక్షన్ టేకెన్ రిపోర్ట్ (ఎటిఆర్) సమర్పించాలని ఆదేశించినట్లు ఉపేందర్ వీరిశెట్టి తెలిపారు. అయితే ఆ గడువు కూడా పూర్తయినప్పటికీ ఇప్పటి వరకు రహదారి పునరుద్ధరణ/విస్తరణపై స్పష్టమైన పురోగతి లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

**"ఆర్డర్ ఇచ్చారు.. అమలు ఎప్పుడు?"**

అధికారులు ఆదేశాలు జారీ చేసిన తర్వాత వాటి అమలు కోసం రైతులు మళ్లీ మళ్లీ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఎందుకు రావాలని ఉపేందర్ వీరిశెట్టి ప్రశ్నించారు. "27 జులై ఆర్డర్, 18 సెప్టెంబర్ మెమో, 7 రోజుల గడువు ఉన్నప్పటికీ అమలు ఎక్కడ? ఆర్డర్ జారీ చేయడం పరిపాలనా ప్రక్రియలో మొదటి అడుగు మాత్రమే. అది క్షేత్రస్థాయిలో అమలైనప్పుడే రైతుకు వాస్తవ ప్రయోజనం కలుగుతుంది" అని ఆయన అన్నారు.



GOVERNMENT OF TELANGANA
OFFICE OF THE TAHSILDAR :: SEEROLE MANDAL

Rc.No. B/365/2026 Date:18-9-2026.

MEMO

Sub:- PATH WAY - Mahabubabad District – Seerole Mandal – Chinthapalli Village – A/o Sri Upender Veerishetty S/o Venkataiah, R/o Kothur (C) – Request for immediate implementation of the orders issued by Tahsildar, Seerole Mandal vide Rc.No.B/365/2026, Dtd:27.7.2026 and restoration of the old agricultural access road irrigation bund canal to ensure free access to his agricultural lands - Visit the site and see that not to obstruct by any one for use said path way – Compliance report called - Reg.

Ref:- A/o Sri Upender Veerishetty S/o Venkataiah, R/o Kothur (C) Dtd:15.9.2026.

-o0o-

Attention to the subject and reference cited and to inform you that Sri Upender Veerishetty S/o Venkataiah, R/o Kothur (C) submitted an applications stated that an old agricultural access road and irrigation bund canal leading to the agricultural lands situated in Sy.No.41 and Sy.No.43 to 433 of Chinthapalli Revenue Village and the Tahsildar, Seerole Vide Rc.No.B/365/2026 dated: 27.7.2026 issued orders under Easement Act, 1882 on pathway situated in the above Sy.Nos. lands and also requested to effectively implemented the said orders on the ground level stated as below:

1. The Orders issued under the Indian Easements Act, 1892 vide Rc.No.B/365/2026 dtd:27.7.2026, may kindly be implemented immediately and in full.
2. The concerned Revenue Inspector and Revenue authorities, along with Gram Panchayath authorities may kindly conducted field inspection and take necessary steps to physically restore the old agricultural access road and irrigation bund canal as directed in the said orders.
3. If any person creates obstruction to the implementation of the orders, necessary police assistance/security may kindly be obtained from the Seerole Police Station, and appropriate action may be taken under the applicable laws.
4. If any action has already been taken for implementation of the orders, the details and present status of implementation may kindly be communicated to him in writing.
5. If there has been any negligence or failure in the discharge of official duties by the concerned officials in implementing the orders, their responsibility may kindly be fixed and appropriate departmental action may be initiated.
6. Any person obstructing the use of the agricultural access road in violation of the Tahsildar's orders may kindly be proceeded against by initiating applicable criminal and civil action, as mentioned in the said orders.
7. The entire process may kindly be supervised and the restoration of the old agricultural access road and irrigation bund canal may be completed within a stipulated time.
8. A written Action Taken Report (ATR) may kindly be provided to him regarding the action taken on this representation.

....Contd Pg...2....

**ఎటిఆర్ ను బహిర్గతం చేయాలి :**

తక్షణమే రెవెన్యూ, పంచాయతీ, ఇరిగేషన్ శాఖల అధికారులు సంయుక్తంగా స్థల పరిశీలన నిర్వహించి తహసీల్దార్ ఆదేశాలను అమలు చేయాలని, చేపట్టిన చర్యలపై ఎటిఆర్ ను బహిర్గతం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. జాప్యానికి గల కారణాలను అధికారిక రికార్డులో నమోదు చేసి, రహదారి పునరుద్ధరణ/విస్తరణకు నిర్దిష్ట తేదీని ప్రకటించాలని కోరారు. "ఆర్డర్ పాస్సేడ్‌అనేది కాగితంపై ఉన్న నిర్ణయం మాత్రమే.. ఆర్డర్ ఇంప్లీమెంటెడ్ అయినప్పుడే రైతుకు న్యాయం జరిగినట్లు" అని ఉపేందర్ వీరిశెట్టి పేర్కొన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని కోరారు.

# వ్యాధులు విరుచుకుపడకముందే మేల్కొనాలి

- మలేరియా.. డెంగ్యూ.. చికున్‌గున్యాపై ముందస్తు నిఘా
- పీహెచ్‌సీలో సాధారణ ప్రసవాలకు ప్రాధాన్యం
- మందులు, వ్యాక్సిన్లు అందుబాటులో ఉండాలి
- విద్యార్థుల హాజరుపై నిర్లక్ష్యం వద్దు
- వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యం
- నెల్లికుదురులో పీహెచ్‌సీ, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కలెక్టర్ స్నేహ శబరిష్ ఆకస్మిక తనిఖీలు





**మహబూబాబాద్ జిల్లా విశాల భారతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్;** సీజనల్ వ్యాధులు విజృంభించిన తర్వాత స్పందించడం కాకుండా వ్యాధులు ప్రబలకముందే ముందస్తు చర్యలతో అడ్డుకట్ట వేయాలని మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ వైద్యాధికారులను ఆదేశించారు. మలేరియా, డెంగ్యూ, చికున్‌గున్యా వంటి సీజనల్ వ్యాధులపై నిరంతర నిఘా ఉంచాలని, ప్రజలకు వైద్య సేవల్లో ఎలాంటి జాప్యం లేకుండా సిబ్బంది అందుబాటులో ఉండాలని స్పష్టం చేశారు. బుధవారం నెల్లికుదురు మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ప్రభుత్వ జూనియర్ కళాశాలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు.

**వైద్య సేవల్లో జాప్యానికి తావులేదు.**

మండల ప్రజలకు వేగవంతమైన, మెరుగైన వైద్య సేవలు అందేలా వైద్య సిబ్బంది నిరంతరం అందుబాటులో ఉండాలని కలెక్టర్ సూచించారు. షెడ్యూల్ ప్రకారం వైద్య శిబిరాలు నిర్వహించి గ్రామీణ ప్రాంత ప్రజలకు వైద్య సేవలను మరింత చేరువ చేయాలని ఆదేశించారు. సీజనల్ వ్యాధుల నియంత్రణకు ముందస్తు చర్యలను పకడ్బందీగా అమలు చేయాలని స్పష్టం చేశారు.

**సాధారణ ప్రసవాలపై ప్రత్యేక దృష్టి.**

పీహెచ్‌సీలో సాధారణ ప్రసవాలను మరింతగా ప్రోత్సహించాలని కలెక్టర్ సూచించారు. గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు టీకాలు నిర్ణీత షెడ్యూల్ ప్రకారం తప్పనిసరిగా అందించాలని ఆదేశించారు. మాతా, శిశు మరణాలను అరికట్టేందుకు నిరంతర పర్యవేక్షణ ఉండాలని స్పష్టం చేశారు.

**రిజిస్టర్ల పరిశీలన.. సిబ్బంది హాజరుపై ఆరా.**

పీహెచ్‌సీలో ఇన్‌పేషెంట్, ఔట్‌పేషెంట్ రిజిస్టర్లతో పాటు మెడిసిన్ రిజిస్టర్లు, సిబ్బంది హాజరు రిజిస్టర్లను కలెక్టర్ పరిశీలించారు. సబ్‌సెంటర్ల వారీగా అవసరమైన మందులను ముందుగానే సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో రోగులకు మందుల కొరత రాకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

**వ్యాధుల నివారణకు కట్టుదిట్టమైన చర్యలు.**

పిల్లలకు వ్యాక్సిన్లు నిర్ణీత షెడ్యూల్ ప్రకారం అందుతున్నాయా లేదా పరిశీలించాలని సూచించారు. బోదకాలు, గర్భాశయ క్యాన్సర్ వంటి వ్యాధుల నివారణకు అవగాహనతో పాటు అవసరమైన వైద్య చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పీహెచ్‌సీలో ప్రజలకు అవసరమైన వసతులు, సౌకర్యాలు అందుబాటులో ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

**వంట సిబ్బందికి వైద్య పరీక్షలు తప్పనిసరి.**

విద్యాసంస్థల్లో విద్యార్థులకు వంట చేసే సిబ్బందికి కచ్చితంగా వైద్య పరీక్షలు నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. పరీక్షల అనంతరం నివేదికలను సంబంధిత అధికారులకు సమర్పించాలని సూచించారు. విద్యార్థుల ఆరోగ్య భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావివ్వకూడదని స్పష్టం చేశారు.

**విద్యార్థులతో కలెక్టర్ ముఖాముఖి.**

అనంతరం ప్రభుత్వ జూనియర్ కళాశాలను సందర్శించిన కలెక్టర్ ప్రతి తరగతి గదిని పరిశీలించారు. విద్యార్థులతో నేరుగా మాట్లాడి వారి చదువు, భవిష్యత్ లక్ష్యాలు, కార్యాచరణ ప్రణాళిక గురించి తెలుసుకున్నారు. విద్యార్థులు క్రమం తప్పకుండా కళాశాలకు హాజరవుతూ ప్రతి సబ్జెక్టుపై పట్టు సాధించాలని సూచించారు.

**ఇంటర్ నుంచే భవిష్యత్తుకు పునాది.**

ఇంటర్మీడియట్ విద్య విద్యార్థుల భవిష్యత్తును నిర్దేశించే కీలక దశ అని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ దశ నుంచే తమ లక్ష్యాలను నిర్దేశించుకుని వాటి సాధనకు ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలని సూచించారు. పట్టుదలతో విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు.

**వంద శాతం ఫలితాలే లక్ష్యం.**

విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు శాతం పూర్తిస్థాయిలో నమోదయ్యేలా ప్రిన్సిపల్ చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఇంగ్లీషుతో పాటు అన్ని సబ్జెక్టులపై ప్రత్యేక తరగతులు నిర్వహించాలని సూచించారు. విద్యార్థుల సామర్థ్యాన్ని పెంచి వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా బోధన సాగించాలని స్పష్టం చేశారు. ఈ తనిఖీల్లో జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి మదర్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రవి రాథోడ్, నెల్లికుదురు తహసీల్దార్ నరేష్, కళాశాల ప్రిన్సిపల్ వీరస్వామి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి, ఇతర అధికారులు పాల్గొన్నారు.



## రైల్వే స్టేషన్ మాస్టర్ కనకరాజు కుటుంబానికి సత్యవతి రాథోడ్ పరామర్శ

- లక్ష్మి మృతికి నివాళులు.. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి.

**డోర్నకల్ విశాల భారతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్;** మహబూబాబాద్ రైల్వే స్టేషన్ మాస్టర్ కనకరాజు మాతృమూర్తి రాచబంటి లక్ష్మి ఇటీవల మృతి చెందడంతో మాజీ మంత్రి శ్రీమతి సత్యవతి రాథోడ్ బుధవారం డోర్నకల్‌లోని వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా రాచబంటి లక్ష్మి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కనకరాజు కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. లక్ష్మి మృతి కుటుంబానికి తీరని లోటని పేర్కొంటూ, ఈ విషాద సమయంలో కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని సత్యవతి రాథోడ్ సూచించారు. కుటుంబ సభ్యులతో కొద్దిసేపు మాట్లాడి వారి పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. మృతురాలి ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కోదాడ మాజీ శాసనసభ్యులు బొల్లం మల్లయ్య యాదవ్, మన్యు ప్యాట్నీ, మోహన్, యశోద జైన్, సచిన్, ఐలి నరహరి గౌడ్, బోడ శ్రీను నాయక్, కౌసల్య దేవిపల్లి సర్పంచ్ ఎడ్ల శ్రీనివాసరెడ్డి, ఐక్యరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## తోటి గ్రామ పంచాయతీ సిబ్బంది కుటుంబానికి అండగా నిలిచిన యూనియన్ సభ్యులు



**దేవరుప్పుల విశాల భారతి ;** మండలం ధర్మాపురం గ్రామ పంచాయతీ సిబ్బంది దండు సోమయ్య గత వారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న దేవరుప్పుల మండల సీఐటీయూ గ్రామపంచాయతీ యూనియన్ సభ్యులు సోమవారం ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. సోమయ్య చిత్రపటానికి పూలు వేసి నివాళులర్పించి, కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. అనంతరం యూనియన్ తరపున రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు సంగీ కర్ణాకర్, జనగామ జిల్లా సీఐటీయూ ప్రధాన కార్యదర్శి బస్వ రామచందర్, జిల్లా కోశాధికారి బత్తిని వెంకన్న, మండల ప్రధాన కార్యదర్శి వెంకట్ రెడ్డి, ప్రతాప్, ఎడెల్లి సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

## రోశయ్య కుటుంబాన్ని పరామర్శించిన మాజీ మంత్రి సత్యవతి రాథోడ్



**కురవి విశాల భారతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్;** డోర్నకల్ నియోజకవర్గం కురవి మండల కేంద్రానికి చెందిన ప్రముఖ రిపోర్టర్ గంధమల్ల రోశయ్య కుమార్తె ఇటీవల మృతి చెందడంతో మాజీ మంత్రి శ్రీమతి సత్యవతి రాథోడ్ బుధవారం రోశయ్య నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతురాలి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి, ఈ విషాద సమయంలో కుటుంబానికి అండగా ఉంటామని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో కురవి మండల బీఆర్ఎస్ నాయకులు ఐలి నరహరి గౌడ్, నూతక్కి సాంబశివరావు, బొడ శ్రీను నాయక్, గుగులోత్ నెహ్రూ నాయక్, కౌసల్యాదేవిపల్లి సర్పంచ్ ఎడ్ల శ్రీనివాస్ రెడ్డి, కురవి మాజీ ఉపసర్పంచ్ సంగెమ్ భరత్, మన్యు ప్యాట్నీ, ప్రముఖ జర్నలిస్టులు ఆమెడ శ్రీధర్, భర్తపురపు వీరన్న, బేతమళ్ళ సహదేవ్ తదితరులు పాల్గొన్నారు.

## అనబత్తుల ఐలయ్యకు ఘన నివాళులు

- కుటుంబ సభ్యులను పరామర్శించిన గొల్లపల్లి రజనీకాంత్



**కురవి విశాల భారతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్;** మొదలగూడెం గ్రామపంచాయతీ కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు అనబత్తుల ఉపేందర్ తండ్రి అనబత్తుల ఐలయ్య మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు గొల్లపల్లి రజనీకాంత్ ఐలయ్య పార్థివదేహానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం అనబత్తుల ఉపేందర్‌తో పాటు కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ విషాద సమయంలో కుటుంబానికి అండగా ఉంటామని రజనీకాంత్ పేర్కొన్నారు. ఐలయ్య మృతి ఆ కుటుంబానికి తీరని లోటని, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు మనోధైర్యం ప్రసాదించాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో మొదలగూడెం గ్రామపంచాయతీ సర్పంచ్, అయ్యగారిపల్లి సర్పంచ్ మాధవి నాగన్న, పిల్లిగుండ్ల తండా సర్పంచ్ బానోత్ రమేష్ తదితరులు పాల్గొని కుటుంబ సభ్యులను పరామర్శించారు.

## బాధిత కుటుంబాలను పరామర్శించి ఆర్థిక సాయం అందజేసిన ఝాన్సీరెడ్డి



**దేవరుప్పుల విశాల భారతి;** మండలంలోని పలు గ్రామాల్లో ఇటీవల మృతి చెందిన వారి కుటుంబాలను టీపీసీసీ ఉపాధ్యక్షురాలు హనుమాండ్ల ఝాన్సీరెడ్డి పరామర్శించారు. మృతుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబాలకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని, ఎల్లప్పుడూ వారికి అండగా నిలుస్తామని ధైర్యం చెప్పారు.అదేవిధంగా దేవరుప్పుల గ్రామానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు రెడ్డిరాజుల రమేష్ అనారోగ్యంతో హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొంది ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటుండగా ఆయనను ఝాన్సీరెడ్డి పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు దావెర అనిల్ కుమార్, జిల్లా నాయకులు కాసారపు ధర్మారెడ్డి, తోటకూరి పాండుకృష్ణ, ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఇనుముల నాగరాజు, ఎస్టీ సెల్ అధ్యక్షుడు భూక్యా సజ్జన్, నియోజకవర్గ యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు ఉప్పుల ప్రకాష్, గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు తోటకూరి రమేష్, ఎన్ఎస్‌యూఐ మండల అధ్యక్షుడు కొంగరి ఉమేష్, మండల నాయకులు మోటికే చంద్రశేఖర్, బోనగిరి యాకస్వామి, జక్కుల గంగరాజు, ఓడపెల్లి రవి, రాంచంద్రు నాయక్, సుధాకర్, విద్యాసాగర్, దౌపాటి రవి, నర్సయ్యతో పాటు ఆయా గ్రామాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, యువజన నాయకులు, ప్రజాప్రతినిధులు, అనుబంధ సంఘాల నాయకులు, మహిళా కాంగ్రెస్ నాయకులు, సోషల్ మీడియా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వేలంలో అందుకున్న లడ్డూను కాలనీవాసులకు పంపిణీ చేసిన సందగల్ల విజయ సతీష్ గౌడ్



**చౌటుప్పల్,విశాల భారతి:** వినాయక నవరాత్రి ఉత్సవాల సందర్భంగా వేలం పాటలో అందుకున్న లడ్డూను కాలనీవాసులకు పంపిణీ చేసి కోఆప్షన్ సభ్యులు సంతగల విజయ సతీష్ గౌడ్ ఔదార్యాన్ని చాటుకున్నారు. గణేష్ మండపాల వద్ద వేలం వేసిన లడ్డూను దక్కించుకున్న ఆయన దానిని ప్రసాదంగా భావించి కాలనీలోని ప్రతి ఇంటికి అందజేశారు. భక్తి, ఐక్యతకు ప్రతీకగా ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గణనాథుడి ఆశీస్సులు అందరిపై ఉండాలని, ఇలాంటి కార్యక్రమాలు కాలనీవాసుల్లో స్నేహభావాన్ని పెంపొందిస్తాయని అన్నారు. కార్యక్రమంలో శ్రీరామ్ యువసేన యూత్ సభ్యులు,కాలనీవాసులు, భక్తులు, చిన్నారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## చౌటుప్పల్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

**చౌటుప్పల్,విశాల భారతి:** చౌటుప్పల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మల్కాపురం ఆర్టీఓ కార్యాలయం పక్కన ఉన్న గుట్ట ప్రాంతంలో గుర్తు తెలియని పురుషుడి మృతదేహం లభ్యమైంది. మృతుడి వయసు సుమారు 50 నుండి 60 సంవత్సరాల మధ్య ఉంటుందని, మృతదేహం పూర్తిగా కుళ్లిపోయిన స్థితిలో ఉన్నట్లు పోలీసులు ప్రాథమికంగా గుర్తించారు. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించగా సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. మృతుడి వివరాలు, మృతికి గల కారణాలపై దర్యాప్తు ప్రారంభించారు. మృతుడి ఆచూకీ లేదా వివరాలు తెలిసిన వారు చౌటుప్పల్ పోలీసులను సంప్రదించాలని ఇన్స్పెక్టర్ జి. మన్మథ కుమార్ కోరారు.

## ఘనంగా కామ్రేడ్ యామిని పుల్లయ్య 4వ వర్ధంతి



**మరిపెడ, విశాల భారతి:** మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం గుండెపుడి గ్రామంలో కమ్యూనిస్టు నాయకుడు కామ్రేడ్ యామిని పుల్లయ్య నాలుగో వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. పుల్లయ్య స్థూపం వద్ద ఎస్‌కే షరీఫ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి సీపీఐ(ఎం) మండల కార్యదర్శి గుండగాని మధుసూదన్ ముఖ్యఅతిథిగా హాజరై నివాళులర్పించారు.ఈ సందర్భంగా మధుసూదన్ మాట్లాడుతూ.. పుల్లయ్య మరణించి నాలుగేళ్లు గడిచినా పార్టీ, ప్రజా ఉద్యమాల్లో ఆయన చేసిన సేవలు స్ఫూర్తినిస్తున్నాయని అన్నారు. రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యుడిగా, గుండెపుడి పార్టీ శాఖ కార్యదర్శిగా ఆయన అనేక పోరాటాల్లో పాల్గొన్నారని తెలిపారు. రైతులకు కనీస మద్దతు ధర కల్పించాలని, పెరిగిన ఎరువులు, పురుగు మందుల ధరలను తగ్గించాలని పలు ఉద్యమాలు చేపట్టారని గుర్తుచేశారు.పుల్లయ్య స్ఫూర్తితో విద్యార్థులు, యువత సమాజం కోసం పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో శాఖ కార్యదర్శి ఎస్‌కే షరీఫ్, రైతు సంఘం మండల ఉపాధ్యక్షులు అల్లి శ్రీనివాస్‌రెడ్డి, గొర్రెల మేకల సంఘం గ్రామ బాధ్యులు బింగి మహేష్, మారబోయిన లింగయ్య, గుండగాని వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## గుడుంబాపై పోలీసుల దాడి

- 500 లీటర్ల బెల్లంపానకం ధ్వంసం: ఎస్సై సతీష్



**మరిపెడ విశాల భారతి:** గుడుంబా తయారీ, విక్రయాలపై మరిపెడ పోలీసులు చర్యలు చేపట్టారు. బుధవారం రేఖ్యతండా గ్రామంలో పోలీసుల ఆధ్వర్యంలో గుడుంబా స్థావరాలపై దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు 500 లీటర్ల బెల్లంపానకాన్ని ధ్వంసం చేశారు. అలాగే 20 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నారు. నాటుసారా తయారీకి పాల్పడుతున్న నలుగురిపై కేసులు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. గుడుంబా, నాటుసారా తయారీ, విక్రయాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.

## చిన్నారి మృతికి జర్నలిస్టుల పరామర్శ

**కురవి విశాల భారతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్;** అనారోగ్యంతో చిన్నారి మృతి చెందడంతో జర్నలిస్ట్ గండమాల రోశయ్య కుటుంబాన్ని తెలంగాణ రాష్ట్ర మాల జర్నలిస్టుల అసోసియేషన్ రాష్ట్ర నాయకులు చందా శ్రీనివాస్, బొడ్డు అశోక్ పరామర్శించారు. కురవి మండలానికి చెందిన జర్నలిస్ట్ గండమాల రోశయ్య కుమార్తె అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలుసుకున్న వారు బుధవారం రోశయ్య నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను కలిసి పరామర్శించారు. చిన్నారి మృతిపై తీవ్ర విచారం వ్యక్తం చేస్తూ, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ విషాద సమయంలో కుటుంబ సభ్యులకు మనోధైర్యం కలగాలని ఆకాంక్షించారు. ఈ పరామర్శ కార్యక్రమంలో సోషల్ మీడియా సీనియర్ జర్నలిస్ట్ దడిగెల రవి, తెలంగాణ రాష్ట్ర మాల జర్నలిస్టుల అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు బేతమళ్ళ సహదేవ్, జర్నలిస్టులు గండమాల రామకృష్ణ, దుంద్ర నిర్మల తదితరులు పాల్గొన్నారు.

## సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌ను బర్తరఫ్ చేయాలి




- ఎస్ఐఆర్ ప్రక్రియను వెంటనే నిలిపివేయాలి
- ప్రజాస్వామ్య పరిరక్షణకు సీపీఐ శ్రేణుల డిమాండ్
- మరిపెడలో గాంధీ విగ్రహం వద్ద నిరసన

**మరిపెడ విశాల భారతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్**

ప్రజాస్వామ్య వ్యవస్థను కాపాడేందుకు వివాదాస్పదంగా మారిన ఎస్ఐఆర్ ప్రక్రియను వెంటనే నిలిపివేయాలని, కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్‌ను పదవి నుంచి బర్తరఫ్ చేయాలని సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు నల్లు సుధాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. మరిపెడ మండల కేంద్రంలోని గాంధీ విగ్రహం వద్ద సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌ను బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఐ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నల్లు సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల సంఘంలోని మెజారిటీ సభ్యుల నిర్ణయాలను పక్కనబెట్టి ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటున్నారంటూ సీఈసీపై ఆరోపణలు చేశారు. ఎస్ఐఆర్ ప్రక్రియను ప్రతిపక్షాలను బలహీనపరిచేందుకు ఉపయోగిస్తున్నారని ఆయన విమర్శించారు. వివిధ నిబంధనలు, ప్రక్రియల పేరుతో లక్షలాది మంది ఓటర్ల పేర్లు గల్లంతయ్యే పరిస్థితి ఏర్పడిందని ఆరోపించారు. దీనివల్ల ఆయా రాష్ట్రాల్లో ప్రతిపక్ష పార్టీలు ఎన్నికల్లో నష్టపోయే పరిస్థితులు ఏర్పడుతున్నాయని అన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి అనుకూలంగా ఎన్నికల సంఘం వ్యవహరిస్తోందని నల్లు సుధాకర్‌రెడ్డి ఆరోపించారు. కోట్లాది మంది ప్రజల్లో అభద్రతాభావం, ఆందోళనకు కారణమవుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియను తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేశారు.

ఎన్నికల ప్రక్రియలో తొలగించబడ్డారని పేర్కొంటున్న 13 కోట్ల ఓటర్ల పేర్లను వెంటనే పునరుద్ధరించాలని, ఓటు హక్కు విషయంలో ఎలాంటి అన్యాయం జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రజాస్వామ్య హక్కులను పరిరక్షించాల్సిన ఎన్నికల సంఘం ప్రజల విశ్వాసాన్ని కాపాడేలా వ్యవహరించాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి మారగని బాలకృష్ణ, జిల్లా కౌన్సిల్ సభ్యులు పోలేపాక వెంకన్న, అంజి, పి. వెంకన్న, వీరన్న, హనుమంతు, కలగూర నాగరాజు, సత్యం, వీరేందర్ తదితరులు పాల్గొన్నారు.

## జ్యోతిరావు పూలే ఆశయ సాధనకు కృషి చేద్దాం




**సిపిఐ ఎం-ఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి బి భాస్కర్**

**విశాల భారతి, నిజామాబాద్ :** మహాత్మ జ్యోతిరావు పూలే స్థాపించిన సత్యశోధక్ సమాజ్ 153వ వార్షికోత్సవ సందర్భంగా నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని నాగారంలో మహాత్మ జ్యోతిరావు పూలే సావిత్రిబాయి పూలే చిత్రపటాలకు పూలదండ వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి పుట్ట వరదయ్య అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి బి. భాస్కర్ మాట్లాడుతూ సమాజంలో కుల మత దోపిడి అంతరాలు లేని సమ సమాజాన్ని మహాత్మ జ్యోతిరావు పూలే కోరుకున్నాడని ఆ సమాజం కోసం అవిశ్రాంతంగా కృషి చేశాడని గుర్తు చేశారు. నాటి సమాజంలో వేళ్ళానుకొని ఉన్న కుల వ్యవస్థను నిర్మూలించాడని ఆయన తెలిపారు. సమాజంలోని అన్ని కులాల వ్యక్తులు కుల నిర్మూలనకు కృషి చేయాలని ఆశించాడని పేర్కొన్నారు. సత్యశోధక్ సమాజ ద్వారా ధనిక పేద తేడా లేకుండా అందరికీ చదువు నేర్పించాడని మహిళలకు పాఠశాలలు ఏర్పాటు చేసి విద్యావంతులను చేశాడని గుర్తు చేశారు. అనాథ పిల్లలను అక్కున చేర్చుకుని ఉన్నత విద్యావంతులుగా వారిని తీర్చిదిద్దాడని తెలిపారు. బాల్యవివాహాలను వ్యతిరేకించాడని వితంతు పునర్వివాహాలను జరిపించి వారికి ఒక నూతన జీవితాన్ని అందించాడని అన్నారు. సతీసహగమనం వ్యతిరేకంగా ఉద్యమించాడని అన్నారు పూలే తనభార్య సావిత్రిబాయి పూలే కు చదువు నేర్పించి మహిళలందరు ఉన్నత విద్యావంతులవడం ద్వారా సమాజం తొందరగా మారుతుందని ఆశించాడని గుర్తు చేశారు. వారి పోరాట స్ఫూర్తి నేటి తరానికి ఎంతో ఆదర్శమని వారి స్ఫూర్తితో సత్యశోధక్ సమాజ్ ఆశయాలని సాధించడం కోసం సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ కృషి చేస్తుందని భాస్కర్ తెలిపారు.నేటి ప్రభుత్వాలు బడుగు బలహీన వర్గాలకు జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు పెంచాలని డిమాండ్ చేశారు. భూమిలేని నిరుపేదలకు భూములు పంచాలని ప్రభుత్వాలను కోరారు. దోపిడి వ్యవస్థ నిర్మూలన ద్వారానే కుల సమస్యకు పరిష్కారం లభిస్తుందని తెలిపారు. దోపిడి పీడన లేని సమ సమాజం కోసం ప్రజలంతా పోరాడాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి దుద్దు గంగాధర్, ఐ ఎఫ్ టి యు రాష్ట్ర నాయకులు అల్తాఫ్, పిడిఎస్ యూ జిల్లా అధ్యక్షులు సతీష్, ఐ ఎఫ్ టి యు జిల్లా ఉపాధ్యక్షుడు శివరాజు, లక్ష్మణ్ గౌడ్, పిఓడబ్ల్యూ జిల్లా నాయకురాలు పెగ్గర్ల లత తదితరులు పాల్గొన్నారు.

# స్వచ్ఛతా హీ సేవాలో పారిశుధ్య కార్మికులకు ఆరోగ్య పరీక్షలు, ఘన సన్మానం

- పారిశుద్ధ కార్మికుల సేవలు సమాజానికి ఆదర్శనీయం
- మొగుదాల పావని రమేష్ గౌడ్ మున్సిపల్ చైర్మన్



**చౌటుప్పల్, విశాల భారతి:** మున్సిపాలిటీ పరిధిలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా పారిశుధ్య కార్మికులకు ఉచిత ఆరోగ్య పరీక్షల శిబిరాన్ని మున్సిపల్ చైర్ పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా పారిశుధ్య కార్మికులకు పీఎంజేజేబివై, పిఎంయస్బివై వంటి ఇన్సూరెన్స్ పథకాలపై అవగాహన కల్పించారు. పట్టణ పరిశుభ్రతలో కీలక పాత్ర పోషిస్తున్న స్వచ్ఛ ఆటో డ్రైవర్లు, సారథులు, వేస్ట్ పిక్కర్లు, సెప్టిక్ ట్యాంక్ క్లీనర్లకు పిపిఈ కిట్లను అందజేసి శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ మాట్లాడుతూ పట్టణాన్ని స్వచ్ఛంగా, ఆరోగ్యకరంగా ఉంచడంలో పారిశుధ్య కార్మికుల పాత్ర అత్యంత విలువైనదన్నారు. వారి సేవలు సమాజానికి ఆదర్శనీయమని, విధి నిర్వహణలో ఆరోగ్య భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రతి ఒక్కరూ పిపిఈ కిట్లు ధరించి సురక్షితంగా పనిచేయాలని, ప్రభుత్వం అందిస్తున్న ఉచిత ఆరోగ్య పరీక్షలు, బీమా సౌకర్యాలను వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో కమిషనర్ ఎన్. వెంకటేశ్వర నాయక్, కౌన్సిలర్ హను మహమ్మద్, నాయకులు బత్తుల దాసు, దేప రాజు, డాక్టర్ జయంత్ కుమార్, డాక్టర్ సౌజన్య, సిహెచ్ఓ కృష్ణ కుమార్, హెచ్ ఈ సాయి రెడ్డి, మేనేజర్ శ్రీధర్ రెడ్డి, ఆర్ ఓ అంజయ్య, శానిటరీ ఇన్స్పెక్టర్ హనుమాన్ ప్రసాద్, పర్యావరణ ఇంజనీర్ రేణుకుమార్, కార్యాలయ సిబ్బంది, పారిశుధ్య కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# గూడూరు మేజర్ గ్రామపంచాయతీ గ్రామ సభలో అధ్యక్షత వహించిన

- సర్పంచ్ వాంకుడోత్ సునీత కొమ్మల నాయక్



**విశాల భారతి గూడూరు సెప్టెంబర్ 30 ;** ఈ గ్రామ సభలో ముఖ్యంగా గ్రామాభివృద్ధి, ఉపాధి హామీ పథకం అమలు మరియు స్థానిక సమస్యలపై విస్తృతంగా చర్చించారు. గత సంవత్సర కాలంలో గ్రామంలో చేపట్టిన మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (MGNREGS) పనుల వివరాలను, వాటికి సంబంధించిన రికార్డులను సభలో చదివి వినిపించారు. అర్హులైన లబ్ధిదారులకు సంబంధించి చేనేత పెన్షన్ల ధృవీకరణ (వెరిఫికేషన్) ప్రక్రియను విజయవంతంగా నిర్వహించారు. గ్రామంలోని త్రాగునీటి ఎద్దడి, పారిశుధ్య నిర్వహణ మరియు వీధి దీపాల సమస్యలపై సుదీర్ఘంగా చర్చించి, వాటి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు ఈ ప్రజా ప్రాధాన్యత కలిగిన కార్యక్రమంలో పాల్గొన్న గూడూరు మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ వాంకుడోత్ సునీత కొమ్మాలు నాయక్ ఉపసర్పంచ్ చంటి స్వామి. వార్డు మెంబర్లు వాంకుడోత్ శ్రీనివాస్. పద్యం వెంకన్న. చీర బోయిన కుమార్. గార్లపాటి శిరీష. గోనే శిరీష. వాంకుడోత్ మౌనిక. వాంకుడోత్ జ్యోతి. గుగులోత్ వినోద. పంచాయతీ కార్యదర్శి, తిరుమల. డి.ఆర్.పి (DRP), ఫీల్డ్ అసిస్టెంట్, గ్రామ పెద్దలు, పంచాయతీ సిబ్బంది, మీడియా మిత్రులు మరియు పెద్ద సంఖ్యలో గ్రామ ప్రజలు పాల్గొని సభను విజయవంతం చేయడం జరిగింది....

# జిల్లా స్థాయి కబడ్డీకి విద్యార్థిని ఎంపిక



**మోటకొండూర్, విశాల భారతి:** మోటకొండూర్ మండలం మాటూరు ఉన్నత పాఠశాలలో బుధవారం నిర్వహించిన అండర్ 14 బాలికల కబడ్డీ పోటీల్లో జెడ్పీహెచ్ఎస్ కూరెళ్ల పాఠశాలకు చెందిన విద్యార్థిని బోయిని రేష్మ ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైంది. ఈ విషయాన్ని పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయురాలు ఏ. రామానుజమ్మ తెలిపారు. జిల్లా స్థాయికి ఎంపికైన బోయిని రేష్మను పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఏ. వెంకట్ రెడ్డి, ఉపాధ్యాయ బృందం, పలువురు విద్యార్థులు అభినందించారు.

# విద్యుత్ షాక్‌తో గొర్ల కాపరి మృతి

**విశాల భారతి గూడూరు సెప్టెంబర్ 30 ;** గూడూరు మండలంలోని ఊట్ల గ్రామానికి చెందిన చందా ఎల్లమ్మ రోజువారి లాగా గొర్లను బుధవారం రోజున మేతకు తీసుకెళ్లగా ఈ క్రమంలో విద్యుత్ వైర్లు తగిలి ప్రమాదవశాత్తు విద్యుత్ శాఖ గురై మృతి చెందిది

# ఉపాధ్యాయుల ప్రతిభకు మండల స్థాయి పురస్కారాలు





**మోటకొండూర్, విశాల భారతి:** మోటకొండూర్ మండల కేంద్రంలో బుధవారం నిర్వహించిన మండల స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుల సన్మాన కార్యక్రమంలో అమ్మనబోలు ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు పలు పురస్కారాలు అందుకున్నారు. అమ్మనబోలు ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కె. శైలజారాణి మండల ఉత్తమ ప్రధానోపాధ్యాయురాలిగా అవార్డు అందుకున్నారు. అలాగే అమ్మనబోలు ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె. సోమయ్య మండల ఉత్తమ ఎల్ఎఫ్ఎల్ ప్రధానోపాధ్యాయుడిగా పురస్కారం అందుకున్నారు. అదేవిధంగా అమ్మనబోలు ప్రభుత్వ ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయురాలు కె. శ్రీదేవి మండల ఉత్తమ ఉపాధ్యాయురాలిగా అవార్డు అందుకున్నారు. ఇటీవల జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయుడిగా పురస్కారం పొందిన అమ్మనబోలు ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు పి. వెంకటేశ్వర్‌రావును కూడా ఈ సందర్భంగా ఘనంగా సన్మానించారు. అమ్మనబోలు పాఠశాలల ఉపాధ్యాయులు మండల, జిల్లా స్థాయిలో ఉత్తమ పురస్కారాలు అందుకోవడం పట్ల విద్యార్థులు, తల్లిదండ్రులు, గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.

# ఎక్స్టర్నల్ మూల్యాంకన విధానాన్ని ఉపసంహరించుకోవాలి ఎస్సీ ఎస్టీల ఉపాధ్యాయ సంఘం

**విశాల భారతి గూడూరు సెప్టెంబర్ 30;** బుధవారం రోజున గూడూరు మండల కేంద్రంలో ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయ సంఘం మహబూబాబాద్ జిల్లా కమిటీ సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశానికి జిల్లా ఉపాధ్యక్షులు మోకాళ్ళ వెంకన్న అధ్యక్షతన నిర్వహించగా ముఖ్యఅతిథిగా రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చాగంటి ప్రభాకర్ గౌరవ అతిథిగా పార్నంది రామయ్య ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు విచ్చేసి సంయుక్తంగా మాట్లాడుతూ CCE లక్ష్యాలకు విరుద్ధంగా "ఎక్స్టర్నల్ మూల్యాంకనం" విధానాన్ని ప్రవేశపెట్టడం వల్ల రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలో అమలులో ఉన్న నిరంతర సమగ్ర మూల్యాంకనం సిసిఈ ప్రధానోద్దేశం విద్యార్థుల అభ్యాసనం స్థాయిని నిరంతరం పరిశీలిస్తూ వారి లోటు పాట్లను గుర్తించి ఎప్పటికప్పుడు సరిదిద్దడం విద్యార్థిని నిరంతరం గమనించే ఉపాధ్యాయుడికి కాకుండా ఇతర పాఠశాలలో ఉపాధ్యాయులతో జవాబు పత్రాలను మూల్యాంకనం చేయించడం వల్ల ఉపాధ్యాయుల బోధన సమయం వృధా కావడంతోపాటు విద్యార్థులపై అదనపు పరీక్షల ఒత్తిడి ఏర్పడే అవకాశం ఉంది కావున విద్యార్థుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని ఎక్స్టర్నల్ మూల్యాంకన విధానాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయ సంఘం డిమాండ్ చేస్తుంది అన్నారు ఈ సమావేశంలో ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయ సంఘం మహబూబాబాద్ అధ్యక్షులు మద్దెల వీరస్వామి జిల్లా కార్యదర్శులు దాసరి ఉపేందర్ గుగులోత్ దేవ్ సింగ్ దారం శ్రీను ఆల్ ఇండియా ఆదివాసి ఉద్యోగుల సంఘం జిల్లా ఉపాధ్యక్షులు డి పగడయ్య రవి తదితరులు పాల్గొన్నారు



# చేనేత కళకు పర్యాటక రంగంతో కొత్త ఊపిరి

- 'ఎక్స్‌పీరియన్స్ పోచంపల్లి'తో దేశ, విదేశీ పర్యాటకులను ఆకర్షించాలి
- కలెక్టర్ అనురాగ్ జయంతి



**భువనగిరి కలెక్టరేట్, విశాల భారతి:** చేనేత కళ, స్థానిక సంస్కృతి, ఆహారపు ప్రత్యేకతలు, ప్రకృతి అందాలను పర్యాటకులకు ప్రత్యక్షంగా పరిచయం చేసేలా 'ఎక్స్‌పీరియన్స్ పోచంపల్లి' కార్యక్రమాన్ని రూపొందించాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి సూచించారు. బుధవారం పోచంపల్లి పట్టణంలోని టూరిజం పార్క్‌ను కలెక్టర్ సందర్శించారు. అనంతరం 'ఎక్స్‌పీరియన్స్ పోచంపల్లి' కార్యక్రమంలో భాగంగా ఎంపిక చేసిన టూరిజం గైడ్స్, చేనేత కార్మికులతో సమావేశమై పర్యాటకులకు అందించాల్సిన అనుభవాలపై చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పోచంపల్లి పర్యాటక అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక రూపొందించి దేశ, విదేశాల నుంచి పర్యాటకులను ఆకర్షించేలా చర్యలు చేపట్టాలన్నారు. పర్యాటకులకు పోచంపల్లి ఇక్కత్ వస్త్రాల తయారీ విధానం, చేనేత కార్మికుల నైపుణ్యం, స్థానిక ఆహారపు ప్రత్యేకతలు, సంస్కృతి, జీవన విధానంతో పాటు పరిసర ప్రాంతాల్లోని ప్రకృతి అందాలను పరిచయం చేసేలా కార్యక్రమాలను రూపొందించాలని సూచించారు. 'ఎక్స్‌పీరియన్స్ పోచంపల్లి' ద్వారా స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు చేనేత కార్మికులు తయారు చేసే ఇక్కత్ వస్త్రాలకు మెరుగైన మార్కెటింగ్ అవకాశాలు లభిస్తాయని తెలిపారు. తద్వారా పోచంపల్లి ఇక్కత్ ఉత్పత్తులకు దేశ, విదేశాల్లో మరింత గుర్తింపు లభించే అవకాశం ఉందన్నారు. అనంతరం ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా చేనేత కార్మికుల కోసం నిర్వహించిన ప్రత్యేక ఆరోగ్య శిబిరాల్లో కంటి సమస్యలు గుర్తించిన వారికి రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో కళ్లజోళ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా చేనేత, జౌళి శాఖ సహాయ సంచాలకులు శ్రీనివాసరావు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ మనోహర్, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది, పోచంపల్లి మున్సిపల్ చైర్మన్ తడక వెంకటేశం, పోచంపల్లి చేనేత సహకార సంఘం అధ్యక్షులు భారత లవకుమార్, రోటరీ క్లబ్ ప్రతినిధులు, చేనేత, జౌళి శాఖ సిబ్బంది, టూరిజం గైడ్స్, చేనేత కార్మికులు పాల్గొన్నారు.

# సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలకు నిరసనగా చౌటుప్పల్ లో సీఎం దిష్టిబొమ్మ దహనం



**చౌటుప్పల్, విశాల భారతి:**

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శ్రీరాముడు, పరమశివుడి గురించి చేసిన వ్యాఖ్యలకు నిరసనగా చౌటుప్పల్ మున్సిపాలిటీ వలిగొండ క్రాస్ రోడ్ వద్ద బీజేపీ నాయకులు, కార్యకర్తలు మంగళవారం దిష్టిబొమ్మ దహనం చేశారు. శ్రీరాముడిని ధనికులకు, శివుడిని పేదలకు ప్రతీకగా పేర్కొంటూ సీఎం చేసిన వ్యాఖ్యలు హిందూ సమాజ మనోభావాలను దెబ్బతీసే విధంగా ఉన్నాయని బీజేపీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే ప్రధానమంత్రి నరేంద్ర మోదీని ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలపైనా అభ్యంతరం తెలిపారు. ప్రజాప్రతినిధులు బాధ్యతాయుతమైన భాషను ఉపయోగించాలని కోరారు. హిందూ దేవతలను రాజకీయాలకు ఉపయోగించవద్దని, శ్రీరాముడు, శివుడు కోట్లాది మంది ఆరాధ్య దైవాలని, విభజనకు దారితీసే వ్యాఖ్యలు చేయడం సరికాదని నాయకులు అన్నారు. హిందూ దేవతలను అవమానించే వ్యాఖ్యలను సహించబోమని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా గుమ్మడికాయకు ముఖ్యమంత్రి ప్రతిరూపాన్ని ఏర్పాటు చేసి పగలగొట్టడంతో పాటు దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దూడల భిక్షం గౌడ్, మున్సిపల్ అధ్యక్షులు కడారి కల్పన ఐలయ్య యాదవ్, రూరల్ అధ్యక్షులు కైరంకొండ అశోక్, సీనియర్ నాయకులు రమణగోని శంకరయ్య, ఓబీసీ జిల్లా ప్రధాన కార్యదర్శి చినుకుని మల్లేశం, కౌన్సిలర్లు బుద్ద సురేష్, పోలపల్లి లక్ష్మీ, ముత్తయ్య, సర్పంచ్ లు తంగళ్ల వెంకటేశం, నందగిరి వెంకటేశం గౌడ్, కంచర్ల గోవర్ధన్ రెడ్డి, బత్తుల జంగయ్య గౌడ్, కాయతి రమేష్ గౌడ్, దిండు భాస్కర్, కట్ట కృష్ణ, ఉడుగు వెంకటేశం గౌడ్, బాతరాజు ధనుంజయ, ఆనగంటి విష్ణుకాంత్, అమృతం దశరథ, బడుగు కృష్ణ, యాస అశోక్ రెడ్డి, పబ్బతి శేఖర్, లగ్గొని పాండు, కానుగు కొండల్, తేలుకుంట్ల శ్రీధర్, బూత్ అధ్యక్షులు, కార్యదర్శులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పదవి విరమణ చేసిన సిబ్బందికి వీడ్కోళ్ళు కార్యాక్రమం



**నిజామాబాద్ జిల్లా విశాల భారతి;** నిజామాబాద్ పోలీస్ శాఖలో సెప్టెంబర్ 30న "పదవి విరమణ" నేపద్యంలోని వారి వివరాలు

**సెప్టెంబర్ నెలలో పదవి విరమణ చేసిన సిబ్బంది వివరములు**

1) ఈ.లక్ష్మణ్, ఎ.ఎస్.ఐ , మాక్లూర్ పోలీస్ స్టేషన్ నిజామాబాద్. మొత్తం సర్వీస్ 36 సంవత్సరాల సర్వీసు పూర్తి చేసి నేడు పదవీ విరమణ పొందినారు. నేడు వీరి పదవి విరమణ వీడ్కోలు కార్యాక్రమం పోలీస్ కమిషనర్ కార్యాలయంలో నిర్వ హించడం జరిగింది. వీరికి శాలువలతో సత్కరించి పదవి విరమణ శుభాకాంక్షలు సర్టిఫికేటు (జ్ఞాపికలతో) ఘనంగా సత్కరించడం జరిగినది. ఈ సందర్భంగా గౌరవనీయులు నిజామాబాద్ పోలీస్ కమిషనర్ శ్రీ పి.సాయి చైతన్య, ఐ.పి.యస్., గారు మాట్లాడుతూ పోలీస్ శాఖలో ఎంతో పనివత్తిడితో విధులు నిర్వహించి ఎలాంటి రిమార్కు లేకుండా పదవి విరమణ చేయడం ఎంతో గోప్ప విషయమని ప్రతీ ప్రభుత్వ ఉద్యోగికి పదవి విరమణ తప్పక ఉంటుందని , మీరు పోలీస్ డిపార్టుమెంటు కు చేసిన సేవలు ఎంతో ఘననీయమని పదవి విరమణ అనంతరము మీకు ఎలాంటి అవసరం వచ్చిన మీకు ఎల్లవేళల సహాయపడుతామని , మీరు మరియు మీ కుటుంబ సభ్యులు అయురారోగ్యాలతో ఉండాలని, మీ పిల్లల భవిష్యత్తుభాగుండాలని ఆకాంక్షించారు. ఈ వీడ్కోళ్లు సందర్భంగా అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్(ఏ.వో) శ్రీమతి ఏషియా బేగం, ఆఫీస్ సూపర్డెంట్లు , శ్రీ శంకర్, శ్రీ ఎ. జగతి , టి. వనమాల , స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ శ్రీ శ్రీధర్ రెడ్డి , రిజర్వు ఇన్స్పెక్టర్లు (అడ్మిన్/వెల్ఫేర్ ) శ్రీ ధరణి కుమార్, శ్రీ ఎస్.శేఖర్ బాబు , (ఎం.టి.ఓ / హోంగార్డ్స్ ) మరియు పదవి విరమణ వారి కుటుంబ సభ్యులు హాజరుకావడం జరిగింది.

# చేనేత సహకార సంఘం 51వ వార్షిక, 65వ సర్వసభ్య సమావేశం



- ఇచ్చిన హామీలను అమలు చేస్తామని హామీ ఇచ్చారు
- బడుగు మోహన్ చేనేత సహకార సంఘం చైర్మన్

**చౌటుప్పల్,విశాల భారతి:**

పట్టణంలోని పద్మవంశీ ఫంక్షన్ హాల్ లో చేనేత పారిశ్రామిక సహకార వస్త్ర ఉత్పత్తి విక్రయ సంఘం ఆధ్వర్యంలో 51వ వార్షిక, 65వ సర్వసభ్య సమావేశం బుధవారం ఘనంగా నిర్వహించారు. సంఘ అధ్యక్షులు బడుగు మోహన్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి మున్సిపల్ వైస్ చైర్మన్ గోశిక వినయ్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. సంఘ మేనేజర్ రాపోలు శ్రీరాములు అంచనా ఆదాయాలు, జమా ఖర్చులను చదివి వినిపించగా సభ్యులు ఆమోదించారు. ఈ సందర్భంగా చైర్మన్ బడుగు మోహన్ మాట్లాడుతూ, కార్మికులకు చేతినిండా పని కల్పించి చౌటుప్పల్ చేనేత సహకార సంఘానికి పూర్వ వైభవం తీసుకువస్తానని అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ చిక్క నరసింహ, మాజీ వ్యవసాయ మార్కెట్ చైర్మన్లు బడుగు మాణిక్యం, బడుగు లక్ష్మయ్య, 19వ వార్డు కౌన్సిలర్ పిల్లలమర్రి మధుసూదన్, జిల్లా చేనేత కార్మిక సంఘం అధ్యక్షులు గుర్రం నరసింహ, మాజీ అధ్యక్షులు గోశిక చక్రపాణి, గుర్రం రవీందర్, కందగట్ల బిక్షపతి, శివ భక్త మార్కండేయ దేవస్థానం అధ్యక్షులు బడుగు ప్రకాష్, మాజీ ఎంపీటీసీ పెద్దికృష్ణ, ఉపాధ్యక్షులు గోశిక శ్రీకాంత్, కార్యదర్శి కాటాబత్తిని భీమయ్య, కోశాధికారి బడుగు సావిత్రి, డైరెక్టర్లు బత్తుల మానస, పాపని రామకృష్ణ, గోశిక లక్ష్మీపతి, గోశిక నరసింహ, దోర్నాల లక్ష్మీనారాయణ, సేల్స్ మెన్ గోశిక ప్రభాకర్, పాపని వాసుదేవ్, ఇన్చార్జి గోశిక ధనంజయ, అటెండర్ ఎరుకల రాములు, చేనేత కుల బాంధవులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఆలేరులో కర్ణాటక ప్రభుత్వ ఉచిత 'నందిని' పాలపొడి పట్టివేత

- 210 కిలోల పాలపొడి స్వాధీనం.. ట్రాన్స్‌పోర్ట్ యజమాని అదుపులో



**ఆలేరు, విశాల భారతి:** కర్ణాటక ప్రభుత్వం క్షీరభాగ్య పథకం ద్వారా చిన్నారులకు ఉచితంగా అందిస్తున్న 'నందిని' పాలపొడిని అక్రమంగా తరలిస్తున్న వ్యవహారాన్ని యాదాద్రి భువనగిరి జిల్లా పోలీసులు ఛేదించారు. కర్ణాటక నుంచి హైదరాబాద్ మీదుగా ఆలేరు, జనగామ ప్రాంతాలకు తరలిస్తున్న 210 కిలోల పాలపొడిని ఆలేరు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఆలేరులోని ఓ ప్రైవేట్ ట్రాన్స్‌పోర్ట్ కార్యాలయంలో అక్రమంగా తరలించేందుకు సిద్ధంగా ఉంచిన పాలపొడిని పోలీసులు గుర్తించి దాడులు నిర్వహించారు. ఈ ఘటనకు సంబంధించి ట్రాన్స్‌పోర్ట్ యజమానిని అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. పోలీసుల దర్యాప్తులో హైదరాబాద్‌కు చెందిన 'దయ' అనే వ్యక్తి అక్రమ పాలపొడి వ్యాపారం నిర్వహిస్తున్నట్లు వెల్లడైనట్లు పోలీసులు తెలిపారు. కర్ణాటక ప్రభుత్వం చిన్నారులకు ఉచితంగా అందిస్తున్న పాలపొడిని పక్కదారి పట్టించి పశువుల వినియోగం, స్వీట్లు, పన్నీర్ తయారీ కోసం తరలిస్తున్నట్లు దర్యాప్తులో గుర్తించినట్లు ఆలేరు ఎస్‌హెచ్ఓ ఉదయ్ కిరణ్ తెలిపారు. ప్రభుత్వ పథకాల ద్వారా చిన్నారులకు అందాల్సిన సరుకులను అక్రమంగా తరలించడం, దుర్వినియోగం చేయడంపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.

# ప్రభుత్వ విద్యాభివృద్ధికి భూషపాక రాములు సేవలు అభినందనీయం



**ఆలేరు, విశాల భారతి:** మూడు దశాబ్దాలకు పైగా ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా సేవలందించిన ఎస్ఏ హిందీ భూషపాక రాములు సేవలు అభినందనీయమని జిల్లా విద్యాశాఖ అధికారి బొల్లారం బిక్షపతి అన్నారు. రాములు పదవీ విరమణ సందర్భంగా నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో డీఈఓ మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని, గ్రామాల్లో బడి, గుడి రెండూ బాగుంటేనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివి విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపుతూ సుమారు 600 మంది విద్యార్థులకు ఉచితంగా స్కూల్ బ్యాగులు పంపిణీ చేసిన భూషపాక రాములును డీఈఓ అభినందించారు. పిఆర్టీయూటీఎస్ జిల్లా అధ్యక్షుడు గడసంతల మధుసూదన్ మాట్లాడుతూ రాములు వివిధ పాఠశాలల్లో సేవలందిస్తూ ఎంతో మంది విద్యార్థులను తీర్చిదిద్దారని కొనియాడారు. ఆయన స్ఫూర్తితో ప్రభుత్వ ఉపాధ్యాయులు ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందించేందుకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కంచరకుంట్ల వీరారెడ్డి, జిల్లా నాయకులు బూడిద శ్రీనివాస్, మూల తిరుపతిరెడ్డి, చామల శ్రీధర్, రాష్ట్ర నాయకులు కాంతారావు, రవికుమార్, వేణుగోపాల్, సతీష్, సుదర్శన్, సంజీవరెడ్డి, మహిళా నాయకురాలు సంధ్యారాణి, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఏ పరీక్షల బాహ్య మూల్యాంకనం రద్దు చేయాలి



**ఆలేరు, విశాల భారతి:** 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు నిర్వహించే ఎస్ఏ 1, ఎస్ఏ 2 పరీక్షల జవాబు పత్రాలకు బాహ్య మూల్యాంకనం నిర్వహించాలంటూ ప్రభుత్వం జారీ చేసిన ఆర్‌సీ నం.7002 మెమోను వెంటనే రద్దు చేయాలని పీఆర్‌టీయూటీఎస్ యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షుడు గడసంతల మధుసూదన్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సీసీఈ విధానాలకు విరుద్ధంగా బాహ్య మూల్యాంకనాన్ని ప్రవేశపెట్టడం వల్ల ఉపాధ్యాయులపై అదనపు భారం పడుతుందని అన్నారు. ఇప్పటికే ఎఫ్ఆర్ఎస్, ఎండీఎం, ఎఫ్ఏ 1, బేస్‌లైన్ టెస్టులతో పాటు వివిధ రకాల సమాచారాన్ని మొబైల్ యాప్‌ల ద్వారా సేకరించడం వల్ల ఉపాధ్యాయులపై పని ఒత్తిడి పెరిగిందన్నారు. ఈ నేపథ్యంలో ఎస్ఏ 1, ఎస్ఏ 2 జవాబు పత్రాల బాహ్య మూల్యాంకనం మరింత భారంగా మారుతుందని పేర్కొన్నారు. బాహ్య మూల్యాంకనం వల్ల ఉపాధ్యాయుల స్వేచ్ఛకు ఆటంకం కలగడంతో పాటు విద్యార్థుల్లో పరీక్షల భయం పెరిగే అవకాశం ఉందన్నారు. విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి అంతర్గత మూల్యాంకన విధానమే ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కంచరకుంట్ల వీరారెడ్డి, మండల అధ్యక్షుడు మూల తిరుపతిరెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి చామల శ్రీధర్, రాష్ట్ర కమిటీ సభ్యులు రవికుమార్, వేణుగోపాల్, కాంతారావు, సంజీవరెడ్డి, సతీష్, మహిళా నాయకురాలు సంధ్యారాణి, జిల్లా కమిటీ సభ్యుడు సుదర్శన్, మండల నాయకులు సత్యనారాయణ, వెంకటయ్య, దశమంతరెడ్డి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# పబ్బు రాజు గౌడ్ ను పరామర్శించిన ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి



**చౌటుప్పల్,విశాల భారతి:** మునుగోడు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ఇంచార్జ్ పబ్బు రాజు గౌడ్ ను మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మంగళవారం పరామర్శించారు. ఇటీవల మృతి చెందిన పబ్బు రాజు గౌడ్ తల్లి పబ్బు వజ్రమ్మ చిత్రపటానికి పూలమాల వేసి ఎమ్మెల్యే నివాళులు అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో చౌటుప్పల్ మండలం, మున్సిపల్ ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కురవిలో పోలీసుల కొరడా

- లింగ్యా తండాలో తెల్లవారుజామున మెరుపు తనిఖీలు
- 100 ఇళ్లలో జల్లెడ..
- నంబర్ ప్లేట్లు లేని 20 వాహనాలు గుర్తింపు
- 30 లీటర్ల గుడుంబా
- 1000 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం
- కురవి ఎస్సై బి సతీష్

**కురవి విశాల భారతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్.**






అక్రమ కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయడమే లక్ష్యంగా కురవి పోలీసులు తెల్లవారుజామున మెరుపు తనిఖీలతో విరుచుకుపడ్డారు. కురవి పోలీస్‌స్టేషన్ పరిధిలోని బాలపాల లింగ్యా తండాలో ఎస్ఐ బి. సతీష్ ఆధ్వర్యంలో బుధవారం ఉదయం 5:30 గంటల నుంచి 7:45 గంటల వరకు కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రామ్ నిర్వహించారు. ఏకకాలంలో సుమారు 100 ఇళ్లు, పరిసర ప్రాంతాలను క్షుణ్ణంగా తనిఖీ చేసి అక్రమ కార్యకలాపాలపై పోలీసులు ఉక్కుపాదం మోపారు.

**20 వాహనాలకు చెక్..**

**పత్రాలు, నంబర్ ప్లేట్లు గల్లంతు**

తనిఖీల్లో సరైన ధ్రువపత్రాలు, నంబర్ ప్లేట్లు లేని 20 వాహనాలను పోలీసులు గుర్తించారు. నిబంధనలకు విరుద్ధంగా వాహనాల వినియోగంపై పోలీసులు దృష్టి సారించారు. గుర్తించిన వాహనాలకు సంబంధించి నిబంధనల ప్రకారం తదుపరి చర్యలు చేపట్టనున్నారు.

**గుడుంబా తయారీపై దాడి..**

**భారీగా బెల్లం ఊట ధ్వంసం**

తనిఖీల్లో అక్రమ గుడుంబా తయారీకి సంబంధించిన ఆనవాళ్లు బయటపడ్డాయి. 30 లీటర్ల గుడుంబాతో పాటు సుమారు 1000 లీటర్ల బెల్లం ఊటను పోలీసులు గుర్తించారు. బెల్లం ఊటను అక్కడికక్కడే ధ్వంసం చేసి అక్రమ మద్యం తయారీకి అడ్డుకట్ట వేశారు. సంబంధిత వ్యక్తులపై కేసులు నమోదు చేయాల్సి ఉందని పోలీసులు తెలిపారు.

**40 మంది పోలీసులతో ఆపరేషన్**

పోలీసుల తనిఖీలు పకడ్బందీగా సాగాయి. సర్కిల్ ఫోర్స్ 26 మంది, స్పెషల్ పార్టీ 14 మంది.. మొత్తం 40 మంది సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. సీఐ రూరల్ అంజలి, ఎస్ఐ రూరల్ రాజు, స్పెషల్ పార్టీ సిబ్బంది, ఇతర పోలీసు సిబ్బంది తనిఖీల్లో పాల్గొన్నారు.

**గంజాయి, సైబర్ నేరాలపై అప్రమత్తం**

తనిఖీల అనంతరం గ్రామస్తులతో పోలీసులు సమావేశమయ్యారు. రోడ్డు ప్రమాదాల నివారణ, గంజాయి నియంత్రణ, సైబర్ నేరాల పట్ల అప్రమత్తత, సీసీ కెమెరాల ఏర్పాటు ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు. అనుమానాస్పద వ్యక్తులు, కార్యకలాపాలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.

**అక్రమాలపై నిఘా మరింత కట్టుదిట్టం**

బాలపాల లింగ్యా తండాలో జరిగిన ఈ విస్తృత తనిఖీలతో అక్రమ మద్యం తయారీ, నిబంధనలకు విరుద్ధమైన వాహనాల వినియోగంపై పోలీసుల నిఘా ఏ స్థాయిలో ఉందో స్పష్టమైంది. ఎస్ఐ బి. సతీష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రామ్‌లో పోలీసులు క్షేత్రస్థాయిలో విస్తృతంగా తనిఖీలు చేపట్టారు.

## మండల స్థాయి కవితారచనలో ఉత్తమంగా నిలిచిన చిన్నాపూర్ విద్యార్థులు



**నిజామాబాద్ జిల్లా విశాల భారతి ;** మాక్లూర్ మండలం మాణిక్ బండారు డివిజన్ మాణిక్ బండారు పాఠశాలలో మండల స్థాయి, కవితా రచన పోటీలు జరిగాయి. తెలంగాణ సారస్వత పరిషత్ సంస్థ సౌజన్యంతో జరిగిన ఈ పోటీలకు మాక్లూరు మండల ఎంఈఓ సత్యనారాయణ అధ్యక్షత వహించారు. పరిషత్ జిల్లా కన్వీనర్లు డాక్టర్ కాసర్ల నరేశ్ రావు, కోకిల నాగరాజు ల నిర్వహణతో సాహిత్య కార్యశాల జరిగింది. శిక్షణ తీసుకొని మంచి సందేశాత్మకమైన కవితలు అందించిన చిన్నాపూర్ పాఠశాల విద్యార్థులు ముందు వరుసలో నిలవడం అభినందనీయమని సర్పంచ్ చిన్న గంగారాం , పాఠశాల చైర్మన్ సుమలత హెచ్ఎం రాజేందర్ గారు అభినందించారు. దీనికి విద్యార్థుల్లో దాగిన ప్రతిభను గుర్తించి కవితల ఆలోచనలు పురుకొల్పిన తెలుగు పండితులు కేవీ రమణ చారి గారిని అభినందించారు. మండల స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిన హర్షిక ద్వితీయ స్థానంలో నిలిచిన శ్రీనిధి ని శాలువాతో ఘనంగా సన్మానించారు. మంచి కవితలు గేయాలు రాసిన గాయత్రి, అజయ్, రాజేష్, అంస్రా, మరియం, హర్షిత, శ్రీ నిత్య, ప్రణీత, స్పందన విద్యార్థులను అభినందించారు.

## గీత పారిశ్రామిక సంఘం నూతన కమిటీ ఏకగ్రీవ ఎన్నిక



**ఆలేరు,విశాల భారతి:** మండలంలోని కొలనుపాక గీత పారిశ్రామిక సహకార సంఘం నూతన కమిటీని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వరుసగా మూడోసారి కమిటీ ఏకగ్రీవంగా ఎన్నిక కావడం విశేషం. అధ్యక్షుడిగా మాసాపేట రాజు గౌడ్, ఉపాధ్యక్షులుగా కోటగిరి కృష్ణ, మడిపల్లి నర్సింలు, ప్రధాన కార్యదర్శిగా ఆరే అశోక్, కోశాధికారిగా దూడల సాగర్ ఎన్నికయ్యారు. డైరెక్టర్లుగా మిట్టపల్లి సుభాష్, భీమగొని సారయ్య, గడ్డం సందీప్, మడిపల్లి శ్రీధర్, నిడిగొండ కృష్ణకాంత్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు బైరి రమేష్, పాప రాజా, ఆనందం, కుమ్మరిండ్ల సోమేశ్వర్, బొమ్మెన ఉప్పలయ్య, దూడల భాగయ్య, కుమ్మరిండ్ల ఆంజనేయులు, నల్లగొని బలరాం, కుమ్మరిండ్ల బాల్ నరసయ్య, బైరి అమృతం, మిట్టపల్లి పాండు, పార్వతి కృష్ణమూర్తి, బండి రమేష్, అబ్బా గౌని ప్రభాకర్, నల్లగోని శ్రీను, వడ్లకొండ రాజు, రాంపల్లి శేఖర్, కారింగుల సంపత్ తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి ఎస్‌జీఎఫ్ఐ మల్కంబ్ పోటీలకు ఎంపికైన ఊదరి రాధేశ్యామ్



**చౌటుప్పల్,విశాల భారతి:** యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ లోని ట్రినిటీ హైస్కూల్ ప్రాంగణంలో ఉమ్మడి నల్గొండ జిల్లా స్థాయి ఎస్‌జీఎఫ్ఐ అండర్ 17 మల్కంబ్ ఎంపిక పోటీలు ఘనంగా నిర్వహించారు.ఈ పోటీల్లో ఉమ్మడి నల్గొండ జిల్లా పరిధిలోని వివిధ పాఠశాలలకు చెందిన బాలబాలికలు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. ప్రతిభ, నైపుణ్యం ఆధారంగా ఎంపికైన క్రీడాకారులు తెలంగాణ రాష్ట్ర స్థాయి ఎస్‌జీఎఫ్ఐ మల్కంబ్ పోటీల్లో ఉమ్మడి నల్గొండ జిల్లా తరపున ప్రాతినిధ్యం వహించనున్నారు.ఈ ఎంపిక పోటీల్లో తంగడపల్లి గ్రామానికి చెందిన ఊదరి శ్యామ్ సుందర్, లావణ్య దంపతుల కుమారుడు ఊదరి రాధేశ్యామ్ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు.ఈ సందర్భంగా ఎంఈఓ గురువారావు మాట్లాడుతూ మల్కంబ్ క్రీడ విద్యార్థుల్లో శారీరక దృఢత్వం, సమతుల్యత, ఏకాగ్రత, చురుకుదనం, క్రమశిక్షణను పెంపొందిస్తుందన్నారు. పాఠశాల స్థాయి నుంచే ప్రతిభావంతులను గుర్తించి జిల్లా, రాష్ట్ర స్థాయిలో అవకాశాలు కల్పించడమే ఈ పోటీల ఉద్దేశమన్నారు.విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించాలని, భారతీయ సాంప్రదాయ క్రీడ అయిన మల్కంబ్ ను ప్రోత్సహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పీఈటీ ఏ రాష్ట్ర అధ్యక్షులు కృష్ణమూర్తి, ఎస్‌జీఎఫ్ మండల కార్యదర్శి లింగయ్య, జెడ్పీహెచ్ఎస్ కోయలగూడెం ఉపాధ్యాయులు మట్టయ్య, ట్రినిటీ హైస్కూల్ చైర్మన్ కె.వి.బి. కృష్ణారావు, ప్రిన్సిపాల్ కమ్ డైరెక్టర్ ఉజ్జిని మంజుల, తెలంగాణ మల్కంబ్ అసోసియేషన్ కార్యదర్శి ఎం. గోపాల్, వివిధ పాఠశాలల పీఈటీలు పాల్గొని క్రీడాకారులను అభినందించారు.

## విద్యార్థునిలు వైద్య విద్యను అభ్యసించి సమాజానికి సేవ చేయాలి



**తిరుమలగిరి, విశాలాభారతి :** విద్యార్థినిలు పట్టుదలతో వైద్య విద్యను అభ్యసించి సమాజానికి సేవ చేయాలని రిటైర్డ్ ఉద్యోగుల సంఘం తిరుమలగిరి అధ్యక్ష, కార్యదర్శులు ఎస్ విటల్ రెడ్డి, బి నర్సయ్య కోరారు. బుధవారం పెన్షనర్స్ భవన్ తిరుమలగిరిలో 2026 నీట్ లో ఎంబిబిఎస్ సీట్లు సాధించిన జలాల్ పురం గ్రామానికి చెందిన ముత్తినేని వైష్ణవి రిమ్స్ ఆదిలాబాద్, జేత్యా తండాకి చెందిన ధరావత్ అలేఖ్య ప్రభుత్వ మెడికల్ కాలేజ్ వనపర్తిలను శాలువా, మెమోంటోలచే ఘనంగా రిటైర్డ్ ఉద్యోగుల సంఘం తిరుమలగిరి మండల శాఖ ఘనంగా సన్మానించింది. ఈ సందర్భంగా అధ్యక్షులు విటల్ రెడ్డి చెరో పది వేలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి మందడి పద్మారెడ్డి, కోశాధికారి చిత్తలూరి పుల్లయ్య, అసోసియేట్ అధ్యక్షులు చెట్టిపల్లి మల్లయ్య, కేసిడి రామిరెడ్డి, ఉప్పల పద్మమ్మ, కె పుష్పలీల, కె రాములు, కె కొమిరెల్లి, పి సత్యనారాయణ తదితర పెన్షనర్లు, బంధువులు పాల్గొన్నారు.

## ఆర్థిక ఇబ్బందులతో ఇద్దరు మృతి.. నాచారం పోలీసుల దర్యాప్తు





**నాచారం 30 విశాల భారతి ;** అప్పుల ఒత్తిడి.. నాచారం పరిధిలో ఇద్దరి మృతి నాచారం పోలీస్ స్టేషన్ పరిధిలో ఆర్థిక ఇబ్బందులకు సంబంధించిన రెండు వేర్వేరు ఘటనల్లో ఇద్దరు వ్యక్తులు మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఘటనలపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మొదటి ఘటనలో మల్లాపూర్‌లో నివాసం ఉంటున్న దీగోజు నాగరాజు (34) ఆర్థిక అప్పుల కారణంగా కొంతకాలంగా ఒత్తిడికి గురవుతున్నట్లు కుటుంబ సభ్యులు పోలీసులకు తెలిపారు. సెప్టెంబర్ 29న భార్య విధులకు వెళ్లిన అనంతరం ఇంటికి తిరిగి వచ్చిన సమయంలో నాగరాజు మృతి చెందిన విషయం వెలుగులోకి వచ్చింది. సమాచారం అందుకున్న 108 సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించగా అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు.మరో ఘటనలో కంచె రఘురామయ్య (39) ఆర్థిక అప్పుల కారణంగా తీవ్ర ఒత్తిడికి గురైనట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. సెప్టెంబర్ 29 రాత్రి అస్వస్థతకు గురైన ఆయనను కుటుంబ సభ్యులు మల్లాపూర్‌లోని ఆసుపత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స కోసం మరో ఆసుపత్రికి తరలించి చికిత్స అందించగా, సెప్టెంబర్ 30 ఉదయం చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు.ఇరువురు మృతుల విషయంలో తమకు ఎవరిపైనా అనుమానం లేదని కుటుంబ సభ్యులు ఫిర్యాదుల్లో పేర్కొన్నట్లు పోలీసులు తెలిపారు. ఈ రెండు ఘటనలపై కేసులు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు. కేసుల దర్యాప్తు అధికారుల ఆధ్వర్యంలో మృతుల మరణానికి సంబంధించిన పూర్తి వివరాలను పోలీసులు సేకరిస్తున్నారు.

## ఉద్యోగ కాలంలో చేసిన సేవలే శాశ్వత గుర్తింపునిస్తాయి

- గాంధీ ఆస్పత్రిలో జూనియర్ అసిస్టెంట్ గంట ప్రభాకర్‌కు ఘన వీడ్కోలు



**సికింద్రాబాద్, విశాల భారతి :** ఉద్యోగ కాలంలో సంస్థకు, తోటి ఉద్యోగులకు అందించిన నిస్వార్థ సేవలే శాశ్వత గుర్తింపును తెచ్చిపెడతాయని వక్తలు పేర్కొన్నారు. సికింద్రాబాద్ గాంధీ ఆసుపత్రిలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తూ పదవీ విరమణ పొందిన గంట ప్రభాకర్ యాదవ్‌కు బుధవారం తోటి ఉద్యోగులు, అధికారుల సమక్షంలో ఘనంగా వీడ్కోలు సభ నిర్వహించారు. గాంధీ ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన ఈ ఆత్మీయ అభినందన సభలో ప్రభాకర్ దంపతులను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించి పదవీ విరమణ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సహచరులు మాట్లాడుతూ, ప్రభాకర్ తన సర్వీస్ కాలంలో విధుల పట్ల అంకితభావంతో వ్యవహరించడమే కాకుండా, సుదీర్ఘకాలం పాటు యూనియన్ అధ్యక్షుడిగా పనిచేస్తూ తోటి ఉద్యోగుల సంక్షేమం కోసం అలుపెరగని కృషి చేశారని కొనియాడారు. సిబ్బంది సమస్యల పరిష్కారంలో ఎల్లప్పుడూ ముందుండి నాయకత్వం వహించారని గుర్తుచేసుకున్నారు. తెలంగాణ నాన్‌గెజిటెడ్ ఉద్యోగుల సంఘం (టీఎన్జీవోస్) గాంధీ హాస్పిటల్ యూనిట్ ప్రతినిధులు ఆయనకు వీడ్కోలు పలుకుతూ, శేష జీవితం ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో గడవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ టి. ఉషారాణి, ఆర్ ఎం ఓ లు జయకృష్ణ, యోగేంధర్, వెంకట్ యాదవ్, డిప్యూటీ సూపరింటెండెంట్ సునీల్ కుమార్, టీఎన్జీవో సెంట్రల్ యూనియన్ సెక్రటరీ డాక్టర్ ముజీబ్ హుస్సేన్, గెజిటెడ్ యూనియన్ ప్రెసిడెంట్ కృష్ణ యాదవ్, హైదరాబాద్ జిల్లా కార్యదర్శి శ్రీనివాస్, గాంధీ యూనిట్ సెక్రటరీ ప్రసన్నానంద్, నాయకులు కలీమ్, జనార్ధన్, సరళ, మక్సూద్, రహీమ్, సత్యనారాయణ, శ్రవణ్ , విశ్వనాథ్ ,భావన, సోనియా తో పాటు ఆసుపత్రి ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

## సేవలకు వీడ్కోలు.. మొహ్సిన్ షరీఫ్‌కు ఘన సన్మానం

- పదవీ విరమణ సందర్భంగా దంపతులకు ఘనంగా సన్మానం
- శుభాకాంక్షలు తెలిపిన ఎంపీడీఓ శ్రీవాణి



**విశాల భారతి, అబ్దుల్లాపూర్ మెట్ :** అబ్దుల్లాపూర్ మెట్ మండల పరిషత్ కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహించిన మొహ్సిన్ షరీఫ్ పదవీ విరమణ కార్యక్రమాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. మండల ఎంపీడీఓ శ్రీవాణి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి మండలంలోని వివిధ గ్రామాల సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ శ్రీవాణి మాట్లాడుతూ.. ప్రభుత్వ సేవల్లో బాధ్యతాయుతంగా విధులు నిర్వహించి పదవీ విరమణ పొందుతున్న మొహ్సిన్ షరీఫ్‌కు అభినందనలు తెలిపారు. పదవీ విరమణ అనంతరం ఆయన దంపతులు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ప్రశాంతమైన జీవితం గడపాలని ఆకాంక్షించారు. ఉద్యోగ జీవితంలో అందించిన సేవలను గుర్తుచేసుకుంటూ ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మొహ్సిన్ షరీఫ్ దంపతులను ఎంపీడీఓ శ్రీవాణి,యం పి ఓ షఫీ ఉల్లా ఖాన్, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, మండల పరిషత్ సిబ్బంది ఘనంగా సన్మానించి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పదవీ విరమణ పొందిన మొహ్సిన్ షరీఫ్‌కు పలువురు అధికారులు, సిబ్బంది అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమం లో చిన్న రవీర్యాల సర్పంచ్ పబ్బత్ బాలకిషన్ గౌడ్, బండరావిర్యాల సర్పంచ్ కందికంటి విజయ్ కుమార్, గుంతపల్లి సర్పంచ్ అంతటి హేమలత జంగయ్య గౌడ్, ఫిగ్లీపూర్ సర్పంచ్ కోట ప్రభాకర్ రెడ్డి, అబ్దుల్లాపూర్ మెట్ సర్పంచ్ మందుగల విజయ శ్రీశైలం గౌడ్ తో పాటు తదితరులు పాల్గొన్నారు.

## పాలకులకు బుద్ధి చెప్పాల్సిన సమయం వచ్చింది

- పట్టభద్రుల ఎన్నికలకు సిద్ధం కావాలన్న సురభి వాణిదేవి




**ముషీరాబాద్,విశాల భారతి:** ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పాలని ఎమ్మెల్సీ సురభి వాణిదేవి పిలుపు ఇచ్చారు. భారత రాష్ట్ర సమితి ముషీరాబాద్ నియోజక వర్గ విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశం బుధవారం కశీష్ ఫంక్షన్ హాలులో జరిగింది. పార్టీ నేత ముఠా జై సింహ అధ్యక్షతన జరిగిన సమావేశానికి ఎమ్మెల్సీ సురభి వాణిదేవి హాజరై మాట్లాడారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. ప్రజల సంక్షేమాన్ని పట్టించుకోకపోగా ఎన్నికల సమయంలో ఇచ్చిన డిక్లరేషన్ హామీలను విస్మరించారని ఫైర్ అయ్యారు. కేసీఆర్ హయంలో అమలు చేసిన సంక్షేమ పథకాలను నిలిపివేసి సామాన్య ప్రజల జీవితాలతో చెలగాటం ఆడుతున్న పాలకులకు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. బి ఆర్ ఎస్ పార్టీ నేత ముఠా జై సింహ మాట్లాడుతూ నీళ్ళు నిధులు నియామకాల కోసం సాధించుకున్న తెలంగాణను అన్నివిధాలుగా కాంగ్రెస్ పార్టీ నిర్వీర్యం చేసిందని విమర్శించారు.మాజీ కార్పొరేటర్ వి.శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ప్రజల ఆకాంక్షలను వ్యతిరేకంగా కాంగ్రెస్ పాలన ఉందని, ప్రజా పాలన పేరుతో దోపిడీకి పాల్పడుతున్నారని ఆరోపించారు. మీడియా ఇన్చార్జ్ ముచ్చకుర్తి ప్రభాకర్ సమన్వయంలో జరిగిన కార్యక్రమానికి రేశం మల్లేష్, రాకేష్ కుమార్, శంకర్ ముదిరాజ్, వై.శ్రీనివాస్, బల్ల శ్రీనివాస్ రెడ్డి, వల్లాల శ్రీనివాస్, కొండా శ్రీధర్ రెడ్డి, సోమసుందర్, కల్వ గోపి, నేత శ్రీనివాస్, పెంటా రెడ్డి, ఆకారం శ్రీనివాస్, బల్ల ప్రశాంత్ సహ అదిక సంఖ్యలో బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళా ప్రతినిధులు పాల్గొన్నారు.

## రూ.75 వేల లంచం తీసుకుంటూ పట్టుబడ్డ మున్సిపల్ అధికారులు

- అక్రమ నిర్మాణంపై చర్యలు తీసుకోకుండా ఉండేందుకు రూ.లక్ష డిమాండ్



**మొయినాబాద్, విశాల భారతి :** అక్రమ నిర్మాణంపై చర్యలు తీసుకోకుండా ఉండేందుకు లంచం డిమాండ్ చేసిన మొయినాబాద్ మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారి గుండు వాణి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఎలమోని సుదర్శన్ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు. హైదరాబాద్ సిటీ రేంజ్ 2 ఏసీబీ డీఎస్పీ శ్రీధర్ ఆధ్వర్యంలో బుధవారం మొయినాబాద్ మున్సిపల్ కార్యాలయంలో ఏసీబీ అధికారులు దాడులు నిర్వహించారు. మొయినాబాద్ మున్సిపల్ పరిధిలోని ఓ అక్రమ నిర్మాణంపై చర్యలు తీసుకోకుండా ఉండేందుకు సంబంధిత అధికారులుగా ఉన్న గుండు వాణి, ఎలమోని సుదర్శన్ రూ.లక్ష లంచం డిమాండ్ చేసినట్లు ఏసీబీ అధికారులు తెలిపారు. బాధితుడి ఫిర్యాదుతో రంగంలోకి దిగిన ఏసీబీ అధికారులు పక్కా ప్రణాళికతో ట్రాప్ నిర్వహించారు. చివరకు రూ.75 వేల లంచం తీసుకుంటుండగా ఇద్దరు అధికారులను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. లంచం తీసుకుంటున్న సమయంలో ఏసీబీ అధికారులు అక్కడికి చేరుకుని నగదును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అనంతరం సంబంధిత అధికారుల నుంచి వివరాలు సేకరించి, కేసు నమోదు చేసి తదుపరి చట్టపరమైన చర్యలు చేపట్టారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రజల పనులు చట్టబద్ధంగా జరగాల్సి ఉండగా, లంచం డిమాండ్ చేసే అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఏసీబీ అధికారులు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఏసీబీ డీఎస్పీ శ్రీధర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ అధికారులు ఎవరైనా లంచం డిమాండ్ చేస్తే వెంటనే ఏసీబీ టోల్‌ఫ్రీ నంబర్ 1064కు సమాచారం అందించాలని సూచించారు. ఫిర్యాదు చేసిన వారి వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామని తెలిపారు. లంచం డిమాండ్ చేసే అధికారులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవడంతో పాటు, బాధితులకు సంబంధించిన పనిని నిబంధనల మేరకు పూర్తి చేసేందుకు చర్యలు చేపడతామని ఆయన వెల్లడించారు.

## అక్టోబర్ 2 న జర్నలిస్టుల ఆందోళన కార్యక్రమం జయప్రదం చేయాలి

- టియుడబ్ల్యుజె మేడ్చల్ జిల్లా అధ్యక్షులు గడ్డమీది బాలరాజు



**కూకట్ పల్లి,విశాల భారతి:** జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం అక్టోబర్ 2న నిర్వహించే తలపెట్టిన ఆందోళన కార్యక్రమాలను విజయవంతం చేయాలని తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం మేడ్చల్ జిల్లా అధ్యక్షులు గడ్డమీది బాలరాజు పిలుపునిచ్చారు. టీయూడబ్ల్యూజే రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు శుక్రవారం ఉదయం 10 గంటలకు కే బి హెచ్ బి కాలనీ మెయిన్ రోడ్ లోని గాంధ్రీ విగ్రహం వద్ద శాంతియుత ఆందోళన నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రజా పాలన మొదలై మూడేళ్లు గడుస్తున్న జర్నలిస్టుల సంక్షేమం కోసం ఈ ప్రభుత్వం ఏ విధమైన చర్యలు చేపట్టకపోవడం ఆందోళనకరమన్నారు. గడిచిన మూడేళ్ల కాలంలో జర్నలిస్టుల ఆరోగ్య భద్రత కోసం చర్యలు తీసుకోకపోవడం అత్యంత విచారకరమని పేర్కొన్నారు. గతంలో ఉన్న హెల్త్ స్కీం లను పునరుద్ధరించాలని టీయూడబ్ల్యూజే మొదటి నుంచి విజ్ఞప్తి చేస్తున్న పట్టించుకోవడంలేదని ఆవేదన చెందారు. ఉద్యోగులతో సమానంగా ఆరోగ్య భద్రత కల్పిస్తామని ప్రభుత్వం ఇచ్చిన హామీలు ప్రకటనకే పరిమితమైనయని తెలిపారు. జర్నలిస్టు కుటుంబాల ఆరోగ్య భద్రత కోసం జర్నలిస్టులు ఆందోళన బాట పట్టక తప్పని పరిస్థితి నెలకొన్నదని తెలిపారు. అదేవిధంగా ఇల్లు, ఇళ్ల స్థలాల సమస్య పరిష్కారానికి నోచుకోవడం లేదని ఆరోపించారు. వేతన బోర్డు, జర్నలిస్టుల రక్షణ చట్టాలను ఏర్పాటు చేయాలన్న తదితర డిమాండ్లతో ఈ ఆందోళన కార్యక్రమాన్ని చేస్తున్నట్లు ఆయన స్పష్టం చేశారు. జిల్లా పరిధిలోని కుత్బుల్లాపూర్, కూకట్ పల్లి నియోజకవర్గలకు చెందిన జర్నలిస్టులు ఈ ఆందోళన కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు.

## కార్యకర్త కుటుంబానికి బీఆర్ఎస్ గ్రామ శాఖ బాసట

- రూ.11,500 ఆర్థిక సాయం.. 25 కేజీల బియ్యం అందజేత
- మాతృవియోగంతో బాధపడుతున్న కుటుంబానికి నాయకుల పరామర్శ.
- కార్యకర్త కష్టాల్లో ఉన్నప్పుడు అండగా నిలవడం బాధ్యత: బీఆర్ఎస్ నాయకులు.

**మహబూబాబాద్ జిల్లా విశాల భారతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్**



మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని 6వ వార్డు బేతోలు గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ సీనియర్ కార్యకర్త సుదనబోయిన వెంకన్న మాతృమూర్తి వెంకటమ్మ ఇటీవల మృతి చెందారు. ఆమె మృతిపట్ల బేతోలు బీఆర్ఎస్ గ్రామ శాఖ నాయకులు తీవ్ర సంతాపం, ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. బుధవారం శోకసంద్రంలో ఉన్న వెంకటమ్మ కుటుంబాన్ని బీఆర్ఎస్ గ్రామ శాఖ నాయకులు పరామర్శించి, కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. బాధిత కుటుంబానికి పార్టీ తరపున అండగా నిలుస్తూ రూ.11,500 నగదు ఆర్థిక సాయంతో పాటు 25 కేజీల బియ్యాన్ని అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి నిరంతరం శ్రమించే కార్యకర్తలకు బీఆర్ఎస్ ఎల్లవేళలా అండగా ఉంటుందని అన్నారు. కార్యకర్త కుటుంబంలో విషాదం చోటుచేసుకున్న సమయంలో తోడుగా నిలవడం తమ బాధ్యతగా భావిస్తున్నామని పేర్కొన్నారు. మాతృవియోగంతో బాధపడుతున్న కుటుంబ సభ్యులకు భగవంతుడు మనోధైర్యం ప్రసాదించాలని, వెంకటమ్మ ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. బీఆర్ఎస్ బేతోలు గ్రామ శాఖ నాయకులు షేక్ ఖాదర్ బాబా, గద్దపాటి సంతోష్, అనపర్తి మదన్, సిరికొండ కృష్ణ, ఏర్పుల హుస్సేన్, గద్దపాటి వేణు, జిన్నుక ఎల్లయ్య తదితరులతో పాటు బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# తప్పుడు ఆరోపణలపై న్యాయపోరాటం

- హరీశ్‌రావుపై క్షుద్రపూజల ఆరోపణలు..
- మహేశ్‌కుమార్ గౌడ్, అద్దంకి దయాకర్‌పై పరువు నష్టం కేసు



**విశాల భారతి, అబ్దుల్లాపూర్ మెట్ :** బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి, సిద్ధిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావుపై క్షుద్రపూజలు చేశారంటూ చేసిన ఆరోపణల వ్యవహారం న్యాయస్థానం వరకు చేరింది. టీపీసీసీ అధ్యక్షులు బి. మహేశ్‌కుమార్ గౌడ్, కాంగ్రెస్ ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ చేసినట్లు పేర్కొంటున్న ఆరోపణలపై హరీశ్‌రావు పరువు నష్టం ఫిర్యాదు దాఖలు చేశారు. నాంపల్లి ప్రజాప్రతినిధుల ప్రత్యేక న్యాయస్థానం ఫిర్యాదును స్వీకరించినట్లు ఇప్పటికే వార్తలు వెలువడ్డాయి. ఈ సందర్భంగా హరీశ్‌రావుతో కలిసి నాంపల్లి కోర్టుకు హాజరైన అడ్వకేట్ వీరమల్ల రామ్ నరసింహ గౌడ్ మాట్లాడుతూ.. ఆధారాలు లేని, అర్థరహితమైన ఆరోపణలు చేసి వ్యక్తిగత ప్రతిష్ఠకు భంగం కలిగించేలా ప్రచారం చేస్తే చట్టపరంగా ఎదుర్కొంటామని అన్నారు. అబద్ధపు ప్రచారాలు చేస్తే ఎవరినీ వదిలిపెట్టబోమని, ఎంత దూరమైనా న్యాయపోరాటం చేసి చట్ట ప్రకారం చర్యలు జరిగేలా చూస్తామని తెలిపారు. రాజ్యాంగ విలువలకు, వ్యక్తిగత గౌరవానికి భంగం కలిగించేలా ఆధారాలు లేకుండా ఆరోపణలు చేయడం సరికాదని పేర్కొన్నారు. హరీశ్‌రావు తరఫున దాఖలైన ఫిర్యాదులో భారతీయ న్యాయ సంహితలోని పరువు నష్టం నిబంధన కింద చర్యలు కోరినట్లు వార్తా కథనాలు పేర్కొన్నాయి. ఈ కేసులో తదుపరి విచారణకు సంబంధించిన ప్రక్రియను న్యాయస్థానం కొనసాగిస్తోంది. అడ్వకేట్ వీరమల్ల రామ్ నరసింహ గౌడ్ మాట్లాడుతూ, ప్రజాజీవితంలో ఉన్న వ్యక్తులపై ఆరోపణలు చేసేటప్పుడు వాటికి ఆధారాలు ఉండాలని, లేకుంటే బాధ్యత వహించాల్సి ఉంటుందని అన్నారు.

# గణనాథుడి నిమజ్జనంలో దండెం రాంరెడ్డి సందడి

- అబ్దుల్లాపూర్‌మెట్, కుంట్లూరులో ఘనంగా వేడుకలు..
- భక్తులతో కలిసి నిమజ్జనోత్సవంలో పాల్గొన్న బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు



**విశాల భారతి, అబ్దుల్లాపూర్ మెట్ :** అబ్దుల్లాపూర్‌మెట్ మండలం పెద్ద అంబర్‌పేట్ డివిజన్‌లో వినాయక నిమజ్జనోత్సవాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. అబ్దుల్లాపూర్‌మెట్ గ్రామంలోని ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్, కుంట్లూరు గ్రామంలోని రాకింగ్ యూత్ అసోసియేషన్ ఆహ్వానం మేరకు బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, ఇబ్రహీంపట్నం నియోజకవర్గానికి చెందిన దండెం రాంరెడ్డి నిమజ్జన వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా దండెం రాంరెడ్డికి నిర్వాహకులు, యువకులు ఘన స్వాగతం పలికి శాలువాతో సత్కరించారు. అనంతరం గణనాథుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గణపయ్య ఆశీస్సులతో నియోజకవర్గ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖశాంతులతో, పాడిపంటలతో ఆనందంగా ఉండాలని ఆయన ఆకాంక్షించారు. వేడుకల్లో యువకులు, మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని భక్తి ఉత్సాహంతో నిమజ్జన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ చైర్మన్ ఈదమల్ల బలరాం, సీనియర్ నాయకులు మాదుగుల వెంకటేష్ గౌడ్, జోర్క రాము ముదిరాజ్, తోర్పునూరి జంగయ్య, తోర్పునూరి శ్రీశైలం గౌడ్, అఖిల్ రెడ్డి, బండి ఉపేందర్, నామిని శ్రీనివాస్, కేతావత్ నరేష్, నాగు, నాగరాజు, వినోద్, రమేష్, రాజు, మహేందర్, రాము తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డుపక్కన ఆగిన పాల వాహనంలో మంటలు

- విద్యుత్ తీగ పడటంతో షార్ట్‌సర్క్యూట్.. అగ్నిమాపక సిబ్బంది
- సకాలంలో మంటల అదుపు





**విశాల భారతి, అబ్దుల్లాపూర్ మెట్ :** అబ్దుల్లాపూర్ మెట్ మండలం కొత్తగూడెం ఫ్రూట్ మార్కెట్ సమీపంలో రోడ్డుపక్కన నిలిపి ఉంచిన పాల వాహనంలో మంటలు చెలరేగిన ఘటన బుధవారం చోటుచేసుకుంది. అబ్దుల్లాపూర్ మెట్ ఇన్‌స్పెక్టర్ అశోక్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. కృష్ణా జిల్లా తోట్లవల్లూరు మండలం వల్లోరుపాలెం గ్రామానికి చెందిన చింతకుంట జయరాజ్ (51) డ్రైవర్‌గా పనిచేస్తూ విజయవాడ నుంచి ఎల్‌బీనగర్‌కు విజయ డెయిరీ పాలను తరలిస్తుంటాడు. ఈ క్రమంలో సెప్టెంబర్ 29న విజయవాడ నుంచి పాల వాహనం AP39VE5007లో పాలను తీసుకుని ఎల్‌బీనగర్‌కు చేరుకున్నాడు. పాలను అన్‌లోడ్ చేసిన అనంతరం సెప్టెంబర్ 30న మధ్యాహ్నం 12 గంటల సమయంలో తిరిగి విజయవాడకు బయలుదేరాడు. మధ్యాహ్నం 12.50 గంటల సమయంలో కొత్తగూడెం ఫ్రూట్ మార్కెట్ సమీపానికి చేరుకున్న జయరాజ్ టీ తాగేందుకు వాహనాన్ని రోడ్డుపక్కన నిలిపాడు. టీ తాగి తిరిగి వాహనం వద్దకు చేరుకునే సరికి పాల వాహనం నుంచి మంటలు చెలరేగుతున్నట్లు గుర్తించాడు. వెంటనే పోలీసులకు సమాచారం అందించడంతో పాటు అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. వాహనంపై విద్యుత్ తీగ పడటంతో షార్ట్‌సర్క్యూట్ జరిగి మంటలు చెలరేగినట్లు ఫిర్యాదుదారు పేర్కొన్నాడు. ఈ ఘటనపై ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు అబ్దుల్లాపూర్ మెట్ ఇన్‌స్పెక్టర్ అశోక్ రెడ్డి తెలిపారు.

# రైతు సంక్షేమమే సహకార సంఘం ధ్యేయం

- నిబంధనల ప్రకారమే డైరెక్టర్ నియామకం
- పెండింగ్ బకాయిల వసూళ్లకు సభ్యులు సహకరించాలి
- 59వ సర్వసభ సమావేశంలో సంఘం అభివృద్ధిపై కీలక చర్చ
- సహకార సంఘం చైర్మన్ కొత్తపల్లి జైపాల్ రెడ్డి



**విశాల భారతి, అబ్దుల్లాపూర్ మెట్ :**

రైతుల సంక్షేమం, వారి ఆర్థిక అభివృద్ధే బాటసింగారం సహకార సంఘం ప్రధాన లక్ష్యమని సంఘం చైర్మన్ కొత్తపల్లి జైపాల్‌రెడ్డి అన్నారు. అబ్దుల్లాపూర్ మెట్ మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో బుధవారం బాటసింగారం సహకార సంఘం 59వ సర్వసభ సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో సంఘం పనితీరు, సభ్యులకు అందిస్తున్న సేవలు, రుణ సదుపాయాలు, పెండింగ్ బకాయిలు, సంఘం ఆర్థిక పరిస్థితి తదితర అంశాలపై సభ్యులతో విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా సంఘం చైర్మన్ కొత్తపల్లి జైపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. రైతులకు అందుబాటులో ఉంటూ వారి అవసరాలకు అనుగుణంగా సహకార సేవలు అందించేందుకు సంఘం నిరంతరం కృషి చేస్తోందన్నారు. రైతులకు అవసరమైన రుణ సదుపాయాలు, ఇతర సేవలను మరింత సమర్థవంతంగా అందించాలంటే సంఘాన్ని ఆర్థికంగా, పరిపాలనా పరంగా బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. రైతుల ప్రయోజనాలను కేంద్రంగా చేసుకుని సంఘం కార్యకలాపాలను ముందుకు తీసుకెళ్తామని స్పష్టం చేశారు.

**నిబంధనల ప్రకారమే డైరెక్టర్ నియామకం**

సహకార సంఘంలో డైరెక్టర్ నియామకానికి సంబంధించి సమావేశంలో ప్రస్తావించిన అంశాలపై అధ్యక్షులు జైపాల్‌రెడ్డి స్పష్టత ఇచ్చారు. సంఘం నిబంధనలు, నిర్దేశిత విధివిధానాలకు అనుగుణంగానే డైరెక్టర్ నియామకం జరిగిందని తెలిపారు. సహకార సంఘం కార్యకలాపాలన్నీ నిబంధనల మేరకే కొనసాగుతున్నాయని పేర్కొన్నారు.

**బకాయిల చెల్లింపునకు సభ్యులు సహకరించాలి**

సంఘానికి సంబంధించిన పెండింగ్ రుణ బకాయిల వసూళ్లపై సమావేశంలో ప్రత్యేకంగా చర్చించారు. సభ్యులు తమ రుణ బకాయిలను నిర్ణీత సమయంలో చెల్లించి సంఘానికి సహకరించాలని జైపాల్‌రెడ్డి కోరారు. సభ్యులు సకాలంలో బకాయిలు చెల్లిస్తే సంఘం ఆర్థికంగా మరింత బలోపేతం అవుతుందని, తద్వారా భవిష్యత్‌లో మరింత మంది రైతులకు రుణాలు, ఇతర సహకార సేవలు అందించే అవకాశం ఉంటుందని వివరించారు.

**సంఘం అభివృద్ధిపై విస్తృత చర్చ**

59వ సర్వసభ సమావేశంలో సంఘం ప్రస్తుత ఆర్థిక పరిస్థితి, గత కార్యకలాపాలు, ఆదాయ వ్యయాలు, సభ్యులకు అందుతున్న సేవలు, రుణ వ్యవహారాలు, భవిష్యత్‌లో చేపట్టాల్సిన కార్యక్రమాలపై చర్చించారు. సంఘం అభివృద్ధికి సభ్యులు తమ సూచనలు, సలహాలు అందించాలని అధ్యక్షులు కోరారు. సభ్యులు, పాలకవర్గం, సిబ్బంది సమన్వయంతో పనిచేస్తే బాటసింగారం సహకార సంఘాన్ని మరింత బలోపేతం చేసి రైతులకు మెరుగైన సేవలు అందించవచ్చని జైపాల్‌రెడ్డి అన్నారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని సంఘం కార్యకలాపాలను పారదర్శకంగా, సమర్థవంతంగా ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో సహకార సంఘం డైరెక్టర్లు గంట శ్రీనివాస్ రెడ్డి, సంఘం మేనేజర్ జక్కుల ఐలేష్, అబ్దుల్లాపూర్ మెట్ సర్పంచ్ మందుగుల విజయ శ్రీశైలం గౌడ్, ఫిగ్లీపూర్ సర్పంచ్ కోట ప్రభాకర్ రెడ్డి, బలిజగూడ సర్పంచ్ ఉప్పు మాధవి నవీన్, కుంట్లూర్ డివిజన్ అధ్యక్షుడు భీమాగౌని భాస్కర్ గౌడ్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఉప్పు వెంకటేష్, ప్రజాప్రతినిధులు, నాయకులు, రైతులు, సభ్యులు పాల్గొన్నారు.

# కబడ్డీలో హోరాహోరీ పోరు



**జిల్లా జట్లకు ప్రతిభావంతుల ఎంపిక**

**మోటకొండూర్, విశాల భారతి:**

యాదాద్రి భువనగిరి జిల్లా SGF ఆధ్వర్యంలో మోటకొండూర్ మండలం మాటూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వేదికగా 70వ SGF అండర్-14 బాలబాలికల జిల్లా స్థాయి కబడ్డీ టోర్నమెంట్-కమ్-సెలెక్షన్స్ పోటీలు బుధవారం ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీకాంత్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ పోటీల్లో జిల్లాలోని వివిధ మండలాల నుంచి బాలబాలికల కబడ్డీ జట్లు పాల్గొన్నాయి. మైదానంలో ప్రతి పాయింట్ కోసం క్రీడాకారులు ప్రదర్శించిన పోరాటపటిమ, వేగం, వ్యూహరచన, జట్టు సమన్వయం ఆకట్టుకున్నాయి. హోరాహోరీగా సాగిన పోటీలతో మైదానం క్రీడాస్ఫూర్తితో సందడిగా మారింది. సెలెక్షన్స్‌లో క్రీడాకారుల ప్రతిభ, ఫిట్‌నెస్, క్రీడా నైపుణ్యం, క్రమశిక్షణ, జట్టు సమన్వయం తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను జిల్లా జట్లకు ఎంపిక చేశారు.

**క్రీడలు విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి పునాది**

ముగింపు కార్యక్రమంలో ఆలేరు నియోజకవర్గ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య మాట్లాడుతూ.. క్రీడలు విద్యార్థుల్లో క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, ఆత్మవిశ్వాసం, సమయపాలన, జట్టు స్ఫూర్తి, ఓటమిని స్వీకరించే ధైర్యాన్ని పెంపొందిస్తాయని అన్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థుల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీసేందుకు SGF పోటీలు గొప్ప వేదికగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. పోటీలను విజయవంతంగా నిర్వహించేందుకు సహకరించిన జిల్లా విద్యాశాఖ అధికారి బొల్లారం బిక్షపతి, SGF జిల్లా సెక్రటరీ కె. దశరథ్‌రెడ్డి, గ్రామ సర్పంచ్ జెన్నె సిద్ధులు, తుమ్మల కీర్తివర్ధన్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ చైతన్య మహేందర్‌రెడ్డి, ఉపసర్పంచ్ బైరపక రాములు, PET/PDలు, ఉపాధ్యాయులు, రిఫరీలు, వైద్య, పోలీస్ సిబ్బంది, స్వచ్ఛంద సేవకులు, తల్లిదండ్రులు, క్రీడాకారులకు ఆర్గనైజింగ్ సెక్రటరీ నాతి మల్లేష్ కృతజ్ఞతలు తెలిపారు. మాటూర్ పాఠశాల వేదికగా జిల్లా స్థాయి పోటీలను విజయవంతంగా నిర్వహించేందుకు సహకరించిన ప్రతి ఒక్కరినీ నిర్వాహకులు అభినందించారు. క్రీడాకారులకు మైదానం, వసతులు, భద్రత, వైద్య సహాయం తదితర ఏర్పాట్లు కల్పించడంతో పోటీలు సజావుగా సాగాయి. ముగింపు కార్యక్రమంలో విజేతలు, ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. జిల్లా జట్లకు ఎంపికైన క్రీడాకారులు తదుపరి స్థాయి పోటీలకు సిద్ధమై జిల్లా కీర్తిని రాష్ట్రస్థాయిలో చాటాలని నిర్వాహకులు ఆకాంక్షించారు.



# అగ్రివర్సిటీలో ఘనంగా అక్టోబర్ 2 గాంధీ జయంతి ఉత్సవాలు

- ముఖ్య అతిథిగా మంత్రి తుమ్మల.. హాజరుకానున్న పలువురు ప్రముఖులు



**రాజేంద్రనగర్, (విశాల భారతి):** జాతిపిత మహాత్మా గాంధీ 157వ జయంతి ఉత్సవాలను ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయంలో అక్టోబర్ 2న ఘనంగా నిర్వహించనున్నట్లు విశ్వవిద్యాలయ ఉపకులపతి ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య తెలిపారు. శుక్రవారం మధ్యాహ్నం 2 గంటలకు రాజేంద్రనగర్‌లోని విశ్వవిద్యాలయ ఆడిటోరియంలో ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరుకానున్నారని ఉపకులపతి తెలిపారు. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ మల్లు రవి, రాజేంద్రనగర్ శాసనసభ్యులు టి. ప్రకాష్ గౌడ్, శాసనమండలి సభ్యులు బి. మహేష్‌కుమార్ గౌడ్ గౌరవ అతిథులుగా పాల్గొననున్నారని పేర్కొన్నారు. అదేవిధంగా ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు ఉన్నం వెంకయ్య, జి. నర్సయ్య, గాంధీయన్ స్కాలర్ డాక్టర్ ఏ. రఘుకుమార్ ప్రత్యేక అతిథులుగా కార్యక్రమానికి హాజరుకానున్నారు. విద్యార్థుల్లో మహాత్మా గాంధీ సిద్ధాంతాలు, ఆయన ఆశయాలపై అవగాహన కల్పించడమే కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమని ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య తెలిపారు. గాంధీజీ జయంతిని పురస్కరించుకుని రాష్ట్రంలోని వివిధ విశ్వవిద్యాలయాల్లో నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ప్రత్యేక పోటీలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన ఉత్తమ విద్యార్థులకు గాంధీ జయంతి వేడుకల సందర్భంగా బహుమతులు అందజేయనున్నట్లు ఉపకులపతి వెల్లడించారు. విద్యార్థులు గాంధీజీ ఆలోచనలు, సత్యం, అహింస, సామాజిక బాధ్యత వంటి విలువలను జీవితంలో ఆచరించేలా ప్రోత్సహించడమే ఈ కార్యక్రమం లక్ష్యమని ఆయన పేర్కొన్నారు.

# బాలానగర్‌లో 'పౌర హక్కుల దినోత్సవం'.. బాధితులకు అండగా ఉంటామని అధికారుల హామీ!




**కూకట్ పల్లి, విశాల భారతి:** తెలంగాణ ప్రభుత్వ ఆదేశాల మేరకు బాలానగర్ తహసీల్దార్ ఆధ్వర్యంలో బుధవారం రాజు కాలనీ కమ్యూనిటీ హాల్‌లో 'పౌర హక్కుల దినోత్సవం' (సివిల్ రైట్స్ డే) కార్యక్రమాన్ని నిర్వహించారు. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ (ఆర్ఐ) నాగమణి నేతృత్వంలో నిబంధనల ప్రకారం జరిగిన ఈ కార్యక్రమంలో బాలానగర్ సబ్ ఇన్‌స్పెక్టర్ (ఎస్ఐ) మనోహర్ రెడ్డి, వివిధ శాఖల అధికారులు, స్థానిక దళిత నాయకులు పాల్గొన్నారు.

**చట్టాలపై అవగాహన.. సమస్యల పరిష్కారం:**

ఈ సందర్భంగా ఆర్ఐ నాగమణి మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీ చట్టాలు, పౌర హక్కుల పరిరక్షణపై ప్రతి ఒక్కరిలో అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశమని తెలిపారు. దళితులు, వెనుకబడిన వర్గాలు ఎదుర్కొంటున్న సమస్యలు, ఫిర్యాదులను స్వీకరించి, వాటిని త్వరితగతిన పరిష్కరించేందుకు రెవెన్యూ శాఖ కృషి చేస్తుందని హామీ ఇచ్చారు. అలాగే, బాలానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన ఎస్సీ, ఎస్టీ కేసులకు సంబంధించిన సమగ్ర వివరాల నివేదికను వెంటనే అందజేయాలని ఈ సందర్భంగా పోలీస్ అధికారులను ఆమె కోరారు.

**అస్పృశ్యత నివారణే లక్ష్యం:**

సమాజంలో అసమానతలు, అస్పృశ్యత నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై ఈ సమావేశంలో విస్తృతంగా చర్చించారు. బాధితులకు తగిన న్యాయం చేయడంతో పాటు, ప్రభుత్వం అందిస్తున్న వివిధ సంక్షేమ పథకాలు, అందుబాటులో ఉన్న చట్టపరమైన అవకాశాలపై అధికారుల బృందం స్థానికులకు సంపూర్ణ అవగాహన కల్పించింది.

# రైతులు విధిగా ఫార్మర్ ఐడి, క్రాప్ బుకింగ్ చేయించు కోవాలీ

- పాల్వంచ సొసైటీ అధ్యక్షులు కొత్వాల

**పాల్వంచ విశాల భారతి:** రైతులు విధిగా ఫార్మర్ ఐడి, క్రాప్ బుకింగ్ లు విధిగా చేయించుకోవాలని పాల్వంచ సొసైటీ అధ్యక్షులు కొత్వాల అన్నారు. బుధవారం పాల్వంచ సొసైటీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కొత్వాల మాట్లాడుతూ రైతులకు డిజిటల్ అగ్రి కల్చర్ మిషన్ ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కేటాయించే గుర్తింపు కార్డుకు విధిగా బుకింగ్ చేయించు కోవాలన్నారు. దీని వలన పి.ఎం. కిసాన్ నిధులు, రైతు భరోసా, పంట నష్టపరిహారం వంటి నగదు బదిలీలు నేరుగా బ్యాంక్ ఖాతాల్లో జమ అవు తాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టే సన్న ధాన్యానికి క్వింటాకు 500 రూ॥లు బోనస్ పొందాలంటే పంట సాగు వివరాలు (క్రాప్ బుకింగ్) నమోదు చేయించుకోవాలన్నారు . రైతులు సకాలంలో రుణాలు చెల్లించి 3 శాతం వడ్డీ రాయితీని పొందవచ్చు అని అన్నారు. రైతులు సొసైటీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కొత్వాల అన్నారు. ఈ సమావేశంలో సొసైటీ వైస్ చైర్మన్ కాంపెల్లి కనకేష్, డైరెక్టర్లు కనగాల నారాయణ రావు, సామా జనార్ధన్ రెడ్డి, చౌగాని పాపారావు, భూక్యా కిషన్, యర్రంశెట్టి మధుసూధన్ రావు, సి.ఇ.ఒ. జి. లక్ష్మీ నారాయణ తదితరులు పాల్గొన్నారు.



# గిరిజనుల గుండెల్లో కేసీఆర్‌కు చెరగని స్థానం

- 6 శాతం రిజర్వేషన్‌ను 10 శాతానికి పెంచిన మహానుభావుడు కేసీఆర్
- గిరిజన బిడ్డల భవిష్యత్తుకు బాటలు వేసిన నాయకుడు
- తండాలను గ్రామ పంచాయతీలుగా తీర్చిదిద్దిన ఘనత కేసీఆర్‌దే
- గిరిజనుల ఆత్మగౌరవానికి పెద్దపీట వేసిన కేసీఆర్ పాలనను గుర్తు చేసుకోవాలి
- మాజీ మంత్రి సత్యవతి రాథోడ్

**మహబూబాబాద్ జిల్లా**

**విశాల భారతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్.**



గిరిజనుల హక్కులు, ఆత్మగౌరవం, గిరిజన బిడ్డల భవిష్యత్తు కోసం మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ చేసిన కృషి చిరస్మరణీయమని మాజీ మంత్రి శ్రీమతి సత్యవతి రాథోడ్ కొనియాడారు. గిరిజనుల కోసం కేసీఆర్ అందించిన పాలనను, ఆయన తీసుకున్న చారిత్రాత్మక నిర్ణయాలను ప్రతి గిరిజన బిడ్డ గుర్తు చేసుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. మహబూబాబాద్ రామచంద్రపురంలోని తన క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు.

**6 నుంచి 10 శాతానికి.. చరిత్రాత్మక నిర్ణయం.**

గిరిజనులకు ఎన్నో ఏళ్లుగా కేవలం 6 శాతం రిజర్వేషన్ మాత్రమే ఉండేదని, గిరిజన సమాజం చిరకాలంగా ఎదురుచూస్తున్న 10 శాతం రిజర్వేషన్ ఆకాంక్షను గుర్తించిన కేసీఆర్ ప్రభుత్వం 2022 సెప్టెంబర్ 30న కీలక నిర్ణయం తీసుకుందని సత్యవతి రాథోడ్ తెలిపారు. గిరిజన రిజర్వేషన్‌ను 6 శాతం నుంచి 10 శాతానికి పెంచిన ఘనత కేసీఆర్‌దేనని ఆమె కొనియాడారు. గిరిజన బిడ్డల విద్య, ఉద్యోగ అవకాశాలను పెంచేలా రిజర్వేషన్‌ను 10 శాతానికి పెంచిన కేసీఆర్‌ను గిరిజన సమాజం ఎప్పటికీ మర్చిపోదని అన్నారు. తరతరాలుగా ఉన్న గిరిజనుల ఆకాంక్షకు రాజకీయ నిర్ణయం రూపంలో కార్యరూపం ఇచ్చిన గొప్ప నాయకుడు కేసీఆర్ అని సత్యవతి రాథోడ్ ప్రశంసించారు.

**తండాలను పంచాయతీలుగా మార్చిన ఘనత కేసీఆర్‌దే.**

తరతరాలుగా తండాల్లో నివసిస్తూ ప్రత్యేక గుర్తింపు కోసం ఎదురుచూస్తున్న గిరిజనుల ఆకాంక్షను కేసీఆర్ ప్రభుత్వం నెరవేర్చిందని సత్యవతి రాథోడ్ అన్నారు. తండాలను గ్రామ పంచాయతీలుగా తీర్చిదిద్ది, వాటికి ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందని పేర్కొన్నారు. తండాల ప్రజలకు స్థానిక పాలనలో భాగస్వామ్యం కల్పించి, తమ ప్రాంత అభివృద్ధిపై తమకే నిర్ణయాధికారం ఉండేలా మార్గం సుగమం చేసిన ఘనత కేసీఆర్ పాలనలోనే జరిగిందని ఆమె గుర్తుచేశారు.

**గిరిజన బిడ్డల కోసం గురుకులాల విస్తరణ**

గిరిజన బిడ్డలు విద్యలో వెనుకబడకూడదనే లక్ష్యంతో గిరిజన ప్రాంతాల్లో గురుకుల పాఠశాలలను ఏర్పాటు చేసి విద్యా అవకాశాలను విస్తరించారని సత్యవతి రాథోడ్ తెలిపారు. గిరిజన విద్యార్థులకు మెరుగైన విద్య అందించేందుకు కేసీఆర్ ప్రభుత్వం తీసుకున్న చర్యలు వారి భవిష్యత్తుకు బలమైన పునాది వేశాయని అన్నారు.

**పోడు భూముల సమస్యకు పరిష్కారం చూపే దిశగా అడుగులు వేసిన నాయకుడు.**

దశాబ్దాలుగా గిరిజనులను వెంటాడుతున్న పోడు భూముల సమస్యను పరిష్కరించే దిశగా కేసీఆర్ ప్రభుత్వం చర్యలు చేపట్టిందని సత్యవతి రాథోడ్ పేర్కొన్నారు. అర్హులైన గిరిజనులకు పోడు భూములపై హక్కులు కల్పించే ప్రక్రియను చేపట్టడం ద్వారా వారి భూమి హక్కులకు భరోసా కల్పించే ప్రయత్నం జరిగిందని తెలిపారు.

**గిరిజనుల కోసం చేసిన సేవను మరువలేం.**

గిరిజన బిడ్డల కోసం.. గిరిజన తండాల కోసం.. గిరిజన సమాజం ఆత్మగౌరవం కోసం కేసీఆర్ చేసిన కృషిని ఈ జన్మలో మర్చిపోలేమని సత్యవతి రాథోడ్ అన్నారు. గిరిజనుల అభివృద్ధి, సంక్షేమం కోసం కేసీఆర్ పాలనలో తీసుకున్న నిర్ణయాలు చరిత్రలో నిలిచిపోతాయని పేర్కొన్నారు.

**రిజర్వేషన్ పెంపు.. తండాలకు పంచాయతీ హోదా..**

గురుకుల విద్యా వ్యవస్థ విస్తరణ.. పోడు భూముల సమస్య పరిష్కారానికి చర్యలు వంటి నిర్ణయాలు గిరిజనుల జీవితాల్లో మార్పు తీసుకురావడానికి దోహదపడ్డాయని ఆమె అన్నారు. గిరిజనుల హక్కులు, ఆత్మగౌరవం, గిరిజన బిడ్డల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని కేసీఆర్ అందించిన పరిపాలనను గిరిజన సమాజం గుర్తు చేసుకోవాలని సత్యవతి రాథోడ్ పిలుపునిచ్చారు. గిరిజనుల కోసం తన పాలనలో కీలక నిర్ణయాలు తీసుకున్న కేసీఆర్‌కు గిరిజన సమాజం తరపున హృదయపూర్వక ధన్యవాదాలు తెలుపుతున్నట్లు ఆమె పేర్కొన్నారు.

**కేసీఆర్ పాలనలో భాగస్వామ్యం కావడం గర్వకారణం.**

గిరిజనుల కోసం కేసీఆర్ ప్రభుత్వం తీసుకున్న అనేక నిర్ణయాల్లో తాను కూడా భాగస్వామిగా ఉండటం తనకు గర్వంగా ఉందని సత్యవతి రాథోడ్ అన్నారు. గిరిజన సమాజం కోసం పనిచేసే వ్యక్తిగా కేసీఆర్ పాలనలో గిరిజనుల కోసం జరిగిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను దగ్గరగా చూడటం తనకు ఎంతో సంతృప్తిని ఇచ్చిందని తెలిపారు. కార్యక్రమంలో మహబూబాబాద్ మాజీ శాసనసభ్యులు బానోత్ శంకర్ నాయక్, జెడ్పీ చైర్‌పర్సన్ కుమార్ బిందు అంగోత్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ ఎండి ఫరీద్, మాజీ మండల బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ అశోక్, ఐలి నరహరి గౌడ్, బోడ శ్రీను నాయక్, ఎడ్ల శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# రజనీకాంత్ 'ధర్మన్'లో శ్రీలీల

సూపర్‌స్టార్ రజనీకాంత్ ప్రధాన పాత్రలో తెరకెక్కుతున్న 'ధర్మన్' సినిమాకు సంబంధించి రోజుకో ఆసక్తికరమైన విషయం బయటకు వస్తోంది. ఇప్పటికే ఈ సినిమాలో రామ్ పోతినేని నటిస్తున్నారనే విషయం హీరోయిన్ రాశీ ఖన్నా అనుకోకుండా వెల్లడించిన సంగతి తెలిసిందే. తాజాగా మరో కీలక అప్‌డేట్ వెలుగులోకి వచ్చింది. ఈ చిత్రంలో శ్రీలీల కూడా భాగమైనట్లు తాజా వీడియోతో స్పష్టమైంది. 'ధర్మన్' సినిమా షూటింగ్ జరుగుతున్న ప్రాంతం నుంచి తాజాగా ఓ వీడియో సోషల్ మీడియాలో ప్రత్యక్షమైంది. ఇందులో శ్రీలీల సంప్రదాయ దుస్తుల్లో కనిపించారు. దీంతో ఈ సినిమాలో ఆమె నటిస్తున్నారనే విషయం దాదాపు ఖరారైంది. ఇప్పటివరకు చిత్రబృందం శ్రీలీల పాత్రకు సంబంధించి ఎలాంటి అధికారిక వివరాలను వెల్లడించలేదు.ఆమె సినిమాలో ఎలాంటి పాత్రలో కనిపించనున్నారు? రజనీకాంత్ పాత్రతో ఆమెకు ఎలాంటి సంబంధం ఉంటుంది? కథలో ఆమె పాత్రకు ఎంత ప్రాధాన్యత ఉంటుంది? అనే విషయాలు మాత్రం ప్రస్తుతానికి సస్పెన్స్‌లోనే ఉన్నాయి. శ్రీలీల 'ధర్మన్'లో నటిస్తున్నారనే వార్త బయటకు రావడంతో మరో ఆసక్తికరమైన చర్చ మొదలైంది. ఈ సినిమాలో రామ్ పోతినేని కూడా కీలక పాత్రలో నటిస్తున్న నేపథ్యంలో.. శ్రీలీల ఆయనకు జోడీగా కనిపించబోతున్నారనే ప్రచారం జరుగుతోంది. ఇప్పటికే రామ్ పోతినేని, శ్రీలీల కలిసి 'స్కంద' సినిమాలో నటించారు. ఆ సినిమాలో వీరిద్దరి కెమిస్ట్రీకి మంచి గుర్తింపు వచ్చింది. దీంతో 'ధర్మన్'లో కూడా వీరిద్దరూ జంటగా కనిపిస్తే మరోసారి అభిమానులకు ఆసక్తికరమైన కాంబినేషన్ అవుతుందని సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gangarapu Vijay. RNI No APTEL/2010/32877.